బుధవారం
16•10•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 111
• పేజీలు : 14 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

యూపీలో భారీగా హోంగార్డుల తొలగింపు

- 25 వేలమందికి ఉద్వాసన
- మరో 99 వేలమంది పనిదినాల కుదింపు
- నిధుల కొరతే కారణమని వెల్లడి
- హోంగార్డులను ఎవ్వరినీ తొలగించడంలేదంటూ మంత్రి భిన్నస్వరం

లక్నో, అక్టోబర్ 15: వెలుగుల పండుగ దీపావళి ఈసారి ఉత్తరప్రదేశ్ హోంగార్డుల కుటుంబాల్లో చీకట్లను నింపనున్నది. ఆ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే దీనికి ప్రధాన కారణం. తగినంత బడ్జెట్ లేని కారణంగా రాష్ట్రంలోని 25 వేల మంది హోంగార్డులను విధుల నుంచి తొలగిస్తూ యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకున్నది. పోలీస్ స్టేషన్లు, ట్రాఫిక్ సిగ్నళ్ల దగ్గర పనిచేసే వేలాది మంది హోంగార్డులు ఉద్వాసన జాబితాలో ఉన్నారు. దీంతోపాటు రాష్ట్రంలో పనిచేస్తున్న మరో 99వేల మంది హోంగార్డుల పనిదినాల్ని కూడా ప్రభుత్వం కుదించింది. గతంలో 25 రోజులుగా ఉన్న వీళ్ల పనిదినాల్ని ప్రస్తుతం 15 రోజులకు తగ్గించింది. ఈ మేరకు వీరి వేతనాల్లో భారీగా కోత పడనుంది. యూపీ

మిగతా 5వ పేజీలో

అయోధ్య కేసు విచారణ నేడు ఆఖరు!

40 రోజులుగా కొనసాగుతున్న వాదోపవాదాలు
త్వరలో తీర్పు వెలువడే అవకాశం

5

అయోధ్యలో రామజన్మభూమి-బాబ్రీ మసీదు స్థల వివాదంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం జరుపుతున్న రోజువారీ విచారణ బుధవారంతో ముగిసే అవకాశాలున్నాయి. వాదోపవాదనలను బుధవారం నాడే ముగిస్తామని మంగళవారం కొనసాగిన విచారణ సందర్భంగా సీజేఐ రంజన్‌గొగోయ్ సంకేతాలిచ్చారు. 40 రోజులపాటు జరిగిన వాదోపవాదనలను సమగ్రంగా విశ్లేషించిన అనంతరం ధర్మాసనం త్వరలో తీర్పును వెలువరించే అవకాశం ఉన్నది. నవంబర్ 17వ తేదీన సీజేఐ రంజన్ గొగోయ్ పదవీ విరమణ చేయనున్నారు.

సమ్మె విరమించండి

మంగళవారం నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో టీఎన్జీవో, టీజీవో నాయకులు కారం రవీందర్‌రెడ్డి, మమతలతో సమావేశమైన ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి తదితరులు

పిలిస్తే చర్చలకు సిద్ధం: ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి
ఆర్టీసీ సమ్మెకు ఉద్యోగ జేఏసీ, టీఎన్జీవో సంఘీభావం
ఆర్టీసీ సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తాం • నేడు సీఎస్‌కు వినతిపత్రం ఇస్తాం
ఉద్యోగ జేఏసీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి
సమ్మె పరిస్థితులపై మంత్రి పువ్వాడ సమీక్ష • 100శాతం బస్సులు నడపాలని ఆదేశం

యథాతథంగా బస్సు సర్వీసులు

- రోడ్డెక్కిన 62% ఆర్టీసీ బస్సులు
- ప్రజల ప్రయాణం సాధారణ స్థితికి
- టిమ్స్, టికెట్ల ద్వారా చార్జీల వసూలు
- వందశాతం బస్సులు నడిపేందుకు చర్యలు
- 11వ రోజూ కనిపించని సమ్మె ప్రభావం

7

మంగళవారం ఖమ్మం బస్టాండ్‌లో ప్రయాణికులను తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు

ప్రభుత్వంతో చర్చలు జరుపండి

- పండుగముందు ప్రజలను ఇబ్బంది పెడుతారా!
- మీపై ఎస్మా ఎందుకు ప్రయోగించకూడదు?
- నిరసన తెలిపేందుకు చాలా మార్గాలున్నాయి
- ఆర్టీసీ కార్మికసంఘాల సమ్మెపై హైకోర్టు

ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరుపండి • రెండురోజుల్లో సమస్య పరిష్కరించండి
ఆర్టీసీకి వెంటనే ఎండీని నియమించాలి • ప్రభుత్వానికి హైకోర్టు ధర్మాసనం సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమించి ప్రభుత్వంతో చర్చలు జరుపాలని, ప్రభుత్వం కూడా రెండ్రోజుల్లో సమస్యను పరిష్కరించేలా చర్చలు నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు సూచించింది. పండుగ సీజన్‌లో సమ్మెకు దిగిన ఆర్టీసీ కార్మికులపై ఆగ్రహం వ్యక్తంచేసిన హైకోర్టు.. డిమాండ్లు సాధించుకునే క్రమంలో నిరసన తెలియజేయటానికి చాలామార్గాలు ఉన్నాయని పేర్కొన్నది. మహాభారత యుద్ధానికి ముందు కూడా చర్చలు జరిగాయని, చర్చలు విఫలం అయిన ప్పుడే యుద్ధం మొదలైందని వ్యాఖ్యానించింది. కార్మికుల డిమాండ్లలో ఒకటైన ఆర్టీసీ ఎండీ నియామకాన్ని వెంటనే చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం చర్చలకు ఆహ్వానిస్తే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ అశ్వత్థామరెడ్డి విచారణ అనంతరం మీడియాకు చెప్పారు. ప్రస్తుతానికి సమ్మె యథాతథంగా కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఆర్టీసీ సమ్మెకు ఉద్యోగసంఘాల జేఏసీ మద్దతు ప్రకటించింది. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేసే పరిస్థితులు రావడం దురదృష్టకరమని ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి అన్నారు. సమ్మె పరిష్కారం కాకుంటే ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఆందోళనకు దిగే ప్రమాదమున్నదని పేర్కొన్నారు. మంగళవారం ఉద్యోగసంఘాల జేఏసీ నాయకులతో ఆర్టీసీ జేఏసీ నాయకులు సమావేశమై, సమ్మెకు మద్దతు కోరారు. ప్రభుత్వంతో చర్చలకు కారం రవీందర్‌రెడ్డిని పంపుతామని అశ్వత్థామరెడ్డి చెప్పారు. ఇదిలా ఉంటే.. ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వాన్ని కలిసి చర్చలు జరుపాలని టీఆర్ఎస్ సెక్రటరీ జనరల్, ఎంపీ కే కేశవరావు సూచించారు. సీఎం కేసీఆర్ ఆదేశిస్తే కచ్చితంగా చర్చలు జరుపుతానన్నారు. తాను సోషలిస్టునని, రాజ్యం వైపు ఎప్పుడూ ఉండనన్న కేకే.. కార్మికులవైపే ఉంటానని స్పష్టంచేశారు.

పండుగ ముందు ఇబ్బంది పెడుతారా?

తెలంగాణ ప్రజలకు ముఖ్యమైన దసరా పండుగ ముందు సమ్మెకు వెళ్లి వారిని ఇబ్బంది పెడుతున్నారని ఆర్టీసీ కార్మికసంఘాలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. కార్మికసంఘాల డిమాండ్లు, ప్రభుత్వానికి ఉన్న సమస్యలు తమకు ముఖ్యంకాదని, సామాన్య ప్రజలు కష్టాలుపడుతున్న తీరే తమకు ఆందోళన కలిగిస్తున్నదని పేర్కొన్నది. ఆర్టీసీ సమ్మెను విరమింపజేసి, ప్రజల ఇబ్బందులు తొలగించాలని దాఖలైన

మిగతా 2వ పేజీలో

ఎల్ఆర్ఎస్‌కు పచ్చజెండా

కొత్త కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ప్లాట్ల క్రమబద్ధీకరణకు అనుమతి
జీవో విడుదల • 2018 మార్చి 30 కన్నా ముందటి స్థలాల క్రమబద్ధీకరణ
నేటినుంచి 90 రోజుల్లోపు దరఖాస్తుకు అవకాశం • దరఖాస్తు ఫీజు రూ.10 వేలు
తుదిఫీజు చెల్లించిన 6 నెలల్లో ఎల్ఆర్ఎస్ పత్రం • మురికివాడల్లో చ.మీ.కు రూ.5కే క్రమబద్ధీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలోని 73 కొత్త కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిల్లో స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 2018 మార్చి 30 లేదా అంతకంటే ముందు అనధికార లేదా అక్రమ లేఅవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్ల క్రమబద్ధీకరణకు అనుమతిస్తూ పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ మంగళవారం జీవో విడుదల చేశారు. 'తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో అనధికార, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ 2019 నిబంధనలు'గా పేర్కొన్నారు. దీనిప్రకారం.. హెచ్ఎండీఏ, కుడా, బాసర అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, కొత్త కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, మాస్టర్ ప్లాన్ పరిధిలోకి వచ్చే గ్రామ పంచాయతీల్లో కొనుగోలు చేసిన అనుమతిలేని ప్లాట్లను రెగ్యులరైజ్ చేస్తారు. ప్లాట్లను క్రమబద్ధీకరించాలంటూ కొంతకాలంగా ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. స్థల యజమానులు, ప్రైవేటు డెవలపర్లు, సంస్థలు, వివిధ సంఘాలు 2018 మార్చి 30 కంటే ముందు రిజిస్టర్డ్ సేల్‌డీడ్ ద్వారా విక్రయించిన ప్లాట్లకు తాజా నిబంధనలు వర్తిస్తాయి. అనధికార లేఅవుట్లలో అస్తవ్యస్త అభివృద్ధిని క్రమబద్ధీకరించేందుకే ప్రభుత్వం రెగ్యులరైజేషన్‌కు అంగీకరించింది. యూఎల్సీ చట్టం 1976, ఏపీ భూసంస్కరణల చట్టం 1973 కింద క్లియరెన్స్ పొంది, రెవెన్యూ శాఖ

మిగతా 6వ పేజీలో

2019లో వృద్ధి 6.1%

భారత వృద్ధి అంచనాల్లో కోత విధించిన ఐఎంఎఫ్

ఏప్రిల్‌లో అంచనావేసిన 7.3%తో పోలిస్తే 1.2% తక్కువ

9

అయినప్పటికీ వేగవంతమైన వృద్ధిని సాధిస్తున్న దేశంగా భారత్

తెలంగాణకు 79 టీఎంసీలు

ఏపీ ఇండెంట్‌లో 69.34 టీఎంసీలకే అనుమతి
నీటి విడుదల ఉత్తర్వులు జారీచేసిన కృష్ణా బోర్డు

2

అధిక వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని అనుమతులు

ప్రతి పట్టణానికి ప్రణాళిక

- వారంలో సిటీ శానిటేషన్ ప్లాన్ తయారుచేయాలి
- జిల్లా కలెక్టర్లకు పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ఆదేశం
- పురపాలక సిబ్బందికి బీమా సౌకర్యం
- నగరాల్లో మరిన్ని షీ- టాయిలెట్ల నిర్మాణం
- ప్రతి మున్సిపాలిటీ బడ్జెట్‌లో గ్రీనరీకి పదిశాతం కేటాయింపు

2

మంగళవారం తూర్పుగోదావరి జిల్లా మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డులో వాలి సుగ్రీవుడి కొండ సమీపంలో లోయలో పడిన టెంపో

లోయలో పడిన టూరిస్టు టెంపో

ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం
ఎనిమిదిమంది దుర్మరణం
భద్రాచలం నుంచి అన్నవరం వెళ్తుండగా ఘటన
బాధితులు కర్ణాటక రాష్ట్రం
చిత్రదుర్గ జిల్లా చెలకేరికి చెందినవారు

3

చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)			
ఫారం ధర	75.00	రిటైల్ లైవ్	97.00
డ్రెస్‌డ్	141.00	స్కిన్‌లెస్	160.00

గుడ్ల ధరలు (పందకు) (రూ.)			
హైదరాబాద్	390.00	రంగారెడ్డి	390.00
మెదక్	390.00	కరీంనగర్	393.00
వరంగల్	393.00	చిల్లర ధర	4.50

రికార్డుల 'బుకర్'

మొదటిసారిగా ఇద్దరికి..
విజేతలుగా అట్వుడ్, ఎవారిస్టో
తుది జాబితా దగ్గరే
ఆగిపోయిన సల్మాన్ రష్దీ

5



తెలంగాణ 79 టీఎంసీలకు ఓకే

- ఏపీ ఇండెంట్‌లో 69.34 టీఎంసీలకే అనుమతి
- నీటి విడుదల ఉత్తర్వులు జారీచేసిన కృష్ణా బోర్డు
- అధిక వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని అనుమతులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వచ్చే నవంబర్ వరకు తాగు, సాగునీటి అవసరాల కోసం 79 టీఎంసీల నీటి విడుదలకు అనుమతి ఇవ్వాలంటూ తెలంగాణ సమర్పించిన ఇండెంట్‌కు కృష్ణా నదీ యాజమాన్యబోర్డు ఓకే చెప్పింది. 150 టీఎంసీలు కావాలంటూ ఆంధ్రప్రదేశ్ పెట్టుకున్న ఇండెంట్‌లో మాత్రం భారీ కోత పెట్టింది. ఇప్పటికే అదనంగా నీటిని వాడుకున్న ఆ రాష్ట్రానికి 69.34 టీఎంసీలకే అనుమతినిచ్చింది. ఈ మేరకు శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి తెలుగు రాష్ట్రాలకు కృష్ణా జలాల వినియోగానికి మంగళవారం నీటివిడుదల ఉత్తర్వులు జారీచేసింది. నవంబర్ నెల వరకు నీటి అవసరాల కోసం తెలంగాణ 79 టీఎంసీలకు, ఏపీ 150 టీఎంసీలకు ఇటీవల ఇండెంట్లు సమర్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 4వ తేదీ వరకు రెండు రాష్ట్రాల వినియోగ లెక్కలను పరిగణనలోకి తీసుకున్న బోర్డు తెలంగాణ 79 టీఎంసీలు, ఏపీ 69.34 టీఎంసీలు వాడుకునేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెల 4 వరకు శ్రీశైలం జలాశయంలో కనిష్ఠ నీటి సేకరణ స్థాయి (ఎండీడీఎల్) ఎగువన 156.65 టీఎంసీలు, నాగార్జునసాగర్‌లో 179.181 టీఎంసీలు కలిపి మొత్తం 335.84 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. ఆ తేదీ వరకు రెండు జలాశయాల నుంచి ఏపీ 232.65 టీఎంసీలు, తెలంగాణ 48.43 టీఎంసీలు వాడుకున్నాయి. ఇందులో ఏపీ గత అనుమతుల (152 టీఎంసీలు) కంటే 82.39 టీఎంసీలు ఎక్కువగా వాడుకున్నది. ఏపీ అధికంగా వాడుకున్న నీటిని మినహాయించి 69.34 టీఎంసీలకు, తెలంగాణ అనుమతులకు లోబడి వాడుకున్నందున అడిగిన మేరకు 79 టీఎంసీలకు నీటి విడుదల ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఈ నీటి సంవత్సరంలో ఇప్పటివరకు బోర్డు ఏపీకి 302, తెలంగాణకు 127.43 టీఎంసీల నీటి వినియోగానికి అనుమతి ఇచ్చినట్టయింది.

ఏ ప్రాజెక్టు నుంచి ఎంతెంత?

ఆంధ్రప్రదేశ్: పోతిరెడ్డిపాడు-3.30, హంద్రీనీవా-9.74, సాగర్ ఎడమకాల్వ 5.52, కుడికాల్వ 42.55, కృష్ణా డెల్టా నుంచి 8.49 టీఎంసీల చొప్పున మొత్తం 69.34 టీఎంసీలు వాడుకోవచ్చు.

తెలంగాణ: సాగర్ ఎడమకాల్వ 45, ఏఎమ్మార్పీ/హైదరాబాద్ తాగునీరు-17, మిషన్ భగీరథ -2, కల్వకుర్తి లిఫ్టు నుంచి 15 టీఎంసీలు కలిపి 79 టీఎంసీలు వాడుకోవచ్చు.

నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఫైల్ ఫొటో)

అపరిశుభ్రతకు రూ.17 లక్షల జరిమానా

- స్వచ్ఛతను పాటించండి: జీహెచ్‌ఎంసీ చందానగర్ ఉపకమిషనర్ యాదగిరిరావు

చందానగర్, నమస్తే తెలంగాణ: అపరిశుభ్రతకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) చందానగర్ సర్కిల్ పరిధిలో అధికారులు మంగళవారం భారీగా జరిమానాలు విధించారు. చందానగర్ సర్కిల్ పరిధిలోని నాలుగు డివిజన్లలో తనిఖీలు చేసి రూ.17,03,600 జరిమానాగా (సిద్ధిక్‌నగర్ డెవలప్‌మెంట్ కమిటీ చలాన్లు) వసూలు చేశారు. ఈ సందర్భంగా చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ యాదగిరిరావు మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని అన్నారు. స్వచ్ఛతలో భాగంగా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి పరిసరాలు, దుకాణాలు, రోడ్డు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా నడుచుకున్నవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇక పట్టణ పారిశుద్ధ్య ప్రణాళిక

వారంలో సిటీ శానిటేషన్ ప్లాన్ తయారుచేయాలి.. జిల్లా కలెక్టర్లకు పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ఆదేశం

- పురపాలక సిబ్బందికి బీమా సౌకర్యం
- నగరాల్లో మరిన్ని షీ- టాయిలెట్ల నిర్మాణం
- ప్రతి మున్సిపాలిటీ బడ్జెట్‌లో గ్రీనరీకి పదిశాతం కేటాయింపు

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న పురపాలకశాఖ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీల్లో 30 రోజుల ప్రణాళిక సాధించిన పారిశుద్ధ్య ప్రగతి స్ఫూర్తితో పట్టణాల్లోనూ పారిశుద్ధ్య ప్రణాళిక రూపొందిస్తున్నట్టు పురపాలక శాఖ మంత్రి కే తారకరామారావు తెలిపారు. ఇందుకోసం ప్రతి పట్టణానికి సంబంధించిన సమగ్రమైన పారిశుద్ధ్య ప్రణాళిక (సిటీ శానిటేషన్ ప్లాన్) తయారుచేసి, వారం రోజుల్లో డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ)కు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయం నుంచి మంత్రి కేటీఆర్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 30 రోజుల ప్రణాళికతో గ్రామ పంచాయతీల్లో సత్ఫలితాలు వచ్చాయని, పట్టణాల్లోనూ ఇదే మాదిరి కార్యక్రమాన్ని త్వరలో చేపట్టనున్నట్టు తెలిపారు. చెత్తసేకరణ నుంచి రీసైక్లింగ్ వరకు అన్నివివరాలతో ప్రతి పట్టణంలోనూ పారిశుద్ధ్య ప్రణాళికను తయారుచేయాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ మార్గదర్శకాల మేరకు పురపాలికల్లో పారిశుద్ధ్య కార్మికులు, వాహనాల సంఖ్య ఉండేలా చూడాలని, ప్రతి ఇంటినుంచి తడి, పొడి చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇప్పటికే పాత మున్సిపాలిటీల్లో స్వచ్ఛ ఆటోలను అందజేశామని.. ఇంకా అవసరం ఉంటే వాహనాలు, సిబ్బందిని పెంచుకోవచ్చని చెప్పారు. ప్రతి పారిశుద్ధ్య కార్మికునికి యూనిఫాంతో పాటు అవసరమైన రక్షణ సామగ్రిని సమకూర్చాలన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించేలా ఆయా ఏజెన్సీలను ఆదేశించాలని, పంచాయతీ సిబ్బందికి ఇస్తున్న విధంగానే పురపాలక సిబ్బందికి కూడా ప్రభుత్వ బీమా సౌకర్యాన్ని కల్పిస్తామని కేటీఆర్ తెలిపారు.

పట్టణానికో డంపింగ్‌యార్డు

ప్రతి పట్టణంలోనూ డంపింగ్‌యార్డు ఉండాలని, అవి లేనిచోట వెంటనే స్థల సేకరణకు చర్యలు తీసుకోవాలని మంత్రి కేటీఆర్ కలెక్టర్లకు సూచించారు. విధిగా డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్ (డీఆర్సీ)ను ఏర్పాటుచేయాలన్నారు. ఇప్పటికే అన్ని మున్సిపాలిటీలు ఓపెన్ డెనకేషన్ ఫ్రీ (ఓడీఎఫ్) అర్హత సాధించాయని, కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల్లోనూ ఓడీఎఫ్ స్థాయిని అందుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణపై దృష్టి సారించాలని, అవసరమైనచోట్ల కొత్తవాటిని నిర్మించాలని, మహిళల కోసం ప్రత్యేక షీ- టాయిలెట్లు ఏర్పాటుచేయాలని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెట్రోల్ బంకులు, రెస్టారెంట్లలోని టాయిలెట్లను ప్రజలు ఉపయోగించుకునే అవకాశం కల్పించాలని, ఈ మేరకు వాటి యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటుచేయాలని సూచించారు. వరంగల్, సిరిసిల్లలో మాదిరిగా ప్రతి పట్టణంలోనూ మానవ వ్యర్థాల ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుచేసుకునే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

గ్రీన్ యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేయాలి

నూతన మున్సిపాలిటీ చట్టం అమలుపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కేటీఆర్ ఆదేశించారు. చట్టంలో పేర్కొన్నట్టుగా గ్రీన్ యాక్షన్‌ప్లాన్ తయారు చేయాలన్నారు. పట్టణాల్లో పచ్చదనాన్ని పెంచేందుకు పురపాలిక బడ్జెట్‌లో పదిశాతం కేటాయించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి పట్టణంలోనూ నర్సరీలను నిర్వహించాలని, పట్టణశివారుల్లో గ్రీన్ లంగ్స్‌పేస్‌లను ఏర్పాటుచేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. పట్టణాల్లో ఉన్న తాగునీటి వనరుల మదింపు (ఆడిట్) చేయాలని సూచించారు. సమావేశంలో పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్, డీఎంఏ శ్రీదేవి, వాటర్ బోర్డు ఎండీ దానకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమించండి

మొదటిపేజీ తరువాయి...

పిల్‌పై చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. కార్మికులు తమ చట్టబద్ధమైన డిమాండ్లను సాధించుకొనే క్రమంలో నిరసన తెలియజేయడానికి చాలా మార్గాలు ఉన్నాయని, సమ్మె ద్వారా ప్రజలను ఇబ్బందులకు గురిచేయటం సమంజసం కాదని ధర్మాసనం పేర్కొన్నది.

మహాభారత యుద్ధానికి ముందు కూడా చర్చలు

మహాభారత యుద్ధానికి ముందు కూడా చర్చలు జరిగాయని, చర్చలు విఫలమైనప్పుడే యుద్ధం మొదలైందని హైకోర్టు వ్యాఖ్యానించింది. ప్రజా సమస్యలపై యూనియన్ నాయకులకు పట్టింపు ఉండాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించింది. సమ్మెచేసే హక్కు ఉన్నప్పటికీ.. చట్టాన్ని ఉల్లంఘించాలని ఎక్కడా చెప్పలేదని గుర్తుచేసింది. చట్టప్రకారం చర్చల ప్రక్రియ తర్వాత ఏడురోజులకు సమ్మెకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపింది. సమ్మె చేయడం చట్టాన్ని ఉల్లంఘించడమేనని, ప్రాథమికంగా ఇది చట్టవ్యతిరేక సమ్మె అని స్పష్టమవుతున్నదని వ్యాఖ్యానించింది.

సమ్మె చట్ట విరుద్ధం కాదా?

పండుగ రోజులు, విద్యాసంస్థలు ప్రారంభమయ్యే ముందు సమ్మెకు వెళ్లడాన్ని ఆక్షేపించిన ధర్మాసనం.. రాజీ ప్రక్రియ జరుగుతుండగా సమ్మెకు వెళ్లడం చట్టవిరుద్ధం కదా? అని నిలదీసింది. చట్టవిరుద్ధంగా సమ్మెచేస్తున్న కార్మికసంఘాలపై ఎస్మా ఎందుకు ప్రయోగించకూడదని ప్రశ్నించింది. ఎటువంటి కారణాలు, ఎప్పుడు చర్చలు జరుపుతారో చెప్పకుండా రాజీ చర్చల ప్రక్రియను నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువరోజులు వాయిదావేశారని కార్మికసంఘాల తరపున సీనియర్ న్యాయవాది దేశాయి ప్రకాశ్‌రెడ్డి వాదించగా.. చర్చలు కొలిక్కి వచ్చేవరకు కొంత సయమనం పాటించాల్సిందని హైకోర్టు వ్యాఖ్యానించింది. రాష్ట్ర ప్రజలు మన సోదరులేనని, వారి ఇబ్బందులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నది. వెంటనే సమ్మె విరమించి.. రాజీ చర్చలకు వెళ్లాలని సూచించింది. చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని కార్మిక సంఘాల తరపు న్యాయవాది తెలిపారు.

ఆర్టీసీకి వెంటనే ఎండీని నియమించండి

ఆర్టీసీకి శాశ్వత ప్రాతిపదికన ఎండీని వెంటనే నియమించాలని ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. కార్మికసంఘాల డిమాండ్లలో ఒకటైన ఆర్టీసీకి ఎండీ నియామకంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన న్యాయస్థానం.. ఎండీని తాత్కాలికంగా ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించింది. శాశ్వత ప్రాతిపదికన ఎండీని నియమించాలని సూచించింది. ఎండీ నియామకానికి నిధులు వెచ్చించాల్సిన అవసరం లేదని తెలిపింది. లోకాయుక్త, ఉప లోకాయుక్త నియామకాలపై కూడా పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేసింది. విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని ఏఏజీ జే రామచంద్రరావు హైకోర్టుకు తెలిపారు.

విలీనం ప్రసక్తే లేదు: ఏఏజీ

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంచేసే ప్రసక్తేలేదని అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) జే రామచంద్రరావు స్పష్టంచేశారు. కార్మికసంఘాలు ప్రభుత్వం పరిష్కరించగలిగే డిమాండ్లు ముందుపెడితే పరిష్కరించగలమేగానీ.. చందమామను తెచ్చివ్వాలని కోరితే సాధ్యంకాదని హైకోర్టుకు నివేదించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంచేస్తే.. మిగతా కార్పొరేషన్లు కూడా తమను ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరుతాయని, అప్పుడు సమస్య మరింత జటిలమవుతుందని పేర్కొన్నారు. ఆర్టీసీకి ఏటా రూ.1100 కోట్ల నష్టాలు వస్తున్నాయని, రూ.5 వేలకోట్ల అప్పులున్నాయని తెలిపారు. సమ్మె విషయంలో పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం వ్యవహరిస్తామని పేర్కొన్నారు. మొత్తం 70% బస్సులను నడుపుతున్నామని, కొద్దిరోజుల్లోనే పూర్తిస్థాయిలో ఆర్టీసీ బస్సులను తిప్పుతామని తెలిపారు. తాత్కాలిక ప్రాతిపదికన అర్హత కలిగిన డ్రైవర్లు, కండక్టర్లను తీసుకుంటున్నామని, ఈ ప్రక్రియ కొనసాగుతున్నదని పేర్కొన్నారు. ఇంకా దాదాపు నాలుగువేల బస్సులు నడువటం లేదని, నాలుగువేల మంది డ్రైవర్లు, కండక్టర్లు తక్కువగా ఉన్నారని ధర్మాసనం ప్రస్తావించింది. పూర్తిస్థాయిలో బస్సులను నడుపుతున్నప్పుడు విద్యాసంస్థలకు సెలవులు ఎందుకు ఇచ్చారని ఏఏజీని ప్రశ్నించింది. సామాన్య ప్రజలు ఉపయోగించుకునే ప్రజారవాణా వ్యవస్థను యథాతథస్థితికి తీసుకొచ్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని ధర్మాసనం గుర్తుచేసింది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవటానికి వందశాతం ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, మరికొన్ని రోజుల్లోనే వందశాతం బస్సులను నడుపుతామని ఏఏజీ ధర్మాసనానికి చెప్పారు. కార్మిక సంఘాలు, ప్రభుత్వం రెండురోజుల్లో చర్చలు జరిపి ప్రజల ఇబ్బందులు తొలిగించాలని, ఈ విషయంలో ఏజీ బీఎస్ ప్రసాద్, ఏఏజీ జే రామచంద్రరావు, కార్మికసంఘాల న్యాయవాది దేశాయి ప్రకాశ్‌రెడ్డి చొరవచూపాలని హైకోర్టు సూచిస్తూ.. తుపరి విచారణను ఈ నెల 18కి వాయిదావేసింది.

పిలిస్తే చర్చలకు సిద్ధం: అశ్వత్థామరెడ్డి

ప్రభుత్వం, యాజమాన్యంతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి చెప్పారు. ఆర్టీసీ సమ్మెపై మంగళవారం హైకోర్టులో వాదనలు ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతానికి సమ్మె యథాతథంగా కొనసాగుతుందని స్పష్టంచేశారు. అన్ని విషయాలను ఈ నెల 18న తమ న్యాయవాది ద్వారా హైకోర్టుకు వివరిస్తామని తెలిపారు. చర్చలకు సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వం పిలిస్తే చర్చల్లో పాల్గొంటామని చెప్పారు. టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు అంటే ఒక సీనియర్ నాయకుడిగా తమకు అపార గౌరవముందన్నారు. చర్చలు మంచి మనసుతో, సుహృద్భావ వాతావరణంలో జరుగాలని ఆకాంక్షించారు.

ఐఎంఎస్ స్కాంలో ఫార్మసిస్ట్ లావణ్య సస్పెన్షన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఐఎంఎస్ (ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్) మందుల కొనుగోలు కుంభకోణంలో అరెస్టయి, జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న చర్లపల్లి డిస్పెన్సరీ ఫార్మసిస్ట్ వీ లావణ్యను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ శషాంక్ గోయల్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. మందుల కొనుగోలు కుంభకోణంలో లావణ్య కూడా భాగస్వామిగా ఉన్నట్టు తేలడంతో ఏసీబీ అధికారులు ఈ నెల 11న ఆమెను అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే. 48 గంటలకు మించి రిమాండ్ ఖైదీగా ఉండటంతో క్రమశిక్షణ చర్యల కింద లావణ్యను సస్పెండ్ చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

లచ్చిరెడ్డి సంఘంతో మాకు సంబంధం లేదు!

- సీఎస్‌కు కొందరు డిప్యూటీ కలెక్టర్ల లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: లచ్చిరెడ్డి అధ్యక్షుడిగా ఉన్న డిప్యూటీ కలెక్టర్ల సంఘం నుంచి తాము వైదొలుగుతున్నామని తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం సభ్యులు కొందరు మంగళవారం సీఎస్ ఎస్కే జోషికి లేఖ రాశారు. సంఘం ట్రెజరర్ ఎం వాసుచంద్ర పేరిట విడుదల చేసిన ఆ లేఖలో పేర్కొన్న ప్రకారం.. వీ లచ్చిరెడ్డి అధ్యక్షుడిగా ఉన్న తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ (రిజిస్టర్ నంబర్: 79/2019) నుంచి ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యులు అసోసియేట్ ప్రెసిడెంట్లు కే చంద్రకళ, ఎన్ రవి, ఉపాధ్యక్షులు బీ చెన్నయ్య, రవీందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కే వెంకట్‌రెడ్డి, కార్యదర్శిగా ఎల్ రమేశ్, సభ్యులుగా ఎస్ రాజేశ్వర్, ఎం జయచంద్రరెడ్డి, బీ రాజాగౌడ్, కే రాజేంద్రకుమార్ వైదొలిగినట్టు ప్రకటించారు.

సమ్మెపై ప్రభుత్వానికి నివేదిస్తాం

ముహూర్తం

సూర్యోదయం: 6.10 గంటలకు

సూర్యాస్తమయం: 5.50 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, కృష్ణపక్షం, తదియ, నక్షత్రం: భరణి మధ్యాహ్నం 2.20 వరకు, తదుపరి కృత్తిక, అమృతఘడియలు: ఉదయం 9.10 నుంచి 10.54 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.00 నుంచి 1.27 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.36 నుంచి మధ్యాహ్నం 12.23 వరకు, వర్జ్యం: గురువారం తె.జా. 3.06 నుంచి 4.48 వరకు.

- నేడు సీఎస్‌కు వినతిపత్రం ఇస్తాం
- ఉద్యోగ జేఏసీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి
- ఉద్యోగ జేఏసీతో ఆర్టీసీ జేఏసీ నేతల భేటీ
- సమ్మెకు ఉద్యోగ జేఏసీ సంఘీభావం

సమావేశానంతరం మీడియాతో మాట్లాడుతున్న టీఎన్జీవో, టీజీవో, ఆర్టీసీ జేఏసీ నేతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిస్తామని తెలంగాణ ఉద్యోగసంఘాల జేఏసీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి ప్రకటించారు. ఉద్యోగసంఘాల జేఏసీ ప్రతి ఉద్యోగి సంక్షేమం కోసమే పనిచేస్తుందని, కార్మికులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వానికి వివరించేందుకు వారధిగా ఉంటుందని చెప్పారు. ఆర్టీసీ జేఏసీ నేతలు అశ్వత్థామరెడ్డి, రాజిరెడ్డి, థామస్‌రెడ్డి తదితరులు మంగళవారం తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలను టీఎన్జీవో భవన్‌లో కలిసి సమ్మెకు మద్దతు కోరారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగుల జేఏసీ ఇచ్చిన ప్రతి పిలుపునకు ఆర్టీసీ కార్మికులు ముందు నిలిచారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఉద్యోగసంఘాల జేఏసీ కలిసిరావాలని, న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వానికి విన్నవించాలని కోరారు. అనంతరం ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి మీడియాతో మాట్లాడుతూ సమ్మెకు ఉద్యోగ జేఏసీ కూడా కలిసిరావాలని, ప్రభుత్వంతో చర్చించేందుకు ముందుండాలని విజ్ఞప్తిచేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెపై ప్రభుత్వంతో చర్చలకు ఉద్యోగసంఘాల జేఏసీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డిని పంపుతామని చెప్పారు.

సీఎస్‌కు వినతిపత్రం ఇస్తాం : కారం

రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలతోపాటు ఆర్టీసీ కార్మికుల సమ్మె అంశంపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని, బుధవారం సీఎస్‌కు వినతిపత్రం అందజేస్తామని ఉద్యోగసంఘాల జేఏసీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆర్టీసీ జేఏసీ నేతలతో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటామని చెప్పారు. ఉద్యోగసంఘాలు, ఆర్టీసీ జేఏసీ భేటీలో పలు అంశాలను చర్చించామని తెలిపారు. కార్మికులు అధైర్యపడవద్దని చెప్పారు. సమ్మెపై ప్రభుత్వంతో చర్చలు జరిపే అంశం ఇంకా తేలలేదని అన్నారు. ఇటీవల సీఎంను కలిసినప్పుడు ఉద్యోగుల సమస్యలపై హామీ ఇచ్చారని, అన్ని అంశాలు పరిష్కారమవుతాయనే ఆశాభావంతో ఉన్నామని చెప్పారు. ఇటీవల సీఎం కేసీఆర్‌ను కలిసినప్పుడు కూడా ఆర్టీసీ కార్మికుల డిమాండ్లపై చర్చించాలని కోరామన్నారు. కార్మికుల సమ్మెకు మద్దతునిస్తూనే పరిష్కారానికి కృషిచేస్తామని, దీనిపై తెలంగాణ ఉద్యోగసంఘాల జేఏసీ బుధవారం అత్యవసర సమావేశం అవుతుందని రవీందర్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో ఉద్యోగులకు పీఆర్సీ ఇచ్చినప్పుడు ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువగా ఇచ్చారని, ఆ సమయంలో చాలా సంతోషపడ్డామని చెప్పారు. గతంలో ఎప్పుడూ ఆర్టీసీ కార్మికులకు 22% కంటే జీతాలు పెరుగలేదన్నారు. కానీ, తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలిచ్చారని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని ఎంతో కాలంగా డిమాండ్ ఉన్నదని, కానీ ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని చెప్పారు. అదెలా ఉన్నా.. తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువగా వేతనాలు పెంచిందని గుర్తుచేశారు. ఉద్యోగుల సమస్యలు, కార్మికుల అంశంపై సీఎం కేసీఆర్‌కు వివరించామని, కానీ కొంతమంది నాయకులు ఈ విషయం తెలియకుండా తమ వ్యాఖ్యలను వక్రీకరించారని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు అండగా నిలబడేందుకు టీఎన్జీవో కార్యవర్గ సమావేశం నిర్వహించామని, ఈ సమావేశంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలపై తీర్మానాలు చేశామని తెలిపారు. సమ్మె సమయంలో వారు మమ్మల్ని కలిసినా, కలువకున్నా ఆర్టీసీ కార్మికులను సోదరులుగా భావిస్తున్నామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై సీఎస్‌కు కూడా వివరిస్తామన్నారు. ఆర్టీసీ కార్మికులు సమ్మెచేయడం కొంత బాధాకరమైనప్పటికీ.. వారికి న్యాయంచేయాలనే ఉద్దేశంతో ఉద్యోగసంఘాలతో చర్చిస్తున్నామని చెప్పారు. ఆర్టీసీ కార్మికులకు సబ్బండవర్ణాలు మద్దతునిస్తున్నాయని, వారి సమస్యలపై చర్చించాలనే లక్ష్యంతో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ కూడా ముందుంటుందని తెలిపారు. సమ్మె పరిష్కారం కాకుంటే ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఆందోళనకు దిగే ప్రమాదముందని రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులను కాపాడుకునేలా తెలంగాణ ఉద్యోగ జేఏసీ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఆర్టీసీకి నష్టం జరుగకుండా, సంస్థను కాపాడుకునేందుకు ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. ఆర్టీసీ సమస్యలు తీర్చేందుకు సీఎంతో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఆర్టీసీ సమ్మెలో భాగంగా అన్ని నిరసనల్లో పాల్గొంటామని రవీందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. త్వరలోనే ఆర్టీసీ కార్మికుల సమస్యలను తీర్చేందుకు ప్రభుత్వం చర్చలు జరుపుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఉద్యోగుల జేఏసీ కూడా బుధవారం సమావేశమవుతుందని, దీనిలో కార్యచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. ఉద్యోగులెవ్వరైనా జేఏసీలో భాగస్వాములేనని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యోగ జేఏసీ ముందు ఉంటుందని జేఏసీ సెక్రటరీ జనరల్ మమత అన్నారు. ఆర్టీసీ కార్మికులు తోటి ఉద్యోగులేనని, వారికి మద్దతుగా ఉంటామని చెప్పారు. ఆర్టీసీ జేఏసీ నిరసనల్లో ఉద్యోగ జేఏసీ కూడా ఉంటుందన్నారు. ఆర్టీసీ కార్మికులు ధైర్యంగా ఉండాలని, శాంతియుతంగా, ఐక్యతతో ఉండాలని సూచించారు. ఈ భేటీలో జేఏసీ సెక్రటరీలు మామిళ్ల రాజేందర్, ఏనుగుల సత్యనారాయణ తదితరులున్నారు.

100% బస్సులు రోడ్డెక్కాల్సిందే

- గరుడ, రాజధాని బస్సులు మినహా అన్నీ నడపాలి
- షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు బస్సులు పంపాలి
- ఆర్టీసీ బస్సులన్నింటా టికెట్ మిషన్లు
- అధికారులకు మంత్రి పువ్వాడ ఆదేశం

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సమ్మెతో సంబంధం లేకుండా.. ప్రజారవాణాకు ఆటంకం రాకుండా ఆర్టీసీ, ఆర్టీసీకి చెందిన అద్దెబస్సులన్నీ నడుపాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ పరిధిలోని గరుడ, రాజధాని ఏసీ బస్సులు మినహా ప్రతి బస్సు నిర్దేశించిన రూట్లలో నడువాలని చెప్పారు. ఖైరతాబాద్‌లోని ట్రాన్స్‌పోర్ట్ భవన్ నుంచి ఆర్టీసీ రీజినల్ మేనేజర్లతో మంత్రి పువ్వాడ మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి డిపో నుంచి వెళ్తున్న బస్సుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం వరకు సగటున 60% ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్లు వెల్లడించారు. జిల్లాల పరిధిలో అత్యధికంగా 80% వరకు కూడా నడుపుతున్నామని, మంగళవారం రాష్ట్రంలో సగటున 60.48% ఆర్టీసీ బస్సులు తిరిగాయని వివరించారు. బుధవారం నుంచి జిల్లాల

నాణ్యమైన విద్యకోసం పరిశోధన

ఒప్పందం కుదుర్చుకున్న విద్యాశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పాఠశాల విద్యలో నాణ్యతను పెంపొందించడానికి విద్యాశాఖ కసరత్తు చేస్తున్నది. శాస్త్రీయమైన పరిశోధన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ప్రొఫెసర్ కార్తీక్ మురళీధరన్, జమీల్ అబ్దుల్ లతీఫ్ పావర్టీ యాక్షన్ ల్యాబ్, (జే-పీఏఎల్) సెంట్రల్ స్వ్కేర్ ఫౌండేషన్‌తో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. పరిశోధనలో భాగంగా పలుజిల్లాల్లో అభ్యసన ఫలితాలపై సమాచారం సేకరించనున్నారు. సెంట్రల్ స్వ్కేర్ ఫౌండేషన్ పరిశోధన బృందానికి సాంకేతిక, నిర్వహణపరమైన సహకారం అందిస్తుందని విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి తెలిపారు. నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని చెప్పారు. నాణ్యత ప్రమాణాలు సాధించడానికి అంతర్జాతీయస్థాయి ప్రముఖుల సేవలు వినియోగించుకుంటామన్నారు. ఈ పరిశోధన ఐదేండ్లపాటు కొనసాగనున్నది.

శాసనమండలి విప్‌గా దామోదర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాసనమండలి విప్‌గా ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి మంగళవారం అసెంబ్లీ భవనంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, ఫారూఖ్‌హుస్సేన్, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మండలి విప్‌గా బాధ్యతలు స్వీకరించిన దామోదర్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఫారూఖ్‌హుస్సేన్, నారదాసు లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి.. దామోదర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు

సెలవుల్లో తరగతుల నిర్వహణపై నోటీసులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో దసరా సెలవులు ఈ నెల 19 వరకు ఉన్నప్పటికీ తరగతులు నిర్వహిస్తున్న కొన్ని ప్రైవేటు జూనియర్ కాలేజీలకు నోటీసులు జారీ చేసినట్టు ఇంటర్ బోర్డు సెక్రటరీ సయ్యద్ ఒమర్ జలీల్ తెలిపారు. సెలవుల్లో తరగతులు నిర్వహించిన దాదాపు 12 ప్రైవేటు జూనియర్ కాలేజీలపై చర్యలు తీసుకుంటామని, అవసరమనుకుంటే ఆ కాలేజీలకు ఈ ఏడాది అఫిలియేషన్ రద్దు చేస్తామని ఆయన తెలిపారు.

సైదిరెడ్డితోనే హుజూర్‌నగర్ అభివృద్ధి

- టీఆర్ఎస్ పాలనలో ముస్లింల భద్రతకు భరోసా
- చిలుకూరు ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో హోంమంత్రి మహమూద్ అలీ
- విచక్షణతో ఓటేయండి: మంత్రి జగదీశ్‌రెడ్డి

చిలుకూరు: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ ప్రభుత్వమే ముస్లింల భద్రతకు భరోసా కల్పించిందని హోంమంత్రి మహమూద్‌అలీ అన్నారు. టీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని గెలిపిస్తే హుజూర్‌నగర్‌లో రికార్డుస్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. మంగళవారం సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలకేంద్రంలో నిర్వహించిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనానికి విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ముస్లిం మైనార్టీల ఆత్మగౌరవాన్ని పెంచి, వారి అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నదని తెలిపారు. నిరుపేద ముస్లిం యువతుల వివాహాలకు షాదీముబారక్, విద్యార్థుల చదువులకు 204 మైనార్టీ గురుకులాలతోపాటు కళాశాలలు ఏర్పాటుచేసిందని మహమూద్ అలీ కొనియాడారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ బిల్లుకు శాసనసభలో ఆమోదం తెలిపిన టీఆర్ఎస్ సర్కారు.. అది చట్టంగా మారేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తున్నదని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో ఓటర్లు విచక్షణతో ఓట్లు వేయాలని, నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే సైదిరెడ్డికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని మంత్రి జగదీశ్‌రెడ్డి కోరారు. ఉప ఎన్నికల్లో యువకుడు, ఉత్సాహవంతుడైన సైదిరెడ్డిని గెలిపిస్తే కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఈ సమ్మేళనంలో కోదాడ, నల్లగొండ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్యాదవ్, కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి, రాష్ట్ర నేత వేమిరెడ్డి నర్సింహారెడ్డి, రాష్ట్ర మైనార్టీ కమిటీ చైర్మన్ సయ్యద్ అక్బర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరులో ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి మహమూద్‌అలీ. చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ చిన్నపరెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల, మల్లయ్య యాదవ్ ఉన్నారు.

చింతలపాలెం మండలంలోని శోభనాద్రిగూడెంలో టీఆర్ఎస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నాయకులకు కండువాలు కప్పుతున్న మంత్రి సత్యవతిరాథోడ్

టీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం: మంత్రి సత్యవతి రాథోడ్

చింతలపాలెం: హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని, శానంపూడి సైదిరెడ్డి భారీ మెజారిటీతో గెలవడం తథ్యమని గిరిజన, మహిళా సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ధీమా వ్యక్తంచేశారు. మంగళవారం చింతలపాలెం మండలంలో ఆమె ప్రచారం నిర్వహించారు. గతంలో నియోజకవర్గ ప్రజలకు మాయమాటలు చెప్పి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఓట్లు దండుకున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో రూ.30 కోట్లతో గిరిజన గురుకులాలు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. అనంతరం మండలంలోని శోభనాద్రిగూడెం గ్రామానికి చెందిన 20 మంది వివిధ పార్టీల నాయకులు టీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే బాపురావు రాథోడ్, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిపై కోడ్ ఉల్లంఘన కేసు

హుజూర్‌నగర్‌రూరల్: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతి, ఆమె అనుచరులపై కేసు నమోదైంది. ఎస్సై అనిల్‌రెడ్డి వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి, ఆమె అనుచరులు మల్లికార్జున్, దొంతిరెడ్డి సంజీవరెడ్డి, దూత వెంకటేశ్వర్లు, ముషంపల్లి సత్యనారాయణ.. అనుమతి లేకుండా 12 కార్లు, 400మంది కార్యకర్తలతో రోడ్‌షో నిర్వహించారని, ప్రజారవాణాకు ఆటంకం కలిగించారని చెప్పారు. వీరంతా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) నిబంధనలను ఉల్లంఘించారని పేర్కొన్నారు. ఎంసీసీ టీం హుజూర్‌నగర్ ఇంచార్జి పెంటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

ఊరూరా జోరుగా ప్రచారం

టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డికి మహిళల ఘన స్వాగతం

హుజూర్‌నగర్, నమస్తే తెలంగాణ: హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని 141 గ్రామ పంచాయతీల్లో ఉప ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతున్నది. హుజూర్‌నగర్ మండలంలోని సీతారామపురం, గరిడేపల్లి మండలంలోని అప్పన్నపేట, అబ్బిరెడ్డిగూడెం, సర్వారం, గానుగబండ, పర్రెడ్డిగూడెం, గారకుంట తండా, గంగానగర్, కల్మచెర్వులో టీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి మహిళలు పూలు చల్లి, హారతులతో ఘనస్వాగతం పలికారు. ప్రచారంలో మండలి చీఫ్ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్, ములుగు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ పాల్గొన్నారు. గడ్డిపల్లిలో ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, మర్రికుంటలో శానంపూడి రజిత, కల్మలచెర్వులో వరంగల్ మేయర్ ప్రకాశ్‌రావు ప్రచారం నిర్వహించారు. లక్ష్యాతండా, కపూర్యాతండాలో టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఇంతియాజ్ ఇసాక్ ప్రచారంలో పాల్గొన్నారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఇంటింటి ప్రచారం చేశారు. పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి జగదీశ్‌రెడ్డి పాల్గొనగా, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మున్నూరు కాపు నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. చింతలపాలెం మండలంలోని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే బాపురావు రాథోడ్ ప్రచారం చేశారు. మల్లారెడ్డిగూడెంలో కాసోజు శంకరమ్మ ప్రచారం చేయగా, మేళ్లచెర్వు మండలంలోని కందిబండలో మండల ఎన్నికల ఇంచార్జి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరారు. ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకుడు హనీఫ్ ముక్తదర్ ర్యాలీలో పాల్గొన్నారు. నేరేడుచర్లలో ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, వికలాంగుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, దిర్శించర్లలో ఎమ్మెల్యే రాజయ్య, మేడారంలో రాష్ట్ర కార్యదర్శి తాతా మధుసూదన్, మూసీ ఒడ్డుసింగారంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ మందుల సామేలు ప్రచారం చేశారు. గుండెబోయినగూడెంలో జనగామ జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, బెట్టెతండా, పాడ్యాతండాల్లో ఎంపీ మాలోతు కవిత, ఇల్లందు ఎమ్మెల్యే హరిప్రియ, మతంపల్లి మండలంలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్ తదితరులు ప్రచారం నిర్వహించారు.

మంగళవారం హుజూర్‌నగర్ మండలం సీతారామపురంలో టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డికి పూలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

మ్యుటేషన్ మాయాజాలం

- విక్రయించకపోయినా 8 గుంటల భూమి పట్టామార్పు
- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో తిప్పలు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన పెద్దపల్లి జిల్లా ఆరెంద రైతు వూట్ల బాపు

ధర్మగంట

వూట్ల బాపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం రైతును ఇబ్బందులకు గురి చేస్తున్నది. ఇతరులకు అమ్మిన భూమి కంటే.. 8 గుంటల స్థలాన్ని అదనంగా మ్యుటేషన్ చేయడంతో కష్టాలను తెచ్చిపెట్టింది. అధికారులకు పలుసార్లు సమస్యను విన్నవించినా పట్టించుకోవడంలేదని పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని ఆరెంద గ్రామ రైతు వూట్ల బాపు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తాను విక్రయించని 8 గుంటల భూమిని తన పేరుపైకి మార్చి న్యాయంచేయాలని 'ధర్మగంట'ను ఆశ్రయించారు. ఆరెంద రైతు వూట్ల బాపుకు గ్రామంలోని సర్వేనంబర్ 131లో ఒక ఎకరం 25 గంటల భూమి ఉండేది. 2010లో 599/2010 డాక్యుమెంట్ ద్వారా మంథని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇనుముల రమాదేవికి ఒక ఎకరం 17 గుంటల భూమిని విక్రయించారు. మిగిలిన 8 గుంటలను విక్రయించకుండా తనవద్దే ఉంచుకున్నారు. కానీ, రెవెన్యూ అధికారులు మాత్రం ఒక ఎకరం 25 గుంటల భూమిని రమాదేవి పేరున పట్టా చేశారు. రిజిస్ట్రేషన్ ఎంత భూమికి జరిగిందో అంతే మ్యుటేషన్ చేయాల్సి ఉండగా, రెవెన్యూ అధికారులు అదనంగా 8 గుంటల భూమిని రమాదేవికి మ్యుటేషన్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఇక్కడ భూమిని ఇటీవల ప్రభుత్వం తీసుకొన్నది. మిగిలిన ఎనిదిమి గుంటలకు సంబంధించి సర్కారు ఇచ్చిన నష్టపరిహారం రాకపోవడంతో బాపు.. మండల రెవెన్యూ కార్యాలయాన్ని ఆశ్రయించారు. అదనంగా 8 గుంటల భూమిని కూడా రమాదేవి పేరున మ్యుటేషన్ చేసినట్టు బయటపడింది. అవసరానికి ఉంచుకున్న భూమి పోయిందని, పరిహారమూ దక్కలేదని బాపు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తన భూమిని తిరిగి తనకు పట్టా చేయాలని కోరినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని, తాసిల్దార్‌కు విన్నవించినా ప్రయోజనం లేకుండాపోయిందని చెప్తున్నారు. మరోవైపు ఈ భూమి మొత్తం తనదేనని రమాదేవి అంటున్నారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల జాబితా సిద్ధం

టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర అటవీశాఖలో 239 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల ఎంపిక జాబితాను పోస్టింగ్‌ల కోసం ఆ శాఖకు పంపించినట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 239 మంది అభ్యర్థులకు సంబంధించిన స్థానిక ఏజెన్సీని నిర్ణయిస్తూ పాత మహబూబ్‌నగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాల కలెక్టర్ల నుంచి వచ్చిన సమాచారం ప్రకారం ఈ జాబితాను ప్రకటించినట్లు తెలిపారు. పూర్తి వివరాలు www.tspsc.gov.in అనే వెబ్‌సైట్‌లో పొందుపరిచామని అన్నారు.

మంగళవారం ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డులో లోయలో పడి నుజ్జునుజ్జయిన మినీబస్సు

ఏపీలో ఘోర రోడ్డు ప్రమాదం

- లోయలోపడిన మినీబస్సు
- కర్ణాటకకు చెందిన ఎనిమిదిమంది దుర్మరణం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మినీబస్సు లోయలో పడిపోవడంతో ఎనిమిదిమంది దుర్మరణం పాలయ్యారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు కర్ణాటక రాష్ట్రంలోని చిత్రదుర్గ జిల్లా చెలకేరికి చెందినవారిగా పోలీసులు గుర్తించారు. చెలకేరి గ్రామస్తులు రెండువాహనాల్లో తెలంగాణ, ఏపీలోని పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు బయలుదేరారు. మంగళవారం భద్రాచలంలోని రామాలయాన్ని దర్శించుకున్న అనంతరం ఏపీలోని అన్నవరం బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న వాహనాల్లో ఓ మినీబస్సు మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డులో వాలిసుగ్రీవుడి కొండ సమీపంలోకి రాగానే అదుపుతప్పి లోయలో పడిపోయింది. దీంతో ఎనిమిది యాత్రికులు అక్కడికక్కడే మృతిచెందారు. గాయపడిన మరో ఐదుగురిని రంపచోడవరం దవాఖానకు తరలించారు. ప్రమాదంపై ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

అవసరాలకు తగినట్టుగా పంటల సాగు

- సుగంధద్రవ్యాల సాగుకు తెలంగాణ అనుకూలం
- మసాలా ధినుసులు సాగుచేసే రైతులకు సబ్సిడీపై ఎరువులు, ముడిసరుకులు
- తెలంగాణలో ప్రాంతీయ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు
- రాష్ట్రస్థాయి సదస్సులో మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రజల అవసరాలు, అలవాట్లకు అనుగుణంగా రైతులు పంటలు పండించినప్పుడే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానవనశాఖల మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని రైతులు గొప్పగా బతికినప్పుడే తెలంగాణ రాష్ట్రానికి సార్థకత చేకూరుతుందని చెప్పారు. మంగళవారం హైదరాబాద్ రెడ్‌హిల్స్‌లోని తెలంగాణ ఉద్యాన శిక్షణ సంస్థలో సుగంధద్రవ్యాల పంటల సాగుపై రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల బాగు కోసం ఎంతైనా భరిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభలో చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో రైతులకు మేలుచేసే మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో పండించిన పంటల మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో వ్యవసాయరంగానికి అత్యధిక ప్రాముఖ్యం కల్పిస్తున్నామన్నారు. సుగంధద్రవ్యాల పంటలను సాగు చేపట్టేలా తెలంగాణ రైతులు దృష్టి సారించాలని సూచించారు. రైతులు పండించిన పంటను మార్కెట్ చేసే బాధ్యత ప్రభుత్వమే తీసుకొంటుందని చెప్పారు. సుగంధద్రవ్యాల పంటలను సాగు చేసే రైతులకు ఎరువులు, విత్తనాలు, ఇతర యంత్రాల కొనుగోలుపై ఎకరాకు రూ.తొమ్మిది వేల వరకు సబ్సిడీ అందించనున్నట్టు తెలిపారు. పత్తి పంటలో అంతరపంటగా కొత్తిమీర సాగుచేస్తే ఎకరానికి రూ.60 వేల ఆదాయం వచ్చినట్టు ఇటీవల ఒక రైతు చెప్పడం ఆనందం కలిగించిందన్నారు. ప్రపంచ దేశాలు సేంద్రియ పంటల సాగు వైపు వెళ్తున్నాయని, అన్ని దేశాల్లో అన్ని రకాల పంటలు పండే వాతావరణ పరిస్థితులు లేవని పేర్కొన్నారు. తెలంగాణలో ఎలాంటి పంటలనైనా సాగుచేసేందుకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులున్నాయని చెప్పారు.

హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి తదితరులు

కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు

సుగంధద్రవ్యాల పరిశోధనా ప్రాంతీయ కేంద్రాన్ని తెలంగాణలో ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకొనేందుకు రైతులు పాడి గేదెలు, కోళ్లను కూడా పెంచుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి మాట్లాడుతూ.. తెలంగాణలో సుగంధ ద్రవ్యాల సాగుకు అనుకూలమైన వాతావరణం ఉన్నదని, వీటి సాగు చేపట్టి రైతులు మంచి ఆదాయం పొందవచ్చునని సూచించారు. సుగంధ పంటల సాగుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉద్యానశాఖ అందిస్తున్నదని తెలిపారు. ఈ సదస్సులో ఉద్యానశాఖ డైరెక్టర్ ఎల్ వెంకట్రామిరెడ్డి, నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ సీడ్ స్పైస్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్‌లాల్, ఉద్యాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కే రవీందర్‌రెడ్డితోపాటు నిర్మల్, వికారాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, సంగారెడ్డి, నల్లగొండ జిల్లాకు చెందిన రైతులు, వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

డీపీహెచ్ వైద్యులకు టైమ్‌బాండ్ పదోన్నతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్‌హెల్త్ పరిధిలోని వైద్యులకు టైమ్‌బాండ్ పదోన్నతుల కల్పనపై ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు డీపీహెచ్ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు లాలుప్రసాద్‌రాథోడ్, ప్రధానకార్యదర్శి దీన్‌దయాళ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైమ్‌బాండ్ పదోన్నతులకు సంబంధించిన డీపీహెచ్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపామని అక్కడి నుంచి సూచనలు రావాల్సి ఉందన్నారు.

21 వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఈ నెల 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. పాఠశాల విద్యార్థులకు గురువారం (17న) ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్టు డీజీపీ కార్యాలయం తెలిపింది. ఆసక్తి ఉన్నవారు వివరాలకు 'https://t.co/fRYOJ5iwxR, https://t.co/jQmUlvU7RY'వెబ్‌సైట్‌లో తెలంగాణ రాష్ట్ర పోలీసుశాఖ పేజీని పరిశీలించాలని అధికారులు తెలిపారు.

కాలేజీల్లో ఆత్మహత్యల నివారణకు చర్యలు

- జూనియర్ కాలేజీల్లో కౌన్సెలర్ల నియామకంపై దృష్టి
- ఒత్తిడి తగ్గించుకోవడంపై లెక్చరర్లకు ప్రత్యేక శిక్షణ
- చర్యలు చేపట్టిన తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని జూనియర్ కాలేజీ విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించడం, ఆత్మహత్యలను నివారించడంపై ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు దృష్టి సారించారు. జూనియర్ కాలేజీల్లో కౌన్సెలర్లను నియమించాలని అధికారులు నిర్ణయించారు. తొలుత 404 ప్రభుత్వ కాలేజీల్లో కౌన్సెలర్ల నియామకానికి అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కౌన్సెలర్ల నియమాకాలు నేరుగా జరుపకుండా.. లెక్చరర్లకే కౌన్సెలింగ బాధ్యతలు అప్పగించేందుకు చర్యలు తీసుకొంటున్నారు. ఒక్కో కాలేజీ నుంచి ఒక రిద్దరిని ఎంపికచేసి వారికి మానసిక వైద్యనిపుణులతో శిక్షణ ఇప్పించాలని నిర్ణయించారు. ఎలా చదువుకోవాలి? చదివే క్రమంలో తలెత్తే మానసిక ఒత్తిడిని ఎలా అధిగమించాలి? పరీక్షల్లో ఫెయిలైతే తీసుకోవాల్సిన చర్యలు ఏమిటీ? నిత్యజీవితంలో ఎలా మసలుకోవాలి? వంటి అనేక అంశాలతో ప్రత్యేక పాఠ్యాంశాన్ని రూపొందిస్తున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్ తెలిపారు. ఈ పాఠ్యాంశాన్ని తయారుచేయడంలో సబ్జెక్టు నిపుణులు, సైకాలజిస్టులు, స్వచ్ఛంద సంస్థలతోపాటు అవసరమైతే యూనిసెఫ్ నుంచి సాయం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పరీక్షల నిర్వహణ, తలెత్తుతున్న పొరపాట్లపై సమీక్షించి పునరావృతం కాకుండా చూడటంపై దృష్టి సారించామని చెప్పారు.

ప్రైవేట్ కాలేజీలకు కూడా ఆదేశాలు

ప్రైవేట్ కాలేజీల్లోనే విద్యార్థుల ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతుండటంతో ప్రైవేట్ యాజమాన్యాలకు ప్రత్యేక ఆదేశాలు జారీచేసే పనిలో ఇంటర్ బోర్డు నిమగ్నమైంది. చదువుతోపాటు విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించేలా చూసేందుకు కౌన్సెలర్లను నియమించేలా చూడాలని ఆదేశాలు జారీ చేయనున్నారు. ఇందుకు రూపొందించే పాఠ్యాంశాలను ప్రైవేట్ కాలేజీలకు పంపించేందుకు సీడీలు సిద్ధంచేయాలని అధికారులు నిర్ణయించారు. కౌన్సెలింగ్ ఇవ్వడంద్వారా విద్యార్థులు ఆత్మహత్యల ఆలోచనల నుంచి బయటపడేయవచ్చని బోర్డు యోచిస్తున్నది.

సకాలంలో వేతనాలు

- కాంట్రాక్టు వైద్య ఉద్యోగులకు అందించాలి
- మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్ ఆదేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వైద్యారోగ్యశాఖ పరిధిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి టీ హరీశ్‌రావు, వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ సూచించారు. వైద్యసేవలకు ఆటంకం కలగకుండా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు సకాలంలో చెల్లించాలన్నారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సూచన మేరకు మంగళవారం ఎంసీఆర్‌హెచ్చార్డీలో వైద్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రులు సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం ఆదేశం ప్రకారం కాంట్రాక్టు సిబ్బందికి జీతభత్యాలు సకాలంలో చెల్లించాలని, ఆయా విభాగాల ఇండెంట్‌ను నిర్ణీత సమయంలో అందేలా చూడాలని మంత్రులు ఆదేశించారు. ప్రతినెలా ఏడోతేదీన వారికి వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, కేటాయించిన నిధులతో వైద్య, ఆరోగ్య సంబంధ కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. రాష్ట్రంలో క్యాన్సర్ నియంత్రణపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, సర్కారు దవాఖానల పరిధిలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను విస్తృతంగా నిర్వహించాలని మంత్రులు సూచించారు. ఈ సమావేశంలో వైద్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎ శాంతికుమారి, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ యోగితారాణా, టీవీవీపీ కమిషనర్, డీఎండీ రమేశ్‌రెడ్డి, ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన డైరెక్టర్ జ

నన్ను నిందించటం కోసం కాంగ్రెస్ వారు దూషణలను దిగుమతి చేసుకుంటున్నారు. మీరు నన్నేమైనా అనండి, దేశాన్ని మాత్రం దూషించకండి. దేశాన్ని ముందుకుపోనీయండి. అభివృద్ధికి అడ్డుతగులకండి. 370ఆర్టికల్ విషయంలో దేశమంతా మద్దతుగా నిలిస్తే, కాంగ్రెస్ పార్టీ విమర్శిస్తున్నది.

నరేంద్ర మోదీ, ప్రధాని

దుర్గామాత పూజా కార్యక్రమంలో రాష్ట్ర ప్రథమ పౌరునికి దక్కిన గౌరవం, బెంగాల్ ప్రజల సంస్కృతికి మచ్చ తెచ్చేదిగా ఉన్నది. నన్ను ముందు వరుసలో కూర్చోనీయకుండా, టీవీలో కనిపించకుండా చేసి రాష్ట్ర ప్రభుత్వం వివక్షచూపింది. ఇది నన్ను తీవ్రంగా బాధించింది. ఇది నాకు మాత్రమే జరిగిన అవమానం కాదు, బెంగాల్ సంస్కృతికే అవమానం.

జగ్‌దీప్ ధంకర్, పశ్చిమ బెంగాల్ గవర్నర్

చరిత్రలో నేడు

1905

విభజించి-పాలించు నీతిలో భాగంగా బెంగాల్ విభజన చేసిన బ్రిటిష్ పాలకులు. పెద్ద ఎత్తున వలసలు, భారత్‌లో తీవ్ర అనిశ్చితి.

1916

అమెరికా బ్రూక్లిన్‌లో మొదటిసారి కుటుంబ నియంత్రణ దవాఖాన ప్రారంభించిన మార్తరెట్ సెంగర్.

1934

మావో నేతృత్వంలో చైనాలో 25 వేల మందితో ఆరు వేల మైళ్ల దూర ప్రయాణం లాంగ్‌మార్చ్ ప్రారంభం.

రెండురోజుల పర్యటనకు వచ్చిన చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నేపాల్‌కు హిమాలయ పర్వతాల నుంచి రైలు మార్గం నిర్మించడానికి అధ్యయనం చేపడుతున్నట్టు ప్రకటించారు. రెండు దేశాల మధ్య అనుసంధానం పెంచడానికి చైనా ప్రతిపాదిస్తున్న బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో భాగంగా ట్రాన్స్ హిమాలయన్ మల్టి డైమెన్షనల్ కనెక్టివిటీ నెట్‌వర్క్‌అనే పథకాన్ని చేపడుతున్నారు. అరానికో రహదారిని మెరుగు పరచడంలో భాగంగా భారీ సొరంగాన్ని నిర్మించాలని కూడా చైనా ప్రతిపాదిస్తున్నది.

ది హిమాలయన్ టైమ్స్

బంగ్లాదేశ్‌లో ఇటీవల జరిపిన ఒక అధ్యయనం ప్రకారం ఉన్నత పాఠశాలల్లో 55 శాతం మంది ఇంగ్లిష్, గణితం బోధించే ఉపాధ్యాయులకు తగినంత శిక్షణ లేదు. భౌతిక శాస్త్రం బోధించే వారిలో 75 శాతం, రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు 78 శాతం శిక్షణ పొందిన లేరు. గైడ్‌లు చదివి పాఠాలు చెప్పే ఉపాధ్యాయుల మూలంగా విద్యార్థులు నేర్చుకోలేరు. లక్షలాది మంది పట్టభద్రులు నిరుద్యోగులుగా ఉండటానికి కారణం వారికి పరిశ్రమలు కోరుతున్న నైపుణ్యాలు లేకపోవడమే. విద్యా మంత్రిత్వ శాఖ నిధులను తగు విధంగా ఉపయోగించుకోవాలె.

ది డైలీ స్టార్

ఆర్థిక నోబెల్

రెండు దశాబ్దాల తర్వాత మరోసారి భారత సంతతి ఆర్థికవేత్త, ఎంఐటీ ప్రొఫెసర్ అభిజిత్ వినాయక్ బెనర్జీకి ప్రతిష్ఠాత్మక ఆర్థికశాస్త్ర నోబెల్ పురస్కారం దక్కింది. ప్రపంచవ్యాప్తంగా పేదరికంపై పోరాటానికి అనుసరించాల్సిన విశ్వసనీయ, ఆచరణాత్మక ఆర్థికవిధానాల రూపకల్పనకు ప్రవాస భారతీయుడు అభిజిత్ బెనర్జీ, ఆయన భార్య ఎస్తర్ డఫ్లోతో పాటు మైఖెల్ క్రెమెర్‌లకు ఈ ఏడాది సంయుక్తంగా ఆర్థిక నోబెల్ పురస్కారం లభించింది. మైఖెల్ క్రెమర్ అమెరికాకు చెందిన ఆర్థికశాస్త్రవేత్త కాగా, ఎస్తర్ డఫ్లో ఫ్రాన్స్‌కు చెందినవారు. అతిపిన్న వయస్సులో నోబెల్ అందుకున్న రెండో మహిళ డఫ్లో. ఆర్థిక నోబెల్ అందుకోవటంలో అభిజిత్ బెనర్జీకి ఎస్తర్ డఫ్లో భాటగస్వామియే గాక, జీవిత భాగస్వామి కావటం ముదావహం. ఈమె బెనర్జీ దగ్గరే ఆర్థికశాస్త్రంలో పీహెచ్‌డీ చేసి, ఆయనకు జీవిత సహచరి అయింది. ఈ ముగ్గురూ ప్రపంచవ్యాప్తంగా పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వాలు అనుసరిస్తున్న అభివృద్ధి విధానాలను, వాటి ఫలితాలను క్షేత్రస్థాయిలో పరిశీలనలు, అధ్యయనాలతో ఆచరణాత్మక విధానాలను రూపొందించారు.

కరువు పరిస్థితులను ఎదుర్కోవటానికి ప్రపంచవ్యాప్తంగా పేదరికాన్ని రూపుమాపటం కోసం అనేక సంక్షేమ ఆర్థికవిధానాలు అమల్లోకి వచ్చాయి. అయినా దేశదేశాల్లో పేదరిక నిర్మూలన కోసం అనుసరిస్తున్న విధానాలు ఆశించిన స్థాయిలో ఫలితాలు రావటం లేదన్నది నిజం. ఇరువై ఒక్క సంవత్సరాల క్రితం ఆర్థికశాస్త్రంలో నోబెల్ పురస్కారం అమర్త్యసేన్‌ను వరించటంతో భారత్ మురిసిపోయింది. ప్రపంచవ్యాప్తంగా నూతన ఆర్థిక విధానాలు శరవేగంగా అమలవుతున్న కాలంలో సంక్షేమ ఆర్థికానికి పెద్దపీట వేసిన సిద్ధాంతానికి అమర్త్యసేన్‌కు ప్రపంచవ్యాప్తంగా ప్రశస్తి లభించింది. పేదరికాన్ని అంచనాకట్టే విధానాలకు రూపకల్పన చేయటంతో పాటు, సామాజిక కార్యక్రమాల ద్వారా ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తూ పేదరిక నిర్మూలనకు అమర్త్యసేన్ చూపిన మార్గం అనుసరణీయమైనది. అలాగే కరువు కాటకాలను ముందుగానే పసిగట్టే విధానాలను తీర్చిదిద్దటం ఆదర్శనీయం. పేదరికం కొలమానాలపై విస్తృత పరిశోధనలకు గాను 2015లో అంగుస్ డీటన్‌కు నోబెల్ దక్కింది. తాజాగా పేదరికంపై పోరాటానికి అనుసరించాల్సిన అత్యుత్తమ మార్గాలను, విధానాలను రూపకల్పన చేసినందుకు అభిజిత్ బెనర్జీ, ఎస్తర్ డఫ్లో, మైఖెల్ క్రేమర్ త్రయానికి నోబెల్ పురస్కారం దక్కటం గమనించదగినది. సమస్య లోతుల్లోకి వెళ్లకుండా పేదరిక నిర్మూలన పేరిట పలు పథకాలతో వేలకోట్ల రూపాయలు ఖర్చుచేయటం వల్ల ప్రయోజనం లేదని వీరు వివరించటం గమనార్హం. పేదరికంలో మగ్గుతున్న ఏయే వర్గాలకు వాస్తవికంగా ఏమి అవసరమో విశ్లేషించి అవసరమైన పరిష్కారాలను చూపినప్పుడు, తగు విధానాలను అనుసరించినప్పుడు మంచి ఫలితాలు వస్తాయన్నది ఈ ముగ్గురి రెండు దశాబ్దాల అధ్యయనసారం. అభిజిత్ బెనర్జీ, ఎస్తర్ డఫ్లో పలుదేశాల్లో అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు, వాటి ఫలితాలపై క్షేత్రస్థాయిలో విస్తృత పరిశోధనలు చేశారు. ఆ క్రమంలోనే సూక్ష్మ రుణాల పథకంపై హైదరాబాద్ కేంద్రంగా అధ్యయనం, పరిశోధనలు చేయటం గమనార్హం.

పేదరికం ఎక్కడ ఏ రూపంలో ఉన్నా తుద ముట్టించాలన్నది ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో మొట్టమొదటిది. ప్రపంచవ్యాప్తంగా మానవాళిలో పది శాతం మంది ఇం కా కటిక పేదరికంలో మగ్గిపోతున్నారు. అంటే డెబ్భై కోట్ల మందికి పైగా దుర్భర దారిద్ర్యంలో కనీస అవసరాలు తీర్చుకోలేని దీనస్థితిలో ఉన్నారు. కూడు, గూడు, గుడ్డకు నోచుకోవట్లేదు. విద్య, వైద్యం, రక్షిత మంచినీరు అందుబాటులో లేని దుస్థితి ఉన్నది. ఈ నేపథ్యంలోనే అభిజిత్ బెనర్జీ త్రయం క్షేత్రస్థాయి అధ్యయనాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఆధునిక ప్రపంచంలో సరళీకృత ఆర్థికవిధానాల నేపథ్యంలో అభివృద్ధి కొత్తపుంతలు తొక్కుతూ రాకెట్ వేగంతో దూసుకుపోతుండగా, మరోవైపు పేదరికం కూడా అదేస్థాయిలో పెరిగిపోతుండటం ఓ వైరుధ్యం. పేదరికం ఎక్కడ ఏ రూపంలో ఉన్నా తుద ముట్టించాలన్నది ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో మొట్టమొదటిది. ప్రపంచవ్యాప్తంగా మానవాళిలో పది శాతం మంది ఇంకా కటిక పేదరికంలో మగ్గిపోతున్నారు. అంటే డెబ్భై కోట్ల మందికి పైగా దుర్భర దారిద్ర్యంలో కనీస అవసరాలు తీర్చుకోలేని దీనస్థితిలో ఉన్నారు. కూడు, గూడు, గుడ్డకు నోచుకోవట్లేదు. విద్య, వైద్యం, రక్షిత మంచినీరు అందుబాటులో లేని దుస్థితి ఉన్నది. ఈ నేపథ్యంలోనే అభిజిత్ బెనర్జీ త్రయం క్షేత్రస్థాయి అధ్యయనాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే వీరు తమ అధ్యయనం, పరిష్కార మార్గాల్లో అభివృద్ధి సంక్షేమ పథకాల అమలును సైద్ధాంతిక, విధానాల ప్రాతిపదికన గాకుండా సూక్ష్మస్థాయిలో వ్యక్తి కేంద్రంగా తక్షణావసరాలను గుర్తించి పరిష్కరించాలని విధానకర్తలకు సూచించారు. అయోడిన్ లోపంతో బాధపడుతున్న వారికి తక్షణావసరం అయోడిన్ ఉప్పు అందించటమే తక్షణ కార్యక్రమంగా ఉండాలన్నది వీరి వాదన. మనుషుల సాంస్కృతిక జీవనంతో ముడిపడి ఉన్న సమస్యలకు పరిష్కారమార్గాలను ఇంకా అన్వేషించాలనడం ఆశ్చర్యమే. సాంస్కృతిక ఆధిపత్యం, వస్తుమయవాదం తెచ్చే విధ్వంసం గురించి ఇప్పటికే అనేక పరిశోధనలు జరిగి వాటి దుష్ఫరిణామాలను ప్రపంచానికి తేటతెల్లం చేశాయి. సామాజిక జీవన విధానాల నేపథ్యంలో ఎదురయ్యే పరిస్థితులను అటుంచితే, సంక్షేమ ఆర్థికవిధానాల అమలులో బెనర్జీ త్రయం నిగ్గుతేల్చిన నిజాలు నేటి సంక్షుభిత సమాజానికి వెలుగుబాటలు అనటంలో సందేహం లేదు. ఆ అర్థంలో అభిజిత్ బెనర్జీ, ఎస్తర్ డఫ్లో, మైఖెల్ క్రేమర్‌ల సామాజిక ఆలోచనలు, ఆచరణాత్మక మార్గం సర్వత్రా అనుసరణీయం, ఆదర్శం. తమకు నోబెల్ బహుమతి వచ్చిన సందర్భంగా మాట్లాడుతూ మన దేశ ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందంటూ అభిజిత్ బెనర్జీ చేసిన హెచ్చరిక కూడా ఆలోచింపదగినది.

జనగళం

టీఎస్పీఎస్సీకి అభినందనలు

ఉమ్మడి పాలనలో నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణ ప్రాంత ప్రజలు తీవ్ర దోపిడీ, అణిచివేతలకు గురయ్యారు. ఆ నేపథ్యంలోనే తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖాళీలను పూరిస్తూ వస్తున్నది తెలంగాణ ప్రభుత్వం. దీనిలో భాగంగానే ఇటీవల ఎస్జీటీ తెలుగు మీడియం ఫలితాలు విడుదల చేసి తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చరిత్ర సృష్టించింది. కొందరు కోర్టులో వేసిన కేసులను, అడ్డంకులను అధిగమించి నియామకాలు చేపట్టడం హర్షణీయం. ఈ విషయంలో చాకచక్యంగా వ్యవహరించిన టీఎస్పీఎస్సీకి అభినందనలు. అట్లాగే పీఈటీ,ఎస్జీటీ ఇంగ్లీష్ మీడియం ఫలితాలు కూడా ప్రకటించాలి.

- జీడిపల్లి లింగారావు, రామకృష్ణకాలనీ, కరీంనగర్

బీజేపీ ఒంటెద్దు పోకడలు

25 వేల మంది హోంగార్డులను తొలిగిస్తూ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం బాధాకరం. నిరుద్యోగాన్ని రూపుమాపుతామని ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకటించి తీరా అధికారంలోకి వచ్చినంక ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టడం బీజేపీ కుటిల నీతికి నిదర్శనం. కేంద్రంతో పాటు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్న చందాన వ్యవహరిస్తున్నది. బీజేపీ ప్రభుత్వం ఒంటెద్దు పోకడలకు పోవడం ప్రజాస్వామ్యస్ఫూర్తికే విరుద్ధం.

-బోనగిరి వేదేశ్వర్, భువనగిరి , యాదాద్రిభువనగిరి జిల్లా

చర్చల ద్వారా పరిష్కరించుకోవాలె

తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి, సమ్మెకాలపు వేతనాలు చెల్లించాలంటూ కార్మికులు వేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించి, ఆర్టీసీ నాయకులు ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించింది. పండుగలు, విద్యార్థులకు సెలువులు ఉన్నకాలంలో సమ్మెకు దిగడం ఎంత వరకు సమంజసమంటూ ప్రశ్నించింది. ఇకనైనా ఆర్టీసీ కార్మికులు సమ్మెను విరమించుకోవాలి.

- కొత్వాల్ ప్రవీణ్‌కుమార్, బేగంపేట, హైదరాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7.8.9. కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

విశ్లేషణ

డ్రాగన్‌తో జర జాగ్రత్త!

ప్రొఫెసర్ హెచ్.వెంకటేశ్వర్లు

చైనా నిన్నటివరకు పాకిస్థాన్‌కు మద్దతు ఇస్తూ భారత్‌ను అనేకరకాలుగా ఇరుకున పెట్టే ప్రకటనలు చేస్తూ వచ్చింది. ఆర్టికల్ 370పై పాకిస్థాన్‌కు అంతర్జాతీయ వేదికల్లో వంతపాడుతున్నది. కశ్మీర్ సమస్యకు యూ.ఎన్.చార్టర్ ద్వారానే పరిష్కారం చూపాలన్నది. ఇప్పుడు మాత్రం కశ్మీర్ అంశం భారత్, పాకిస్థాన్ దేశాల ద్వైపాక్షిక అంశంగా పేర్కొంటున్నది. స్వయానా పాకిస్థాన్ దేశ ప్రధాని చైనా పర్యటనలో ఉన్నప్పుడే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

ఒకవైపు డోక్లాం వివాదంతో, మరోవైపు ఆర్టికల్ 370 రద్దుపై పాకిస్థాన్‌కు మద్దతునిస్తూ ఇటీవలికాలంలో భారత్‌పై గుర్రుగా ఉన్న చైనా ఇప్పుడు అకస్మాత్తుగా ఎందుకు మన దేశానికి స్నేహహస్తం అందిస్తున్నది. తనతో సమానంగా అత్యంతవేగంగా అభివృద్ధి చెందుతున్న మన దేశం పట్ల చైనా వైఖరి ప్రపంచానికి తెలియంది కాదు. దశాబ్దాల కాలం నాటినుంచి మనదేశ ఎదుగుదలను హర్షించలేక, పరోక్షంగా పాకిస్థాన్‌కు మద్దతునిస్తున్న చైనా వైఖరిలో ఇంత మార్పునకు కారణం 'మన దేశ సుస్థిర మార్కెట్' మాత్రమే.

ఒకప్పుడు ఒకదేశం మరో దేశంపై ఆధిపత్యం కోసం యుద్ధం చేయాల్సి వచ్చేది. కానీ ప్రపంచీకరణ తర్వాత పరిస్థితులు మారిపోయాయి. ఇప్పుడు ఒకదేశం ఇంకొక దేశంపై ఆధిపత్యం కోసం ఆ దేశానికి చెందిన వస్తువుల దిగుమతిపై సుంకం పెంచుతున్నది. వాటినే వాణిజ్యయుద్ధంగా పేర్కొంటున్నది. ఇలా గత సంవత్సర కాలంగా అమెరికా-చైనా వాణిజ్యయుద్ధంతో చైనా దేశ ఆర్థికవ్యవస్థ నానాటికీ దిగజారుతున్నది. అందుకే గడ్డు పరిస్థితుల నుంచి బయటపడేందుకు ప్రపంచంలోని ఆరవ అతిపెద్ద వినిమయ మార్కెట్ కలిగిన మనదేశంతో కయ్యం కన్నా వియ్యం నయమన్న చందంగా చైనా అధ్యక్షుడు 'జిన్‌పింగ్' పర్యటన సాగింది. చైనా ఉత్పత్తులకు మనదేశంలో మార్కెట్ పెంచుకోవడం కోసమే ఇలా చైనా వైఖరి మార్చుకున్నది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి దృష్ట్యా ఆ దేశ ఆర్థిక సుస్థిరత కోసం మనదేశంతో సత్సంబంధాలు పెంచుకోవడమే లక్ష్యంగా చైనా అడుగులు వేస్తున్నట్లుగా ఉన్నది.

చైనా నిన్నటివరకు పాకిస్థాన్‌కు మద్దతు ఇస్తూ భారత్‌ను అనేకరకాలుగా ఇరుకున పెట్టే ప్రకటనలు చేస్తూ వచ్చింది. ఆర్టికల్ 370పై పాకిస్థాన్‌కు అంతర్జాతీయ వేదికల్లో వంతపాడుతున్నది. కశ్మీర్ సమస్యకు యూ.ఎన్.చార్టర్ ద్వారానే పరిష్కారం చూపాలన్నది. ఇప్పుడు మాత్రం కశ్మీర్ అంశం భారత్, పాకిస్థాన్ దేశాల ద్వైపాక్షిక అంశంగా పేర్కొంటున్నది. స్వయానా పాకిస్థాన్ దేశ ప్రధాని చైనా పర్యటనలో ఉన్నప్పుడే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. చైనా స్వరం మారడానికి రెండు కారణాలున్నాయి. మొదటిది చైనా ఆర్థికసంక్షోభం. వాస్తవానికి కొంతకాలంగా చైనా ఆర్థికవ్యవస్థ ఒడిదొడుకులకు లోనవుతున్నది. ఈ సంవత్సరం మొదటి త్రైమాసికంలో 6.4 శాతం వృద్ధిరేటు నమోదు కాగా రెండవ త్రైమాసికంలో అది 6.2 శాతానికి పడిపోయింది. మొదటి ఆరు నెలల్లో విదేశీ ఎగుమతులు 0.1 శాతం మాత్రమే పెరిగాయి. అంతేకాదు చైనాలో సైతం మొదటి అర్ధభాగంలో వాహనాల అమ్మకాలు 12.4 శాతం తగ్గాయని ఆ దేశ వాహన తయారీదారుల అసోసియేషన్ చెబుతున్నది. ఫలితంగా అక్కడి పట్టణ నిరుద్యోగం మే నెలలో 5 శాతం ఉండగా జూన్‌లో 5.1 శాతానికి పెరిగింది. ప్రస్తుతం ఆ దేశ జీడీపీ 28 సంవత్సరాల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. 2019 సంవత్సరం తొలి 8 నెలల కాలంలో చైనా వాణిజ్య మిగులు 1.6 శాతానికి క్షీణించింది. విదేశీ వర్తకంలో అతిపెద్ద వాణిజ్య భాగస్వామైన అమెరికాతో వాణిజ్యయుద్ధం ఈ పరిస్థితికి కారణం. చైనా మొత్తం ఎగుమతుల్లో అమెరికా 479.7 బిలియన్ డాలర్లతో, 19.2 శాతంతో మొదటిస్థానంలో ఉన్నది. అయితే వాణిజ్యయుద్ధం కారణంగా ఎగుమతులు ప్రభావితమవుతున్నాయి. అందుకే భవిష్యత్తులో అమెరికాతో అంతర్జాతీయ వాణిజ్యంలో ఎదురయ్యే నష్టాలను పూడ్చుకోవడానికి ప్రత్యామ్నాయంగా మన దేశంవైపు

చూస్తున్నది. చైనా ఉత్పత్తులకు మనదేశంలో మార్కెట్ పెంచుకోవడం కోసమే ఇలా చైనా స్నేహహస్తం చూపుతున్నది.

ఇక రెండవది బలపడుతున్న అమెరికా, భారత్ బంధం. భవిష్యత్తులో 'సూపర్ పవర్'గా ఎదుగాలనుకుంటున్న చైనాకు చెక్‌పెట్టే ఉద్దేశంతోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై వాణిజ్యపరంగా దూకుడు పెంచుతున్నాడు. దానికోసం అమెరికా భారత్‌కు దగ్గరవ్వడం, ఇటీవల 'హౌదీ మోదీ' పేరిట జరిగిన సభ ద్వారా అమెరికా, భారత్ సంబంధం మరింత మెరుగవ్వడం. అంతేకాక రానున్న అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌కు తిరిగి అమెరికన్లు పట్టం కట్టవచ్చు అనే ఊహాగానాలు పెరిగాయి. ట్రంప్ మళ్ళీ అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపడితే అది భవిష్యత్తులో చైనా విదేశీ వర్తకంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నది. కాబట్టి చైనా ఇప్పుడు మన దేశానికి స్నేహహస్తం అందిస్తున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌తో వాణిజ్యబంధం బలపరుచుకుంటే అమెరికా వల్ల ఏర్పడుతున్న నష్టాలను దీటుగా ఎదురుకోవచ్చు అనేది చైనా వ్యూహంగా కనిపిస్తున్నది. అంతేకాదు వేగంగా అభివృద్ధి చెందుతూ చైనాకు సరిసమానంగా ఎదుగుతున్న మనదేశం ఇండో-పసిఫిక్ వ్యూహంలో భాగంగా అమెరికా, జపాన్ దేశాలతో మైత్రిని బలపరుచుకుంటూ చైనాకు కళ్లెం వేయాలని భావిస్తున్నది. ఇటీవలికాలంలో చైనాతో విరోధంగా ఉన్న మలేషియా, వియెత్నాం, ఫిలిప్పీన్స్ వంటి దేశాలతో భారత్ వ్యూహాత్మకంగా సంబంధాలు మెరుగుపరుచుకుంటున్నది. అలాగే అంతర్జాతీయంగా భారత్ ఇమేజ్ పెరుగడం, ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో ప్రపంచ దేశాలను ఒక తాటిమీదికి తెస్తున్నది. ముఖ్యంగా ప్రపంచ వినియోగ మార్కెట్లో భారత్ అతిపెద్ద మార్కెట్‌గా భావిస్తున్న ప్రపంచ దేశాలు మన దేశంలో పెట్టుబడులు పెట్టడంపై ఆసక్తి చూపిస్తున్నాయి. ఇటీవలికాలంలో తదనుగుణంగా భారత ప్రభుత్వం కార్పొరేట్ పన్ను తగ్గించడం, బ్యాంకుల విలీనం ద్వారా బ్యాంకులు పటిష్ఠపరుచడం వంటి నిర్ణయాలు తీసుకుంటున్నది. ఈ గడ్డు పరిస్థితుల్లో పాక్‌తో సంబంధం కన్నా భారత్‌తో సంబంధమే ముఖ్యమనే నిర్ణయానికి చైనా వచ్చినట్లున్నది.

చైనాతో మైత్రి బంధం ధృతరాష్ట్ర కౌగిలి వంటిదని ప్రధాని నరేంద్ర మోదీకి తెలియంది కాదు. గడిచిన నలభై ఐదేండ్లలో ఐక్యరాజ్య సమితిలో భారత్‌కు వ్యతిరేకంగా చైనా తన వీటో అధికారాన్ని సుమారు పదిసార్లు వినియోగించుకున్నది. అంతేకాక ముంబయిపై 2011లో ఉగ్రవాద దాడికి సూత్రధారుడైన జమాతే ఉద్ దవా సంస్థపై ఉగ్రజాబితాలో చేర్చకుండా అడ్డుకున్నది. లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ వంటి తీవ్రవాద సంస్థలపై భద్రతామండలిలో భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించింది. తీవ్రవాది జాకీ-ఉర్-రెహ్మాన్ లఖవ్‌ను జైలు నుంచి పాకిస్థాన్ విడుదలపై భద్రతామండలిలో చర్చకు రానీయకుండా చైనా వ్యవహరించింది. ఇలా ఐరాస లోపలా, బయటా మనదేశానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్న చైనాను గుడ్డిగా నమ్మకూడదు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో మైత్రి తలుపు కొడుతున్న చైనాతో బంధం మనదేశానికి అనుకూలంగా మలుచుకోవాలి. ఎందుకంటే మొదటిగా అమెరికా, చైనా అండతో కశ్మీర్ అంశంపై బుసలు కొడుతున్న పాకిస్థాన్‌కు అటు అమెరికాతో ఇటు చైనాతో బంధం బలపరుచుకోవడం ద్వారా ఆ దేశాన్ని ఒంటరిని చేయవచ్చు. ఇక రెండవది చైనాతో వాణిజ్యపరంగా మనదేశానికి వాణిజ్యలోటు సుమారు 52 బిలియన్ డాలర్లు. భారత్‌కు విదేశీ వ్యాపారంలో ఎక్కువ వాణిజ్య లోటు ఉన్న దేశం చైనా కాబట్టి ప్రస్తుత పరిస్థితుల్లో చైనా కొడుతున్న మైత్రి తలుపులు తెరిచి తద్వారా మన వాణిజ్యాన్ని బలోపేతం చేసే దిశగా అడుగులు మోపాలి. ద్విముఖ వ్యూహంతో అటు అమెరికా, చైనాతో దోస్తీకి సై అంటున్న మోదీ మునుముందు చాలా వ్యూహాత్మకంగా వ్యవహరించాలి.

(వ్యాసకర్త: ఇండియన్ కామర్స్ అసోసియేషన్ అధ్యక్షులు)

> చైనాతో మైత్రి బంధం ధృతరాష్ట్ర కౌగిలి వంటిదని ప్రధాని నరేంద్ర మోదీకి తెలియంది కాదు. గడిచిన నలభై ఐదేండ్లలో ఐక్యరాజ్య సమితిలో భారత్‌కు వ్యతిరేకంగా చైనా తన వీటో అధికారాన్ని సుమారు పదిసార్లు వినియోగించుకున్నది. అంతేకాక ముంబయిపై 2011లో ఉగ్రవాద దాడికి సూత్రధారుడైన జమాతే ఉద్ దవా సంస్థపై ఉగ్రజాబితాలో చేర్చకుండా అడ్డుకున్నది. లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ వంటి తీవ్రవాద సంస్థలపై భద్రతామండలిలో భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించింది. తీవ్రవాది జాకీ-ఉర్-రెహ్మాన్ లఖవ్‌ను జైలు నుంచి పాకిస్థాన్ విడుదలపై భద్రతామండలిలో చర్చకు రానీయకుండా చైనా వ్యవహరించింది. ఇలా ఐరాస లోపలా, బయటా మనదేశానికి వ్యతిరేకం గా కుట్రలు పన్నుతున్న చైనాను గుడ్డిగా నమ్మకూడదు.

మన బియ్యానికి బ్రాండ్ ఇమేజ్

తెలంగాణం

తూడి దేవేందర్

ప్రస్తుత సంవత్సరంలో విస్తారంగా వానలు పడ్డాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనేక కొత్త మెగా ఇరిగేషన్ ప్రాజెక్టుల వల్ల రాష్ట్రంలో వరి ధాన్యం గతంలో ఎన్నడూ లేనంత పెద్దఎత్తున పండే అవకాశాలున్నాయి. ఈ సీజన్లో ఇలా పండిన వరిధాన్యం మొత్తం కూడా ప్రభుత్వం నిర్ణయించిన సేకరణ కేంద్రాలను ముంచెత్తుతుంది.

గతంలో పంట వచ్చే సమయంలో వేలాదిమంది రైస్ మిల్లర్స్ ట్రేడర్స్ ప్రభుత్వ సేకరణ కేంద్రాలు ధాన్యం సేకరణలో ఉండేవి. దీనివల్ల ఈ సేకరణ జాప్యం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కానీ అంతకంటే ఎక్కువగా కానీ జరిగింది. అందుకు విరుద్ధంగా కొన్ని సంవత్సరాలుగా పండిన పంట మొత్తం కూడా ప్రభుత్వం నిర్ణయించిన సేకరణ కేం ద్రాల్లో ప్రభుత్వం కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో వరి పండించే పొలాల విస్తీర్ణం తగ్గినా, ఉత్పాదకత పెరుగకున్నా సేకరణ మాత్రం ఎన్న డూలేనంత అధికస్థాయిలో ఏయేటికాయేడు పెరుగుతూ వస్తున్నది. ప్రభుత్వాధికారులు తమ ఘనకార్యంగా భావిస్తూ ముఖ్యమంత్రికి ఈ విషయంలో తప్పుడు సంకేతాలు ఇచ్చారు.

వాస్తవానికి ధాన్యం సేకరణ ఏయేటికాయేడు పెరుగడానికి కారణం బహిరంగ మార్కెట్లో ధాన్యానికి కానీ బియ్యానికి గానీ ఏ మాత్రం డిమాండ్ లేకపోవడం. గతంలో తెలంగాణ రాష్ట్ర బియ్యానికి ఇతర రాష్ట్రాలలో ఇతర దేశాల్లో ఉన్న మార్కెట్ పూర్తిగా పడిపోవడం, దానివల్ల ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ధాన్యం మొత్తాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం కొనవలసిన పరిస్థితి దాపురించింది. ఎక్కడ ఇతర అవకాశాల్లేవు. అందుకే రైతులు ధాన్యం కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాసి ప్రభుత్వం నిర్ణయించిన ధరకు తమ ధాన్యాన్ని అమ్ముకోవడం జరుగుతున్నది.

ఈ పరిస్థితులు రావడానికి గతంలో ప్రభుత్వాలు ఆచరించిన దూరదృష్టి లేని విధానాలే కారణం. దీనివల్ల బహిరంగ మార్కెట్లో తెలంగాణ రాష్ట్రం బియ్యానికున్న గొప్ప బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నది. రాష్ట్ర బియ్యాన్ని ఒక చౌక, నాణ్యత లేని వస్తువుగా మార్చడం జరిగింది. దీనికి అర్థశాస్త్రంలో చెప్పిన giffen paradox giffen products సూత్రం. ప్రజల ఆదాయం పెరిగినా కొన్ని వస్తువుల ధర పెరుగదు. వాటి వినియోగం కూడా పెరుగదు. దాన్ని giffen paradoxగా చెబుతారు. అలాగే కొన్ని వస్తువుల ధర పడిపోయినప్పుడు వినియోగం కూడా పడిపోతుంది. మామూలుగా అయితే తగ్గినప్పుడు వస్తువు వినియోగం పెరుగాలి. కానీ giffen ప్రొడక్ట్ అని ముద్రపడిన వస్తువుల విషయంలో ఇది జరుగదు.

నాణ్యమైనవి అయినా రేషన్ రేషన్ బియ్యాన్ని ఒక్క రూపాయికి విడుదల చేశారు. దీంతో ప్రజలకు బియ్యం ఒక నాణ్యత లేని వస్తువుగా, వినియోగించడానికి వీలులేని వస్తువుగా మారిపోయింది. దాని వినియోగం పూర్తిగా నానాటికీ పడిపోయింది. రేషన్‌కార్డుల సంఖ్య పెరిగినా వినియోగించే ప్రజల సంఖ్య తగ్గిపోయింది. రేషన్ బియ్యం అనే ఒక విలువ లేని వస్తువు మార్కెట్ నుంచి తక్షణమే తొలిగించాలి.

రాష్ట్రంలో ఉత్పత్తి అయిన బియ్యం ఇతర రాష్ట్రాల

మాజీ ఎంపీల బంగ్లాలకు కరెంట్, నీళ్లు బంద్

అధికారులను ఆదేశించిన పార్లమెంట్ హౌస్ కమిటీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: నిబంధనల ప్రకారం ఎంపీలు పదవీకాలం ముగిసిన నెలరోజుల్లోపు తమకు కేటాయించిన బంగ్లాను ఖాళీ చేయాలి. అలా చేయని 27 మంది మాజీ ఎంపీల బంగ్లాలకు నీళ్లు, విద్యుత్, గ్యాస్ సరఫరా నిలిపివేయాలని అధికారులను లోక్‌సభ హౌస్ కమిటీ ఆదేశించింది. ఇందుకుగాను పోలీసుల సహాయాన్ని తీసుకోవాలని సూచించింది. 27 మంది మాజీ ఎంపీలు బంగ్లాలను ఖాళీ చేయకుండా అందులోనే కొనసాగుతుండటంతో కొత్తగా ఎంపికైన ఎంపీలకు వసతి సదుపాయాన్ని కల్పించడం కష్టమవుతున్నదని కమిటీ చైర్మన్, ఎంపీ సీఆర్ పాటిల్ పేర్కొన్నారు. దీంతో కొంత మంది ఎంపీలు తమ రాష్ట్రాలకు చెందిన గెస్ట్‌హౌస్‌లలో వసతి పొందుతున్నారని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన ఎంపీల బంగ్లాలకు నీళ్లు, విద్యుత్, గ్యాస్ సరఫరాను నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు.

భావోద్వేగాన్ని అదుపులో ఉంచుకోండి

- పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు దలైలామా సూచన
- భారత్‌ను చూసి ప్రజాస్వామ్యాన్ని నేర్చుకోవాలని చైనాకు చురక



చండీగఢ్, అక్టోబర్ 15: పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలని టిబెటిన్ ఆధ్యాత్మిక గురువు దలైలామా సూచించారు. ఆసియా ప్రాంతంలో శాంతి కోసం ఇమ్రాన్ నిజమైన చర్యలు చేపట్టాలని కోరారు. మంగళవారం పంజాబ్‌లో చండీగఢ్ యూనివర్సిటీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో దలైలామా పాల్గొని మాట్లాడారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచదేశాలన్నీ ఏకం కావాలని భారత ప్రధాని మోదీ పిలుపునివ్వడం గొప్ప విషయమని చెప్పారు. 'ఇటీవల ఐక్యరాజ్యసమితి సాధారణ సమావేశంలో మోదీ, ఇమ్రాన్‌ఖాన్ మాట్లాడారు. వీరిద్దరి ప్రసంగాల్లో చాలా తేడా ఉన్నది. శాంతి గురించి మోదీ మాట్లాడితే.. ఇమ్రాన్‌ఖాన్ ఏం మాట్లాడారో ఇక్కడున్న వారందరికీ తెలుసు. చైనా మద్దతును పాక్ కోరడం తప్పనిసరి కావొచ్చు. కానీ పాక్‌కు భారత్ అవసరం కూడా ఉన్నది. కాబట్టి పాక్ నేతలు భావోద్వేగాలకు అతీతంగా ఆలోచించాలి. సమస్య పరిష్కారానికి ఏం చేస్తే బాగుంటుందన్న విషయాన్ని గుర్తించి దాన్ని అనుసరించాలి' అని దలైలామా పేర్కొన్నారు. కశ్మీర్ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్-చైనా మధ్య సంబంధాలు మెరుగుపడటం చాలా మంచిదని, కానీ భారత్‌ను చూసి ప్రజాస్వామ్యం గురించి చైనా నేర్చుకోవాలని సూచించారు.

మొదటిసారిగా 'ట్యాక్సీబోట్'ను వాడిన విమానయాన సంస్థగా ఎయిర్ ఇండియా ప్రపంచ రికార్డు సృష్టించింది. మంగళవారం ఢిల్లీ నుంచి ముంబైకి వెళ్లే ఏ-320 విమానాన్ని టెర్మినల్ నుంచి రన్‌వే వరకు ట్యాక్సీబోట్ ద్వారా తరలించారు. ఇది పైలట్ నియంత్రణలో ఉండే ట్రాక్టర్ వంటి వాహనం. విమానాలను పార్కింగ్ స్టాండ్ నుంచి టెర్మినల్‌కు, అక్కడి నుంచి రన్‌వే వరకు తీసుకెళ్తుంది. తద్వారా విమాన ఇంధనం భారీగా ఆదా అవుతుంది.

అయోధ్య కేసు.. విచారణ నేడే ఆఖరు!

- 40 రోజులుగా కొనసాగుతున్న విచారణ
- నేటితో వాదనలు పూర్తి చేస్తామని సీజేఐ రంజన్‌గొగోయ్ సంకేతాలు
- త్వరలో తీర్పు వెలువడే అవకాశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: దేశవ్యాప్తంగా ఉత్కంఠ కలిగిస్తున్న అయోధ్యలో రామజన్మభూమి-బాబ్రీ మసీదు వివాదంపై సుప్రీంకోర్టు విచారణ తుదిదశకు చేరుకున్నది. రాజ్యాంగ ధర్మాసనం నేతృత్వంలో కొనసాగుతున్న రోజువారీ విచారణ బుధవారంతో ముగియనున్నట్టు తెలుస్తున్నది. మంగళవారం జరిగిన విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) రంజన్ గొగోయ్ .. వాదోపవాదనలను బుధవారం నాడే ముగిస్తామని సంకేతాలిచ్చారు. 40 రోజులపాటు జరిగిన వాదోపవాదనలను సమగ్రంగా విశ్లేషించిన అనంతరం ధర్మాసనం త్వరలో తీర్పును వెలువరించే అవకాశం ఉన్నది. నవంబర్ 17వ తేదీన రంజన్ గొగోయ్ పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆలోపే తీర్పు వెలువడే అవకాశం ఉంది. ఒకవేళ ఆ లోపున తీర్పు రాని పక్షంలో ఈ కేసును కొత్త ధర్మాసనం ముందు తిరిగి మొదటి నుంచి విచారించాల్సి వస్తుంది. గత 39 రోజులుగా సాగుతున్న అయోధ్య కేసు విచారణను తొలుత అక్టోబర్ 18(శుక్రవారం) ముగించాలని ధర్మాసనం భావించింది. ఆ తర్వాత గడువును అక్టోబర్ 17(గురువారం)కు జరిపారు. కాగా వాదోపవాదనలను బుధవారం నాడే ముగిస్తామని సీజేఐ తాజాగా సంకేతాలిచ్చారు. అలాగే, బుధవారం నాడు ఇరువర్గాల వాదనలను సాయంత్రం 5 గంటల వరకు కోర్టు వినబోతున్నట్టు కూడా ప్రకటించారు. మంగళవారం కూడా కోర్టు సాయంత్రం 5 గంటల వరకు ఇరు పక్షాల వాదనలను విన్నది. రామజన్మభూమి-బాబ్రీ మసీదు వివాదంపై ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం రోజువారీ విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే.

బాబర్ చేసిన తప్పును సరిదిద్దాలి

39వ రోజైన మంగళవారం సీజేఐ రంజన్ గొగోయ్ నేతృత్వంలో జస్టిస్‌లు ఎస్ఏ బోబ్డే, డీవై చంద్రచూడ్, అశోక్ భూషణ్, ఎస్‌కే నజీర్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కక్షిదారుల్లో ఒకరైన మహంత్ సురేష్ దాస్ తరపున మాజీ అటార్నీ జనరల్, సీనియర్ న్యాయవాది కే పరాశరణ్, సున్నీ వక్ఫ్‌బోర్డు తరపున సీనియర్ న్యాయవాది రాజీవ్ ధవన్ హాజరయ్యారు. పరాశరణ్ వాదనలు వినిపిస్తూ.. అయోధ్యలో ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు అనేక మసీదులు ఉన్నాయని, అయితే హిందువులు రాముడి జన్మస్థలాన్ని ఎన్నడూ మార్చలేరని చెప్పారు. మొఘల్ పాలకుడైన బాబర్ అధికారం చేతిలో ఉన్నదనే కారణంతో రాముడు జన్మించిన ప్రాంతంలో మసీదును నిర్మించి చారిత్రక తప్పిదం చేశాడని పేర్కొన్నారు. ఇప్పుడు దానిని సరిదిద్దాలని ధర్మాసనాన్ని కోరారు. ఈ సందర్భంగా ధర్మాసనం వివాదాస్పద 2.77 ఎకరాల భూభాగంలో ఒకప్పుడు మసీదు ఉండేది కాబట్టి ముస్లింలు ఎలా హక్కుదారులు కాకుండా పోతారని పరాశరణ్‌ను ప్రశ్నించింది. '1992లో కూల్చివేతకు ముందు అక్కడ మసీదు ఉండేది కాబట్టి తామూ హక్కుదారులమే అని వారు చేస్తున్న వాదనను మీరు సమర్థిస్తున్నారా?' అని అడుగగా.. 'నేను ఒప్పుకోవడంలేదు. ముందు అక్కడ ఆలయం ఉండేది కాబట్టి అది ఆలయానిదే' అని న్యాయవాది సమాధానం ఇచ్చారు. దీంతోపాటు పరాశరణ్‌ను పలు న్యాయసంబంధ ప్రశ్నలు అడిగిన అనంతరం సీజేఐ రంజన్ గొగోయ్.. న్యాయవాది రాజీవ్ ధవన్‌ను ఉద్దేశించి 'మేము హిందూ కక్షిదారులను కూడా సరిపడా ప్రశ్నలు అడుగుతున్నామని మీరు ఇప్పుడైనా భావిస్తున్నారా?' అని ప్రశ్నించారు. సోమవారం వాదనల సందర్భంగా రాజీవ్ ధవన్ మాట్లాడుతూ 'ధర్మాసనం ఎప్పుడూ ముస్లిం కక్షిదారులనే ప్రశ్నలు అడుగుతున్నది' అంటూ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఆయనను సీజేఐ పై విధంగా ప్రశ్నించారు.

జాతీయవాదం ఒక తెర!

- పేదరికం, ఇతర సమస్యల నుంచి అది దృష్టిని మరలుస్తుంది
- భిన్నాభిప్రాయాన్ని వెల్లడించే అవకాశం ఉండాలి
- భారతీయులకు కనీస ఆదాయ హామీ పథకం అవసరం
- ఆర్థిక నోబెల్ విజేత అభిజిత్ బెనర్జీ సూచన

అభిజిత్ వినాయక్ బెనర్జీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: కరుడుగట్టిన జాతీయవాదం పేదరికం వంటి కీలక అంశాల నుంచి దృష్టి మరలుస్తుందని నోబెల్ బహుమతి విజేత అభిజిత్ వినాయక్ బెనర్జీ పేర్కొన్నారు. భారతీయులకు కనీస ఆదాయ హామీ పథకం తక్షణ అవసరమని చెప్పారు. దేశంలోని మౌలికమైన విధానాలు, జాతీయవాదం, ఆర్థిక ప్రగతి విషయంలో విభేదించేందుకు, భిన్నాభిప్రాయాలు కలిగి ఉండేందుకు అవకాశం కల్పించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. అర్థశాస్త్రంలో తన భార్య ఎస్తేర్ డ్యుఫ్లో, మైఖేల్ క్రేమర్‌తో కలిసి నోబెల్ పురస్కారానికి ఎంపికైన అభిజిత్ మంగళవారం ఇండియా టుడే సంస్థకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల సమస్యలు పక్కకు పోయాయి. బాలాకోట్‌పై దాడులు.. దేశం పటిష్ఠంగా ఉన్నదా.. లేక చైనా, పాకిస్థాన్ గురించి మనం ఏం చెబుతున్నామన్నవి ప్రధాన అంశాలుగా మారిపోయాయి. ఆ ఎన్నికల్లో యువత, పట్టణ ప్రాంతాల్లోని విద్యావంతులు ఎన్డీయేకు ఓట్లు వేశారు. వీరు తాయిలాలకు అనుకూలంగానో లేదా వ్యతిరేకంగానో ఓటు వేయలేదు. జాతీయవాద అంశాలవైపు ఆసక్తిని కనబరిచారు. ఈ విషయంలో మోదీ తన వాక్చాతుర్యాన్ని ప్రభావవంతంగా ప్రదర్శించారు. వాస్తవానికి దేశ ఆర్థిక వ్యవస్థ విషయంలో శ్రద్ధ చూపాల్సిన సమయంలో జాతీయవాద అంశాలవైపు ఆకర్షితులయ్యారు.

> **ప్రజాకర్షక** పథకాలు, కరుడుగట్టిన జాతీయవాదం వాస్తవిక అంశాల నుంచి ప్రజల దృష్టిని మరలుస్తాయి. ఉపాధి లేమి, ఆర్థిక మందగమనం, పేదరికం వంటివి మరుగున పడిపోతాయి. గత ఎన్నికల్లో ఇదే జరిగింది.

కోల్‌కతాలోనే పేదరికం గురించి తెలిసింది

మా తాత కోల్‌కతాలోని అతిపెద్ద మురికివాడ పక్కనే ఇల్లు కట్టుకున్నారు. నేను ఆ మురికివాడలకు చెందిన పిల్లలతో ఆడుకుంటూ ఎదిగాను. పేదరికం అంటే ఏమిటో అక్కడే నాకు తెలిసింది. ఒకరి ఆర్థిక స్థితిని బట్టి పేదరికాన్ని అంచనా వేస్తాం. పేదరికం వల్ల కలిగే మానసిక నష్టాలు అపారం. వారికి గౌరవం లభించదు, నిరాశ్రయులవుతుంటారు, మురికివాడలలో నివసించాల్సి వస్తుంది, హింసకు గురవుతుంటారు. అమెరికాలో పేదరికం అంటే సాధికారతకు దూరం కావడం, అది ఆదాయాన్ని ఆధారంగా చేసుకొని పరిగణించే పేదరికం కాదు. అమెరికాలో ప్రస్తుతం పేదలుగా పరిగణింపబడుతున్న వారు భారత్‌లో 'మధ్య తరగతి' వర్గాల స్థాయిలో ఉంటారు. గౌరవ లేమి, బాగా బతకడం లేదన్న భావన వారిలో మరణాల సంఖ్యను పెంచుతున్నది.

జేఎన్‌యూ రాజకీయాలు నేర్పింది

ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) నాకు రాజకీయాలు నేర్పింది. రాజకీయాలు ఎంత ముఖ్యమైనవో అక్కడ తెలుసుకున్నాను. రామ్ మనోహర్ లోహియా వాదులు నాకు ఎంతో ముఖ్యమైనవారు. గాంధేయవాదులు, ఆరెస్సెస్, ఇతర రాజకీయ పార్టీల గురించి జేఎన్‌యూలోనే తెలుసుకున్నాను. కానీ ఇప్పుడు జేఎన్‌యూను గూర్చిన దృక్పథం మారింది. కొందరు దానికి జాతివ్యతిరేక శక్తుల కేంద్రంగా ముద్ర వేశారు. జేఎన్‌యూను 'దేశద్రోహపు ఆలోచనలు' చేసే ప్రదేశంగా చూస్తున్నారు. కానీ భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేయడం చట్టబద్ధంగా లభించిన హక్కుగా పరిగణించడం లేదు. దేశంలోని మౌలికమైన విధానాలు, జాతీయవాదం, ఆర్థిక ప్రగతి విషయంలో భిన్నాభిప్రాయాలకు అవకాశం కల్పించడం చాలా ముఖ్యం. భిన్నాభిప్రాయాలు మనకు జ్ఞానోదయం కలిగిస్తాయి, వేగంగా మారుతున్న, సంక్లిష్టమైన ప్రపంచాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని కలిగిస్తాయి.

ప్రజలకు ఆర్థిక రక్షణ ఉండాలి

భారత్ వంటి దేశంలో కనీస ఆదాయ పథకాన్ని అమలు చేయాలి. దేశంలో అత్యధికులు అనేక సమస్యలను ఆకస్మికంగా ఎదుర్కొంటున్నారు. అధిక వర్షపాతం లేదా వర్షాభావ పరిస్థితులు లేదా బ్యాంకులు దివాళా తీయడం కారణంగా కొందరి జీవితాలలో వారికున్న సమస్తం అదృశ్యమైపోతాయి. ఈ పరిస్థితుల నుంచి కాపాడే ఓ రక్షణ వలయం ప్రజలకు ఏర్పాటు చేయాలి. ఏ ప్రభుత్వానికైనా సమాజంలో అసమానతలను తొలిగించడం ప్రాథమిక లక్ష్యంగా ఉండాలి. అధిక పన్ను రేట్లు విపరీతమైన ప్రోత్సాహకాలను సృష్టిస్తాయనడానికి ఎటువంటి ఆధారాలు లేవు. ప్రభుత్వం ఇటీవల సంపన్నులపై పన్నులు పెంచి మంచి నిర్ణయం తీసుకుంది. ఆ నిర్ణయం మాత్రమే ఆర్థిక స్థితిని మెరుగుపరుస్తుందని భావించలేము. సంపన్నులపై పన్నులు వేయడం ద్వారా సంక్షేమ రాజ్యాన్ని నడుపవచ్చన్న ప్రభుత్వ భావన మంచిదే. ఆ నిర్ణయానికి నేను మద్దతు తెలిపాను. కానీ భారత ప్రభుత్వం సంపన్నులపై వేసిన పన్నులను మళ్లీ ఉపసంహరించడం నన్ను నిరుత్సాహపరిచింది.

పార్లమెంట్ భవన అభివృద్ధికి సలహాలివ్వండి

ఎంపీలను కోరిన లోక్‌సభ సచివాలయం

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: పార్లమెంట్ భవనాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వం.. ఈ దిశగా ఎంపీల సలహాలను కోరుతున్నది. ప్రస్తుత పార్లమెంట్ భవనంలో మార్పులు చేర్పులు లేదా నూతన భవన నిర్మాణానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరుతూ లోక్‌సభ సచివాలయం నుంచి రాజ్యసభ, లోక్‌సభ ఎంపీలకు లేఖలను పంపించారు. ఈ నెల 11న రాసిన లేఖల్లో సలహాలు సూచనలతోపాటు ప్రస్తుత భవనంలో రోజువారీ కార్యక్రమాల నిర్వహణ కోసం ఎదుర్కొంటున్న సమస్యలను కూడా పేర్కొనాలని సూచించారు. వాటిని అధిగమిస్తూ కొత్త భవనంలో ఎలాంటి సదుపాయాలు అవసరమో కూడా చెప్పాలని కోరారు. సలహాలను వారం రోజుల్లోగా ఈ-మెయిల్ చేయాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ కాగితాలపై రాసి పంపొద్దని స్పష్టం చేశారు. 90 ఏండ్ల చరిత్ర ఉన్న ప్రస్తుత పార్లమెంట్ భవనాన్ని ఆధునీకరించాలని లేదా దాని స్థానంలో కొత్తది నిర్మించాలనే ఆలోచన యూపీఏ-1 (2004-2009) ప్రభుత్వ హయాంలోనే వచ్చింది. అయితే దశాబ్దానికి పైగా కాలం గడిచిపోయినా ఆ ప్రతిపాదన ముందుకు జరుగలేదు. తాజాగా మోదీ ప్రభుత్వం ఈ అంశాన్ని మళ్లీ తెరపైకి తేవడంతోపాటు కార్యాచరణ ప్రారంభించింది. ప్రస్తుత భవనం అభివృద్ధి లేదా కొత్త భవన నిర్మాణాన్ని 2022 చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నది. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వర్గాల ప్రకారం కొత్త పార్లమెంట్ భవన నిర్మాణ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే ఐదు దేశీయ ప్రముఖ నిర్మాణ సంస్థలు బిడ్ దాఖలు చేసినట్టు సమాచారం. వీటిని నిపుణుల కమిటీ పరిశీలిస్తున్నది.

రికార్డుల 'బుకర్'

- ఇద్దరు రచయితలకు పురస్కారం
- 27 ఏండ్లనాటి నిబంధనలను పక్కనబెట్టిన జ్యూరీ
- విజేతలుగా అట్వుడ్, ఎవారిస్టో

అట్వుడ్ ఎవారిస్టో

లండన్, అక్టోబర్ 15: ఏటా ఉత్తమ రచనలకు అందించే ప్రతిష్ఠాత్మక 'బుకర్ ప్రైజ్'.. ఈసారి అనేక రికార్డులు సృష్టించింది. విజేతలను ఎంపిక చేసే జ్యూరీ.. ఒక్కరికంటే ఎక్కువ మందికి పురస్కారం ఇవ్వకూడదనే నిబంధనను పక్కనబెట్టింది. 27 ఏండ్లుగా కొనసాగుతున్న సంప్రదాయానికి స్వస్తి పలుకుతూ ఈ ఏడాది ఇద్దరు మహిళా రచయితలను పురస్కారానికి ఎంపిక చేసింది. కెనడాకు చెందిన మార్గరేట్ అట్వుడ్, బ్రిటిష్ రచయిత బెర్నడీన్ ఎవారిస్టోను బుకర్ ప్రైజ్-2019 విజేతలుగా ప్రకటించింది. అట్వుడ్ (79) ఈ పురస్కారం అందుకున్న పెద్ద వయస్కురాలిగా నిలువనుండగా, ఎవారిస్టో (60) బుకర్ అందుకోనున్న మొట్టమొదటి నల్లజాతి మహిళగా రికార్డు సృష్టించనున్నారు. విజేతలను ఎంపిక చేసేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన బుకర్ జ్యూరీ సోమవారం సమావేశమైంది. జ్యూరీ సభ్యులు అట్వుడ్ రాసిన 'ద టెస్టమేంట్', ఎవారిస్టో రాసిన 'గర్ల్, ఉమెన్, అదర్' పుస్తకాలను అత్యుత్తమమైనవిగా తేల్చారు. దీంతో ఎవరిని విజేతగా ప్రకటించాలన్నది సవాల్‌గా మారింది. అయితే 'పురస్కారాన్ని విభజించరాదు' అంటూ 1992లో చేసిన నిబంధనను గుర్తుచేస్తూ, ఇద్దరికి పురస్కారాన్ని ప్రకటించేది లేదని స్పష్టం చేశారు. దీంతో జ్యూరీ సభ్యులు మళ్లీ 4 గంటలపాటు చర్చలు జరిపారు. అనంతరం 27 ఏండ్లనాటి నిబంధనను పక్కనబెడుతున్నట్టు ప్రకటించారు. 'ఈ రెండు పుస్తకాల్లో ఒక్కదాన్నే ఎంచుకోవడం మాకు అసాధ్యంగా మారింది. అందుకే నిబంధనలను పక్కనబెడుతూ ఇద్దరినీ విజేతలుగా నిర్ణయించాం' అని జ్యూరీ చైర్మన్ పీటర్ ఫ్లారెన్స్ ప్రకటించారు. విజేతలకు సంయుక్తంగా 50వేల బ్రిటిష్ పౌండ్లు (దాదాపు రూ.45 లక్షలు) నగదు అందనున్నది. బుకర్ పురస్కారం దక్కడం పట్ల అట్వుడ్, ఎవారిస్టో సంతోషం వ్యక్తం చేశారు. మరోవైపు ఇండో-బ్రిటిష్ రచయిత సల్మాన్ రష్దీ తుదిజాబితా దగ్గరే నిలిచిపోయారు. ఆయన రచన 'క్విచోట్టె' జ్యూరీ ఎంపిక చేసిన ఆరు అత్యుత్తమ పుస్తకాల్లో ఒకటిగా నిలిచినా.. పురస్కారాన్ని గెలుచుకోలేకపోయింది. బుకర్ ప్రైజ్‌ను ఇప్పటివరకు రెండుసార్లు మాత్రమే ఇద్దరికి చొప్పున అందజేశారు. 1974లో, 1992లో సంయుక్త విజేతలను ప్రకటించారు. ఆ తర్వాత నిబంధనలను మార్చారు.

5 నిమిషాలు.. 3 హత్యలు

- కష్టార్జితం కాజేసినందుకు కాటికి పంపిన కార్మికుడు
- వీడిన బెంగాల్ ట్రిపుల్ మర్డర్ మిస్టరీ
- నిందితుడి అరెస్ట్

హత్యకు గురైన పాల్ కుటుంబం

కోల్‌కతా, అక్టోబర్ 15: పశ్చిమబెంగాల్‌లో కలకలం రేపిన ట్రిపుల్ మర్డర్ మిస్టరీ వీడింది. అధికార తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మధ్య నున్న రాజకీయ వైరానికి దీనికి ఎలాంటి సంబంధంలేదని తేలింది. జీవిత బీమా ప్రీమియం రసీదు విషయంలో తలెత్తిన వివాదం ఈ దారుణానికి దారితీసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. ఇన్సూరెన్స్ ఏజెంట్ కూడా అయిన ఉపాధ్యాయుడు, తన కష్టార్జితాన్ని కాజేయడాన్ని సహించలేక కూలీ పనులు చేసుకునే ఓ కార్మికుడు ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు చెప్పారు. కేవలం ఐదు నిమిషాల్లో ఆ కుటుంబంలోని ముగ్గుర్ని హత్య చేసిన నిందితుడ్ని సోమవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ముర్షీదాబాద్ జిల్లా జియాగంజ్‌కు చెందిన ఉపాధ్యాయుడు బంధు ప్రకాశ్ పాల్ (35), గర్భిణి అయిన ఆయన భార్య బ్యూటీ (28), కుమారుడు అంగన్ (6) గత మంగళవారం వారి ఇంట్లోనే దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ హత్యల మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఎస్పీ ముఖేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బంధు ప్రకాశ్ పాల్ తన గ్రామానికి చెందిన ఉత్పల్ బెహరా(20)తో గత ఏడాది ఒక పాలసీ కట్టించాడు. కూలీ పనులు చేసుకునే బెహరా 2018లో తొలి వార్షిక ప్రీమియం కింద రూ.24,167 ఇవ్వగా పాల్ దానికి రసీదును అందజేశాడు. కొన్ని రోజుల కిందట బెహరా ఈ ఏడాది ప్రీమియం డబ్బులను పాల్‌కు ఇచ్చాడు. అనంతరం రసీదు ఇవ్వాలని అడుగసాగాడు. ఓ వ్యాపారంలో నష్టపోయి ఆర్థిక కష్టాల్లో ఉన్న పాల్, ఆ డబ్బులను సొంతానికి వాడుకున్నాడు. తన డబ్బులు తిరిగి ఇవ్వాలన్న బెహరాను పాల్ బెదిరించాడు. పలుమార్లు అవమానపరిచాడు. దీంతో వీరిద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. తన కష్టార్జితాన్ని కాజేశాడన్న కోపంతో పాల్‌ను అంతం చేయాలని బెహరా నిర్ణయించాడు. ఈ నెల 8న దసరా పండుగనాడు పాల్ ఇంటికి చేరుకున్నాడు. తలుపు తెరిచిన పాల్‌ను వెనుక నుండి కత్తితో పొడిచి చంపాడు. బెడ్‌రూంలోకి వెళ్లి అక్కడున్న ఆయన భార్య బ్యూటీని, వారి కుమారుడు అంగన్‌ను హతమార్చాడు. బెహరా మొబైల్ ఫోన్ కాల్స్ ఆధారంగా అతడే ఈ హత్య చేసినట్లు పోలీసులు అనుమానించారు. సోమవారం రాత్రి ఈ హత్య లు తానే చేసినట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. తమ కుమారునికి ఈ హత్యలతో ఎలాంటి సంబంధం లేదని బెహరా కుటుంబ సభ్యులు అన్నారు. కేవలం రూ.24వేల కోసం ఓ వ్యక్తి ముగ్గుర్ని హత్య చేశాడన్నది నమ్మశక్యంగా లేదని, ఈ కేసును మాఫీ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని బీజేపీ నేత దిలీప్ ఘోష్ ఆరోపించారు.

యూపీలో భారీగా హోంగార్డుల తొలగింపు

మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆర్కే తివారి అధ్యక్షతన ఆగస్టు 28న జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రయాగ్‌రాజ్‌లోని యూపీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వులను అడిషనల్ డైరెక్టర్ జనరల్ బీపీ జోగ్దాండ్ జారీచేశారు. రాష్ట్రంలోని పోలీస్ కానిస్టేబుళ్లతో సమానంగా హోంగార్డులకు కూడా వేతనాలు చెల్లించాలని సుప్రీంకోర్టు గత జూలైలో ఆదేశాలు జారీచేసింది. ఈ తీర్పుతో గతంలో రోజుకు రూ.500గా ఉన్న హోంగార్డుల వేతనాన్ని రూ.672కు పెంచాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో యూపీలో బడ్జెట్ ఇబ్బందులు తలెత్తాయి. 'హోంగార్డుల వేతనాన్ని పోలీస్ కానిస్టేబుళ్లతో సమానంగా పెంచాలన్న సుప్రీంకోర్టు నిర్ణయంతో ప్రతి నెలా రాష్ట్ర ఖజానాపై రూ. 10కోట్ల నుంచి రూ. 12కోట్ల అదనపు భారం పడుతుంది. అయితే, హోంగార్డుల తీసివేత నిర్ణయం తాత్కాలికమైనది. ఒకవేళ వారి సేవలు అవసరమైతే తిరిగి వాళ్లను విధుల్లోకి తీసుకుంటాం' అని రాష్ట్ర డీజీపీ ఓపీ సింగ్ తెలిపారు. అయితే, హోంగార్డులను ఎవ్వరినీ ఉద్యోగాల నుంచి తొలగించట్లేదని రాష్ట్ర హోంగార్డుల శాఖ మంత్రి చేతన్ చౌహాన్ పీటీఐ వార్త సంస్థతో చెప్పారు. 'ఏ ఒక్క హోంగార్డునూ తొలగించం. హోంగార్డులెవర్నీ ఉద్యోగాల నుంచి తొలగించొద్దని పోలీసు శాఖ అధికారులతో చెప్పాను. అయితే, వాళ్ల పని దినాల్ని తగ్గించే అవకాశం ఉన్నది' అని అన్నారు. పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు గత ఏప్రిల్‌లో రాష్ట్ర హోంశాఖ 25వేల మంది హోంగార్డులను ఉద్యోగాల్లో నియమించింది. హోంగార్డులను యూపీ సర్కారు శాశ్వత ఉద్యోగులుగా పరిగణించడం లేదు. సాధారణ ప్రాతిపదికన రోజువారీ వేతనంతో వాళ్లను విధుల్లోకి తీసుకుంటున్నది. యూపీలో అత్యధిక మంది హోంగార్డులు ట్రాఫిక్ నిర్వహణలో పాలుపంచుకుంటున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రంలో ట్రాఫిక్ కష్టాలు తలెత్తే అవకాశం ఉంది.

కేంద్రమంత్రి అశ్వినిపై ఇంకు దాడి

పాట్నా, అక్టోబర్ 15: కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అశ్విని చౌబేకు చేదు అనుభవం ఎదురైంది. మంగళవారం ఆయన డెంగీ రోగులను పరామర్శించడానికి బీహార్‌లోని పాట్నా మెడికల్ కాలేజీ దవాఖానకు వచ్చారు. రోగులను పరామర్శించిన అనంతరం తిరిగి వెళ్తున్న ఆయనపై ఒక యువకుడు ఇంకు చల్లి పారిపోయాడు. దీంతో మంత్రి ఇబ్బందికి లోనయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై జరిగిన ఇంకు దాడిని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా అభివర్ణించారు.

ఢిల్లీలో జడ్జి ఫోన్ కొట్టేసిన దొంగలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: ఇంటి ముందు నిల్చొని ఫోన్‌లో మాట్లాడుతున్న ఓ జడ్జి మొబైల్‌ను ఇద్దరు దుండగులు దొంగిలించారు. ఈ ఘటన ఉత్తర ఢిల్లీలోని కమలానగర్‌లో సోమవారం రాత్రి జరిగింది. సదరు జడ్జి స్థానిక మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ అని పోలీసులు తెలిపారు. దుండగులు మోటర్ సైకిలుపై వేగంగా వచ్చి జడ్జి చేతిలో నుంచి మొబైల్‌ను దొంగిలించారని, నిందితులపై ఐపీసీలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని ఉత్తర ఢిల్లీ డీసీపీ మానిక భరద్వాజ్ తెలిపారు. కాగా, గత శనివారం ప్రధాని మోదీ సోదరుడి కుమార్తె హ్యాండ్ బ్యాగ్‌ను కూడా ఇద్దరు దొంగలు దొంగిలించడం తెలిసిందే.ఆ దొంగలను పోలీసులు పట్టుకొని హ్యాండ్ బ్యాగ్‌ను, అందులోని నగదును, వస్తువులను బాధితురాలికి అందజేశారు.

ఆటోలో యువరాజు, యువరాణి

**పాక్ పర్యటనలో ఉన్న బ్రిటన్ యువరాజు విలియమ్స్, ఆయన భార్య కేథరీన్‌కు ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ మంగళవారం ఇస్లామాబాద్‌లో విందు ఇచ్చారు. ఈ విందుకు హాజరయ్యేందుకు వి

మంగళవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీని మర్యాద పూర్వకంగా కలిసిన గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

ప్రధానితో గవర్నర్ భేటీ

- రాజ్‌భవన్‌లో అమలవుతున్న కార్యక్రమాలపై తమిళిసై నివేదిక
- ప్రశంసించిన ప్రధాని మోదీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రధానమంత్రి నరేంద్రమోదీతో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ మంగళవారం ఢిల్లీలో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్ర గవర్నర్‌గా రాజ్‌భవన్‌లో తాను చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ ప్రధానికి ఒక నివేదికను గవర్నర్ సమర్పించారు. రాజ్‌భవన్‌లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం, యోగా తరగతుల నిర్వహణ, రెడ్‌క్రాస్ సంస్థతో కలిసి రక్తదాన శిబిరాల ఏర్పాటు తదితర అంశాలను ఆ నివేదికలో పేర్కొన్నారు. రాష్ట్రంలో తాను పాల్గొన్న వివిధ కార్యక్రమాలను వివరించారు. దాదాపు 40 నిమిషాలపాటు ఇరువురి భేటీ కొనసాగింది. గవర్నర్ చర్యలను ప్రధాని మోదీ ప్రశంసించారు. అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను గవర్నర్ కలిశారు. ప్రధాని, హోంమంత్రితో భేటీల సందర్భంగా.. బతుకమ్మ పండుగపై రూపొందించిన ఓ పుస్తకాన్ని వారిద్దరికీ గవర్నర్ వేర్వేరుగా అందజేశారు. జ్ఞాపికలను బహూకరించడంతోపాటు పోచంపల్లి శాలువాలతో సత్కరించారు.

సిద్దిపేట జిల్లా కేంద్రం పరిధి పొన్నాలలో టీఆర్ఎస్ జిల్లా కార్యాలయం తెలంగాణ భవన్‌ను సందర్శించిన ఆర్థికమంత్రి టీ హరీశ్‌రావు. (ఇన్‌సెట్‌లో) తెలంగాణ భవన్

ఏపీలో జర్నలిస్ట్ హత్య

అమరావతి: ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా తుని మండలం ఎస్ అన్నవరంలో గుర్తుతెలియని వ్యక్తులు ఒక తెలుగు దినపత్రిక రిపోర్టర్ కాతా సత్యనారాయణ (45)ను మంగళవారం రాత్రి దారుణంగా హత్య చేశారు. తొండంగి అర్బన్ రిపోర్టర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణను దుండగులు కత్తితో పొడిచి పారిపోయారు. హత్యకు పాల్పడిన వారిని పట్టుకొని తక్షణం శిక్షించాలని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మిని ఏపీ డీజీపీ గౌతం సవాంగ్ ఆదేశించారు. అన్ని కోణాల నుంచి కేసును దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

సోషల్ మీడియాలో ప్రచారంపై సుప్రీంకోర్టు జడ్జి అసహనం

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న ప్రచారంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ మిశ్రా మంగళవారం అసహనం వ్యక్తం చేశారు. భూసేకరణ చట్టంపై గత ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సదరు చట్టం చెల్లుబాటు, పరిహారానికి సంబంధించి పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిని విచారించేందుకు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. ఇందులో అరుణ్ మిశ్రా కూడా ఒకరు. అయితే, మిశ్రా కేసు విషయంలో పక్షపాత వైఖరితో ఉన్నారని సోషల్ మీడియాలో గత కొంత కాలంగా ప్రచారం సాగుతున్నది. దీనిపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. 'నేను ఒకరి వల్ల ప్రభావితం కాను. పక్షపాతం చూపను. ఒకవేళ, అదే పరిస్థితి వస్తే కేసు విచారణ నుంచి తప్పుకుంటాను' అని అన్నారు. కేసు విచారిస్తున్న బెంచ్ నుంచి తప్పుకోవాలని సూచిస్తూ.. సోషల్ మీడియాలో 'నిష్పక్షపాతం' అనే పదం ఎక్కువగా వాడటంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'ఈ పదం నన్ను చాలా బాధించింది. ఇలాంటి పదాల్ని వాడటం వల్ల సాధారణ పౌరులకు తప్పుడు సంకేతాలు వెళ్తాయి' అన్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో భూసేకరణ చట్టం తీర్పునిచ్చిన బెంచ్‌లో మిశ్రా కూడా ఉన్నారు. తీర్పునిచ్చిన వ్యక్తి, సదరు తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించే ధర్మాసనంలో ఉండటం తగదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విద్యుత్ ఉద్యోగుల చర్చలు సఫలం

- సమస్యల పరిష్కారానికి యాజమాన్యం హామీ
- ధర్నాకు దిగొద్దని ఆర్టిజన్లకు టీఆర్వీకేఎస్ పిలుపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలపై మంగళవారం యాజమాన్యంతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో విద్యుత్ ఉద్యోగులకు మంచి పీఆర్సీ ఇవ్వడంతోపాటు 23,500 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేశారని ఈ చర్చల్లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మికుల సంఘం (టీఆర్వీకేఎస్) ప్రతినిధులు పేర్కొన్నారు. స్టాండింగ్ రూల్స్ అన్నింటికీ యాజమాన్యం పూర్తి సానుకూలంగా ఉన్నదని, రెగ్యులర్ ఉద్యోగులకు కల్పిస్తున్న అన్ని ప్రయోజనాలను ఆర్టిజన్స్‌కు కూడా కల్పించడంతోపాటు రెండుమూడు రోజుల్లో సర్వీస్‌బుక్‌ను కూడా ఓపెన్ చేస్తామన్నారని తెలిపారు. పెన్షన్‌పై కూడా చర్చించామని, 1999 నుంచి 2014 వరకు విద్యుత్ కార్మికులుగా చేరినవారందరికీ పింఛన్ ఇప్పిస్తామని, ఈ విషయమై త్వరలోనే సీఎం కేసీఆర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని యాజమాన్యం హామీ ఇవ్వడంతోపాటు విధి నిర్వహణలో ప్రమాదం జరిగితే పూర్తి బాధ్యత తీసుకునేందుకు సానుకూలంగా స్పందించిందని చెప్పారు. ఈ హామీలను దృష్టిలో ఉంచుకొని బుధవారం నిర్వహించతలపెట్టిన ధర్నాను ఆపేయాలని టీఆర్వీకేఎస్ ప్రతినిధులు సూచించారు. విద్యుత్ ఉద్యోగులపై సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక అభిమానం ఉన్నదని, అందుకే ప్రతిచోటా విద్యుత్ ఉద్యోగులను గొప్పగా వర్ణిస్తుంటారని తెలిపారు. టీఆర్వీకేఎస్ అధ్యక్షుడు జాన్సన్, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవేందర్‌రెడ్డి, ఎస్పీడీసీఎల్ డిస్కం సెక్రటరీ కరెంటురావు, కోడి గణేశ్, టీ శేషంరాజు, సతీశ్, తోట శ్రీనివాస్, తిరుపతి, ఉషయ్య తదితరులు ఈ చర్చల్లో పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా మంగళవారం ట్రాన్స్‌పోర్ట్ భవన్‌లో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్దుల్‌కలాం ఆశయాలకనుగుణంగా పనిచేయాలని కోరారు. రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి, ఆర్టీసీ ఇంచార్జి ఎండీ సునీల్‌శర్మ, రవాణాశాఖ కమిషనర్ సందీప్‌కుమార్ సుల్తానియా, జేటీసీలు మమతాప్రసాద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. - హైదరాబాద్, నమస్తే తెలంగాణ

ఎల్ఆర్ఎస్‌కు పచ్చజెండా

మొదటిపేజీ తరువాయి...

నిషేధిత జాబితాలోలేని లేఅవుట్లకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. జిల్లా కలెక్టర్ నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాతే అసైన్డ్ భూములను క్రమబద్ధీకరిస్తారు. హెచ్ఎండీఏ పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కమిషనర్, కొత్త కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో డీటీసీపీ (డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) సంచాలకులు ప్లాట్లను క్రమబద్ధీకరిస్తారు. జీవో విడుదలైన తొంభై రోజుల్లోపు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు సమయంలో రూ.10వేల రుసుము చెల్లించాల్సి ఉంటుందని, హెచ్ఎండీఏ, డీటీసీపీ అథారిటీ నిర్ణయించిన తుదిఫీజు చెల్లించిన ఆరు నెలల్లోపు తుది ఎల్ఆర్ఎస్ పత్రం అందుతుందని తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తును తిరస్కరిస్తే.. అప్పీలేట్ అథారిటీకి దరఖాస్తు చేసుకోవచ్చు. చెరువులు, నాలాలు, కుంటల పరిధిలో ఏర్పాటుచేసిన లేఅవుట్లలో ప్లాట్లను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ క్రమబద్ధీకరించరు.

రెండు రకాలుగా క్రమబద్ధీకరణ ఫీజు

క్రమబద్ధీకరణ ఫీజును రెండురకాలుగా లెక్కిస్తారు. ముందుగా ప్లాటువిస్తీర్ణం బట్టి ప్రాథమిక రెగ్యులరైజేషన్ చార్జీలను నిర్ణయిస్తారు. దానిమీద ఆయా ప్లాటు మార్కెట్ విలువ ప్రకారం రెగ్యులరైజేషన్ రుసుమును వసూలు చేస్తారు. ఉదాహరణకు వంద చదరపు మీటర్ల లోపు ప్లాటును క్రమబద్ధీకరించాలంటే.. ముందుగా చదరపు మీటర్‌కి రూ.200 చొప్పున ప్రాథమిక రుసుమును లెక్కిస్తారు. అంటే రూ. 20వేలు అవుతుంది. అక్కడి మార్కెట్ విలువ గజానికి రూ.3000 లోపు ఉందనుకుంటే, దానిపై 20 శాతం రుసుమును లెక్కిస్తారు. అంటే, రూ.20 వేల మీద రూ.4 వేలు కడితే ఆ ప్లాటును క్రమబద్ధీకరిస్తారన్నమాట. 500 చదరపు మీటర్లు దాటిన స్థలంపై తొలుత చదరపు మీటర్‌కి రూ.750 చొప్పున లెక్కిస్తారు. అంటే, రూ.3.75 లక్షలు వస్తుంది. ఆ ప్లాటు మార్కెట్ విలువ గజానికి రూ.50,000 దాటితే.. రెగ్యులరైజేషన్ ఛార్జీగా రూ.7.50 లక్షలు వసూలు చేస్తారు. ప్లాటులో పదిశాతం ఖాళీ స్థలం లేకపోతే, అక్కడి మార్కెట్ విలువపై 14 శాతం ఓపెన్ స్పేస్‌చార్జీని అదనంగా లెక్కిస్తారు. నివాస పరిధిలోకి రాని ప్రాంతంలో లేఅవుట్లను అభివృద్ధి చేసినట్లయితే కన్వర్షన్ చార్జీలు వసూలుచేస్తారు.

ప్లాటు విస్తీర్ణం (చ.మీ.లలో)	ప్రాథమిక రెగ్యులరైజేషన్ చార్జీలు (చ.మీ.కి. రూ.)
100 లోపు	200
101- 300	400
301- 500	600
500 దాటితే	750
మురికివాడలు	5
మార్కెట్ విలువ (రూ.లో)	**రెగ్యులరైజేషన్ రుసుము (శాతాల్లో)**
3,000 లోపు	20
3001- 5000	30
5001- 10,000	40
10,001- 20,000	50
20,001- 30,000	60
30,001- 50,000	80
50,000 దాటితే	100

(30.03. 2018 నాటికి మార్కెట్ విలువను బట్టి.. చదరపు గజం చొప్పున)

పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ సభ్యుడు పీ గోవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు

పీఆర్ ట్రిబ్యునల్ సభ్యుడు గోవర్ధన్‌రెడ్డికి సన్మానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ సభ్యుడిగా న్యాయవాది పీ గోవర్ధన్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించడంపై న్యాయవాదులు హర్షం వ్యక్తంచేశారు. న్యాయవాదులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పోరాడిన న్యాయవాదులకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తగిన గుర్తింపు ఇస్తున్నారని అన్నారు. హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ సభ్యుడు పీ గోవర్ధన్‌రెడ్డిని న్యాయవాదులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కొంతం గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు గండ్ర మోహన్‌రావు, ముఖీద్, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యకిరణ్‌రెడ్డి, న్యాయవాదుల జేఏసీ నేత ఉపేందర్ పాల్గొన్నారు.

లిడ్‌క్యాప్‌పై ఎస్టీ,ఎస్సీ కమిషన్ చైర్మన్ సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర పరిశ్రమలశాఖతోపాటు, లిడ్‌క్యాప్ ఉన్నతాధికారులతో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. పరిశ్రమలు, లిడ్‌క్యాప్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వివరాలు, వారి సమస్యలు, ఆర్వోఆర్ అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీలకు వర్తింపచేసే రిజిర్వేషన్ విధివిధానాలపై చర్చించడంతోపాటు వారి అభ్యున్నతి కోసం 2018-19, 2019-20 ఆర్థిక సంవత్సరాల్లో పథకాలవారీగా ఖర్చుచేసిన నిధులవివరాలను ఇవ్వాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు అందుతున్న సంక్షేమ పథకాలు, లిడ్‌క్యాప్‌కు వచ్చిన ఆర్డర్ల వివరాలు, పనిచేస్తున్న యూనిట్లపై ఎర్రోళ్ల శ్రీనివాస్ సమీక్షించారు. సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబల్‌నాయక్, దేవయ్య, నీలాదేవి, నర్సింహ, విద్యాసాగర్, పరిశ్రమలశాఖ అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమశాఖ అధికారులతో సమావేశమైన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

పరిశ్రమలశాఖతో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర పరిశ్రమలశాఖతోపాటు, లిడ్‌క్యాప్ ఉన్నతాధికారులతో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. కమిషన్ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో ఆయన పరిశ్రమలు, లిడ్‌క్యాప్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వివరాలు, వారి సమస్యలు, ఆర్వోఆర్ అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీలకు వర్తింపచేసే రిజిర్వేషన్ విధివిధానాలపై చర్చించడంతోపాటు వారి అభ్యున్నతి కోసం 2018-19, 2019-20 ఆర్థిక సంవత్సరాల్లో పథకాలవారీగా ఖర్చుచేసిన నిధుల వివరాలను ఇవ్వాలని అధికారులను కోరారు. ఎస్సీ, ఎస్టీలకు అందుతున్న సంక్షేమ పథకాలు, లిడ్‌క్యాప్‌కు వచ్చిన ఆర్డర్ల వివరాలు, పనిచేస్తున్న యూనిట్లపై ఎర్రోళ్ల శ్రీనివాస్ సమీక్షించారు. లిడ్‌క్యాప్‌కు ఇతర కార్పొరేషన్లు, ప్రైవేటు సంస్థలు అప్పగించిన పనులపై చర్చించారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు ఎం రాంబల్ నాయక్, ఎస్ దేవయ్య, నీలాదేవి, సీహెచ్ నర్సింహా, విద్యాసాగర్, పరిశ్రమలశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రతి జెడ్పీకి 38మంది సిబ్బంది

- పంచాయతీరాజ్ శాఖకు నివేదిక సమర్పించిన టీపీఆర్ఎంఈఏ
- గతంలో ఇచ్చిన నివేదికను సవరించిన ఉద్యోగ సంఘాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో పాలనాసౌలభ్యం కోసం కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటైన నేపథ్యంలో దానికి సరిపడా పోస్టులు ఇవ్వాలని తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నివేదిక సమర్పించింది. గతంలో పంచాయతీరాజ్ శాఖకు నివేదిక సమర్పించగా... జిల్లాలు, వాటి పరిధిలోని మండలాల ప్రకారం నివేదించాలని పంచాయతీరాజ్ అధికారులు సూచించారు. దాని ప్రకారం జిల్లాకు పోస్టులు ఇవ్వాలంటూ మంగళవారం మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు సవరించిన నివేదికను అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆకుల నందకుమార్, ఉమ్మడి మెదక్‌జిల్లా అధ్యక్షుడు సూర్యకాంత్, రవీందర్ మీడియాతో మాట్లాడారు. గతంలో కొత్త జిల్లాల ప్రకారం అధికారులు, ఉద్యోగులను కేటాయించాలని ఇచ్చిన రిపోర్టును అధికారుల సూచనతో సవరించామని అన్నారు. దీని ప్రకారం ఒక్కో జిల్లాలకు 38 పోస్టుల చొప్పున సగటున అవసరం ఉంటాయని, చిన్న జిల్లాలకు తగ్గించుకునే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. చైర్‌పర్సన్ పేషీలో ముగ్గురు, సీఈవో పేషీలో నలుగురు, సాధారణ పరిపాలన విభాగంలో ఏడుగురు, అకౌంట్ విభాగంలో ఆరుగురు, ప్లానింగ్ విభాగంలో ఆరుగురు, జెడ్పీజీపీఎఫ్, ఎడ్యుకేషన్ విభాగంలో ఏడుగురు, ఇన్‌వార్డు, ఔట్‌వార్డుల్లో నలుగురు, రికార్డు రూంల్లో ఒక్కరు చొప్పున అవసరం ఉంటారని వివరించారు. సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ నలుగురు, సీనియర్ అసిస్టెంట్లు ఐదుగురు, సీనియర్ స్టెనో ఒక్కరు, జూనియర్ అసిస్టెంట్లు 12మంది, సీవో అసిస్టెంట్లు ముగ్గురు, రికార్డు అసిస్టెంట్లు ఒక్కరు, డ్రైవర్లు ఇద్దరు, ఆఫీస్ సబార్డినేటర్లు 10మంది చొప్పున జిల్లాలకు అవసరం ఉంటారని నివేదికల్లో స్పష్టంగా వివరించామన్నారు. 5 నుంచి 8 మండలాలు ఉన్న జెడ్పీల్లో 20లోపు సిబ్బంది, 13 మండలాల వరకు ఉన్న జెడ్పీలకు 26 నుంచి 28మంది, 14 మండలాలతోపాటు పైన ఉన్న జెడ్పీలకు 38మంది చొప్పున అవసరం ఉంటారని, దీనిపై సమగ్ర నివేదికను పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులకు అందించామన్నారు. గతంలో అసోసియేషన్ ఇచ్చిన రిపోర్టును ప్రామాణికంగా తీసుకున్నారని, అన్ని జెడ్పీలకు ఒకే విధంగా సిబ్బంది, అధికారులను కేటాయించడం సాధ్యం కాదని, మండలాల నిష్పత్తిని అనుసరిస్తూ ప్రతిపాదనలు ఇవ్వాలని చెప్పారని, దాని ప్రకారం ప్రతిపాదించామన్నారు. ప్రస్తుతం జెడ్పీలు కొలువుదీరిన నేపథ్యంలో వెంటనే ఈ ప్రతిపాదనలను అమలు చేయాలని ఆకుల నందకుమార్ కోరారు.

నలమాస కృష్ణ, మద్దిలేటిని హాజరుపర్చండి: హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మావోయిస్టులతో సంబంధాలున్నాయని ఆరోపణల నేపథ్యంలో పోలీసులు అరెస్ట్‌చేసిన నలమాస కృష్ణ, మద్దిలేటిని తమ ముందు హాజరుపర్చాలని హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. గద్వాల పోలీసులు వీరిద్దరినీ అదుపులోకి తీసుకోవడంతో వారి కుటుంబ సభ్యులు, పౌరహక్కుల సంఘాలు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయగా.. విచారణ చేపట్టిన ధర్మాసనం కృష్ణ, మద్దిలేటిని తమ ఎదుట ప్రవేశపెట్టాలని పోలీసులకు ఆదేశాలు జారీచేసింది.

సఫాయి కార్మికుల భద్రతపై దృష్టిపెట్టాలి

- జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ మన్హర్‌వాజీబాయి జాలా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు మున్సిపాలిటీల పరిధిలో పనిచేస్తున్న సఫాయి కార్మికుల భద్రతపై దృష్టిపెట్టాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ మన్హర్‌వాజీబాయి జాలా పేర్కొన్నారు. సఫాయి కార్మికుల భద్రతకు తీసుకుంటున్న చర్యలు, వారి కుటుంబాల స్థితిగతులు, ఇతర అంశాలపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో మంగళవారం హరిత ప్లాజాలో ఆయన సమీక్షించారు. పారిశుద్ధ్య కార్మికులకు సేఫ్టీ పరికరాలు అందజేయాలని, ప్రతినెలా వైద్య పరీక్షలు నిర్వహించాలని, వారి సమస్యలపై అధికారులు సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ప్రధాని ఆవాస్ యోజన పథకం కింద సఫాయి కార్మిక కుటుంబాలు ఇండ్లు నిర్మించుకునేందుకు సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యుడు జగదీశ్‌హిరమణి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ టీ కే శ్రీదేవి, ఎస్సీ అభివృద్ధిశాఖ డైరెక్టర్ పీ కరుణాకర్, ఎస్సీ కార్పొరేషన్ ఎండీ లచ్చిరాంభూక్యా పాల్గొన్నారు.

మావోయిస్టు అరుణ మా అదుపులో లేదు

- ఏపీ డీజీపీ గౌతం సవాంగ్

అమరావతి: మావోయిస్టు అరుణ ఏపీ పోలీసుల అదుపులో లేదని ఆ రాష్ట్ర డీజీపీ గౌతం సవాంగ్ మంగళవారం తెలిపారు. పోలీసుల అదుపులో ఉన్నారని కొందరు అసత్య ప్రచారం చేశారని, మావోయిస్టులు ఎవరూ తమ అదుపులో లేరని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నక్సలైట్ల ప్రభావం తగ్గిందని ఆయన తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వము
చీఫ్ ఇంజినీర్-II కార్యాలయం, మిషన్ భగీరథ శాఖ, హైదరాబాద్
ఇ-ప్రాక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నం.17 to 19/CE-II/MB/2019 తేది: 14-10-2019
పథకం పేరు: HMWSSB (మెట్రో) నెట్వర్క్ నుండి వరంగల్ జిల్లాలోని 11 మండలాలకు మరియు నల్గొండ జిల్లాలోని 1 మండలానికి త్రాగునీటి సరఫరా కల్పించుట ప్రాజెక్ట్ (లాట్, జనగాం వద్ద ఇంజినీరింగ్, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్‌ల వద్ద సిబ్బంది క్వార్టర్లు నిర్మాణం. పీబుపు సంఖ్య: 3వ పీబుపు. సుమారుగా అంచనా వ్యయం: 2.05 కోట్లు. ఇ-ప్రాక్యూర్‌మెంట్ మార్కెట్‌లో టెండర్ డాక్యుమెంట్లు లభ్యత: 21-10-2019 నుండి 28-10-2019 మ.3.00 గం. వరకు. టెందరు స్వీకరణ తేదీలు: 21-10-2019 నుండి 28-10-2019 మ.3.00 గం. వరకు. సాంకేతిక బిడ్ తెరచు తేదీ: 28-10-2019న సా.4.00 గం.కు. ఆర్థిక బిడ్ తెరచు తేదీ: 31-10-2019న ఉ. 11.30 గం.కు (1వ పనికి) 28-10-2019న సా.4.00 గం.కు (2, 3వ పనులకు) సంప్రదించు నం. SE 9100120084. బిడ్డర్లు వారి వివరాలను జిప్ ఫార్మాట్‌లో డాఖలు చేయాల్సిందిగా కోరబడుచున్నారు. తదుపరి వివరాలను https://tender.telangana.gov.in పై ఇ-ప్రాక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నుండి పొందవచ్చును. ఏవైనా వివరాల కోసం సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను బిడ్డర్లు సంప్రదించగలరు.
సం/- చీఫ్ ఇంజినీర్ -II, MB, హైదరాబాద్
DIPR RO No.1386-DP/CL/Advt/1/2019-20, Dt: 15/10/2019

తెలంగాణ ప్రభుత్వం
సమాచార మరియు పౌర సంబంధాల శాఖ: హైదరాబాద్
టెండరు ప్రకటన
No. 000037/AE/DE/2014/17, తేది: 14.10.2019
(03) సంవత్సరాల కాలానికి I&PR శాఖతో ఎంప్యానెల్‌మెంట్ కొరకు తెలంగాణ రాష్ట్రం మరియు జంట నగరాలలో అర్హత ప్రాతిపదికన నైపుణ్యం గల కార్పెంటర్లు, జనరేటర్, UPS, PA ఎక్విప్‌మెంట్, ట్రస్స్ & చైన్ పుల్లీ రవాణా మరియు PA సిస్టమ్ ఏర్పాట్లు ఏర్పాటు చేయుట కొరకు అనుభవంగల, అర్హత గల ఏజెన్సీల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండరు షెడ్యూళ్ళను కమిషనర్ కార్యాలయం, I&PR శాఖ హైదరాబాద్ నుండి 16.10.2019 నుండి పని వేళలలో ''ది అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ I&PR శాఖ, హైదరాబాద్'' పేరున తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో ఏదేని జాతీయ బ్యాంక్ నుండి రూ. 5000/- వాపసురాని రుసుము చెల్లింపుపై పొందవచ్చును. సీల్డు టెండర్లు కమిషనర్ కార్యాలయం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ, సమాచార్ భవన్, FDC కాంప్లెక్స్, AC గార్డ్స్, హైదరాబాద్‌కు 05.11.2019న సా. 5.00 గం॥లోగా చేరాలి మరియు అవి హాజరైన టెందరుదార్లు లేదా వారి అధీకృత ప్రతినిధుల సమక్షంలో 06.11.2019న ఉ. 11.00 గం॥కు టెందరు కమిటీచే తెరువబడతాయి.
సం/- కమిషనర్
DIPR RO. No. 1383-DP/CL/Advt/1/2019-20, Dt: 15/10/2019

తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ లిమిటెడ్,
ఆఫీస్ : మూడవ అంతస్తు, UNI బిల్డింగ్, A.C. గార్డ్స్, హైదరాబాద్
Ph: 040-23395750 & 8008301642
Ref.No. OP.001/Mixed EPs & BPs - WGL, PAL/EPW/ 2019-20 Dt. 14.10.2019
యూకలిప్టస్ టింబర్/ పల్ప్ వుడ్ (బెరడు లేకుండా) TSFDC ప్లాంటేషన్‌ల నుండి విక్రయం కొరకు
ఇ టెండర్ కమ్ ఇ వేలం
తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ యొక్క ప్లాంటేషన్‌లలో గల యూకలిప్టస్ టింబర్/ యూకలిప్టస్ పల్ప్ వుడ్ (బెరడు లేకుండా) సుమారు 1,03,085 MT ల పరిమాణం తేది. 01.11.2019న తెలంగాణ ఈ ఆక్షన్ పోర్టల్ ఆధ్వర్యంలో ఈ టెండర్ కమ్ ఈ వేలం ద్వారా విక్రయించబడుతుంది. కొనదలచిన బిడ్డర్లు తెలంగాణ ఈ ఆక్షన్ పోర్టల్ యందు నమోదు చేసుకోవాలి. వివరాలు http://auction.telangana.gov.in వెబ్ సైట్‌లో చూడవచ్చును. ఏవైనా వేలము కాని లాట్లు ఉన్న యెడల వాటిని తేది. 03.12.2019 మరల 03.01.2020న వేలం వేయబడును.
సం/- (పి.రఘువీర్ I.F.S.,) వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్

టర్కీ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేస్తాం

- సిరియాపై దమనకాండకు ఇదే మా సమాధానం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్, అక్టోబర్ 15: ఉత్తర సిరియాపై దాడులకు పాల్పడిన టర్కీని తీవ్రంగా దెబ్బతీస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. టర్కీ ఆర్థిక వ్యవస్థను అత్యంత వేగంగా ధ్వంసం చేస్తామని చెప్పారు. ఇప్పటికే ఆ దేశ మంత్రులు, సీనియర్ అధికారులపై ఆంక్షలు విధించామని తెలిపారు. స్టీల్ టారిఫ్‌లు పెంచుతామని, టర్కీతో 100 బిలియన్ డాలర్ల వాణ

లోకకల్యాణం కోసం ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించిన సహస్ర చండీయాగంలో భాగంగా మూడో రోజైన మంగళవారం అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం నారాయణపురంలోని యాగశాలలో పీఠాధిపతులు, రుత్విక్కులు పూజలు చేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు. - కల్లూరు

మంత్రి కేటీఆర్ ఔదార్యం

బ్రెయిన్ ట్యూమర్ చిన్నారికి రూ.లక్ష మంజూరు

సూర్యాపేట ప్రతినిధి, నమస్తేతెలంగాణ: బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న చిన్నారికి మెరుగైన వైద్యం కోసం మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ఆర్థిక చేయూతనందించారు. సూర్యాపేటలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ఓ చిన్నారి బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతుండగా.. ఎక్కువ మొత్తంలో డబ్బు అవసరం పడటంతో చిన్నారి కుటుంబ సభ్యులు ట్విట్టర్ ద్వారా మంత్రి కేటీఆర్‌ను సాయం కోరారు. స్పందించిన మంత్రి కేటీఆర్ వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.లక్ష మంజూరు చేయించి ఆ పత్రాలను ట్విట్టర్‌లో ఉంచారు. తమ పాప ప్రాణాలు కాపాడేందుకు సాయంచేసినందుకు మంత్రి కేటీఆర్‌కు బాలిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఏసీబీకి చిక్కిన ఎస్టీవో, సీనియర్ అసిస్టెంట్

అందోల్, నమస్తే తెలంగాణ: రిటైర్డ్ ఉపాధ్యాయుడి వద్ద మంగళవారం లంచం తీసుకుంటూ జోగిపేట ఎస్టీవోతోపాటు సీనియర్ అసిస్టెంట్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఏసీబీ డీఎస్పీ రవికుమార్ వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం చౌటకూర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సంగమేశ్వర్ ఆగస్టు 31న ఉద్యోగ విరమణచేశారు. రిటైర్మెంట్ డబ్బులను తీసుకోవడానికి జోగిపేటలోని ఎస్టీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. అతడి పనిచేసేందుకు ఎస్టీవో దేవేందర్, సీనియర్ అసిస్టెంట్ జయప్రకాశ్‌చారి రూ.10 వేలు లంచం డిమాండ్ చేశారు. మంగళవారం జోగిపేటలోని ఎస్టీవో కార్యాలయంలో ఎస్టీవో దేవేందర్, సీనియర్ అసిస్టెంట్ జయప్రకాశ్‌చారి.. రిటైర్డ్ టీచర్ సంగమేశ్వర్ నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

ఏసీబీకీ చిక్కిన ఎస్టీవో దేవేందర్, సీనియర్ అసిస్టెంట్ జయప్రకాశ్‌చారి

మంగళవారం సిద్దిపేట పత్తి మార్కెట్‌యార్డులో ఆవులకు పూజలు చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

సేంద్రియ సాగుకు ప్రోత్సాహం

- ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు
- 202 మంది రైతులకు పాడి ఆవులు అందజేత

సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ: సేంద్రియ వ్యవసాయానికి రాష్ట్రప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నదని ఆర్థికమంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సేంద్రియ సాగు ప్రోత్సహించేందుకు రైతులకు పాడి ఆవులను అందిస్తున్నామని చెప్పారు. మంగళవారం సిద్దిపేట పత్తి మార్కెట్‌యార్డులో 202 మంది రైతులకు పాడి ఆవులను పంపిణీచేసి వాటికి పూజలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఆవుల పంపిణీ ఆలోచన తనకు రావడానికి కారణం గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఆవులను కర్ణాటక నుంచి తీసుకరావడానికి కృషిచేసిన నంగునూరు మార్కెట్ కమిటీ చైర్మన్ సోంరెడ్డి, జిల్లా పశు వైద్యాధికారి రామ్‌జీ, బాలసుందరం, పోలీసులు, ప్రజాప్రతినిధులను మంత్రి చేనేత వస్త్రాలతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌పర్సన్ వేలేటి రోజాశర్మ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మంత్రి సిద్దిపేటలోని పొన్నాలలో నిర్మించిన టీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు.

పల్లెల అభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యం

పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి రూరల్: పల్లెల అభివృద్ధే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని, అందుకోసమే 30 రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్టు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, నీటిసరఫరాలశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన జనగామ జిల్లా పాలకుర్తిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 30 రోజుల ప్రణాళికతో గ్రామీణుల్లో చైతన్యం వచ్చిందని చెప్పారు. పల్లెల బాగుకోసం కలెక్టర్లకు విశేష అధికారాలు కల్పించామని చెప్పారు. ప్రతి కలెక్టర్‌కు రూ. 2 కోట్ల నిధులు మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. గ్రామ ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నెలకు రూ. 339 కోట్లు విడుదల చేశామని వెల్లడించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే సర్పంచ్, ఉప సర్పంచ్, అధికారులపై వేటు తప్పదని హెచ్చరించారు. పని చేయని సర్పంచ్‌లను సస్పెండ్‌చేసే అధికారం కలెక్టర్లకు అప్పగించామని చెప్పారు.

స్వచ్ఛ పాలమూరుగా తీర్చిదిద్దుతాం

రాష్ట్రంలోనే 30 రోజుల ప్రణాళికను ఇక్కడే ప్రారంభించాం

ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డ్రైనేజీలో చెత్తను తొలగిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి స్వచ్ఛ పాలమూరుగా తీర్చిదిద్దుతానని ఎక్సైజ్‌శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో 30 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని కలెక్టర్ రొనాల్డ్‌రోస్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం 37వ వార్డులో పర్యటించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాన్ని స్వయంగా మంత్రి జేసీబీ సాయంతో కూల్చివేశారు. మురుగు కాల్వలో చెత్తను తొలగించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. 30 రోజుల ప్రణాళికతో పల్లెలు బాగుపడ్డాయని, పట్టణాలపై శ్రద్ధ వహించి సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి బాటలు వేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్ క్రాంతి, మున్సిపల్ కమిషనర్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలలో ట్రాఫిక్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ప్రమాదాల నివారణలో శిక్షణ కేంద్రాలు కీలకం

జగిత్యాలలో ట్రాఫిక్ శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి కొప్పుల

జగిత్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రోడ్డు ప్రమాదాల నివారణతోపాటు, ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంలో ట్రాఫిక్ శిక్షణ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చెప్పారు. హైదరాబాద్ తర్వాత జగిత్యాలలో ఏర్పాటుచేసిన రెండో ట్రాఫిక్ శిక్షణ కేంద్రాన్ని మంత్రి కొప్పుల మంగళవారం ప్రారంభించారు. ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటుచేసిన జిల్లా ఎస్పీ సింధూశర్మ, జిల్లా పోలీసుశాఖను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీ అధ్యక్షురాలు దావ వసంత, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్‌కుమార్, సుంకె రవిశంకర్, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ రాజేశం గౌడ్, కలెక్టర్ శరత్, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి, ఏఎస్పీ మల్లారెడ్డి, డీఎస్పీలు ప్రతాప్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నీటిగుంతలో పడి అక్కాచెల్లెళ్ల మృతి

హన్వాడ: మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం మాదారం గ్రామంలో నీటిగుంతలో పడి ఇద్దరు చిన్నారులు దుర్మరణం చెందారు. పెద్ద కూతురు రజిత(11) 5వ తరగతి చదువుతుండగా, చిన్న కూతురు మోక్షిత(4) గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్నది. రజిత, మోక్షిత మంగళవారం గ్రామసమీపంలో బహిర్భూమికి వెళ్లి.. అనంతరం కాళ్లు, చేతులు కడుక్కొనేందుకు సమీపంలోని నీటి గుంతలోకి దిగారు. లోతు ఎక్కువగా ఉండటం.. ఈత రాకపోవడంతో అక్కాచెల్లెళ్లు మృతి చెందారు. చుట్టుపక్కల వారు వచ్చి మృతదేహాలను నీటిలోంచి బయటకు తీశారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాలను ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

రోడ్డెక్కిన 62% ఆర్టీసీ బస్సులు

సాధారణ స్థితికి చేరుకున్న ప్రయాణాలు

టిమ్స్, టికెట్ల ద్వారా చార్జీల వసూలు

వందశాతం బస్సులు నడిపేందుకు చర్యలు

11వ రోజూ కనిపించని సమ్మె ప్రభావం

నల్లగొండ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

జనగామలో టిమ్ యంత్రాలపై తాత్కాలిక కండక్టర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఖమ్మం నుంచి బస్సులో వెళ్తున్న ప్రయాణికులు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ/నెట్‌వర్క్: రాష్ట్రంలో ప్రయాణ ఇక్కట్లు దాదాపుగా తొలిగిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం 62 శాతం ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యామ్నాయ చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. 11వ రోజైన మంగళవారం కూడా రాష్ట్రంలో ఎక్కడా సమ్మె ప్రభావం కనిపించలేదు. రెండ్రోజుల్లో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చూడాలని సీఎం కేసీఆర్ ఆదేశించడంతో అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. రవాణా, రెవెన్యూ, ఆర్టీసీ, పోలీసు అధికారులు సమన్వయంతో ముందుకెళ్తున్నారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా 4,192 మంది తాత్కాలిక డ్రైవర్లు, 4192 మంది తాత్కాలిక కండక్టర్లు విధులు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. 4,192 ఆర్టీసీ, 1,952 అద్దె బస్సులు కలుపుకొని 6,144 బస్సుల ద్వారా ప్రయాణికులకు సేవలందించినట్టు పేర్కొన్నారు. రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. రీజనల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వందశాతం బస్సులు నడిపేలా సత్వర చర్యలకు ఉపక్రమించాలని ఆదేశించారు. యాదగిరిగుట్ట డిపోలో ఆర్టీసీ బస్సులు వందశాతం నడిచాయి. రాష్ట్రవ్యాప్తంగా అనేక బస్సుల్లో తాత్కాలిక కండక్టర్లు టిమ్ మెషిన్లు, టికెట్ల ద్వారా ప్రయాణికుల నుంచి చార్జీలు వసూలుచేశారు. తద్వారా అధికమొత్తం వసూలుకు తెరపడింది. నల్లగొండలో ప్రతిపక్షాల నాయకులు బస్సులో కూర్చున్న ప్రయాణికులపై ఘర్షణకు దిగడంతో పోలీసులు వారిని అరెస్టుచేశారు.

సాఫీగా నడుస్తున్న బస్సులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆర్టీసీ బస్సులు సాఫీగా నడిచాయి. వరంగల్ రీజియన్ పరిధిలో తొమ్మిది డిపోల నుంచి మంగళవారం 695 బస్సు సర్వీసులను నడిపించారు.

✦ ఖమ్మం జిల్లాలోని మూడు డిపోల నుంచి 383 బస్సులు తిరిగాయి. ఇవేకాకుండా ప్రైవేట్ బస్సులు 40, మ్యాక్సీక్యాబ్‌లు 60 నడుపడంతో సమ్మె ప్రభావం కనిపించలేదు. రెండ్రోజుల బంద్ అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మూడు డిపోల నుంచి 111 బస్సులు రోడ్డెక్కాయి.

✦ మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 125 బస్సులు ఎనిమిది వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశాయి. మహబూబ్‌నగర్ డిపోలో 70 మందికిపైగా డ్రైవర్లను, 85 మంది కండక్టర్లను తాత్కాలిక పద్ధతిపై తీసుకున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లావ్యాప్తంగా 87బస్సులు తిరిగాయి. అలంపూర్ స్టేజి నుంచి జోగుళాంబ ఆలయం వరకు ఏడు స్కూల్ బస్సులు ప్రయాణికులను, భక్తులను చేరవేశాయి.

నల్లగొండలో ప్రయాణికులతో విపక్ష నాయకుల గొడవ..

నల్లగొండ జిల్లాలో ఆర్టీసీ, పోలీసు అధికారులు ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని నాలుగు డిపోల నుంచి 294 బస్సులను నడిపించారు. సమ్మె పదిరోజులుగా ప్రశాంతంగా జరగ్గా.. మంగళవారం నల్లగొండ బస్టాండ్‌కు వచ్చిన విపక్షాల నాయకులు తాత్కాలిక డ్రైవర్లను, కండక్టర్లను బెదిరింపులకు గురిచేయడంతోపాటు బస్సులకు అడ్డుకున్నారు. సీట్లలో కూర్చున్న ప్రయాణికులతోనూ గొడవకు దిగారు. సూర్యాపేట జిల్లా కోదాడ నుంచి 75 బస్సులు తిరిగాయి. సూర్యాపేట డిపో పరిధిలో 123 బస్సులను నడిపించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 56 ఆర్టీసీ, 15 అద్దె బస్సులను తిప్పారు.

కరీంనగర్ రీజియన్‌లో 88.06 శాతం

కరీంనగర్ రీజియన్‌లోని నాలుగు జిల్లాల్లో 88.06 శాతం బస్సులు నడిచాయి. 670 బస్సులు నడపాల్సి ఉండగా ఆర్టీసీ 388, అద్దె 202 కలుపుకొని మొత్తం 590 బస్సులు నడిపారు. ప్రైవేటు బస్సులు 51 నడిచాయి. 47 బస్సుల్లో టిమ్స్ ద్వారా, 9 బస్సుల్లో టికెట్ల ద్వారా చార్జీలు వసూలుచేశారు. మంచిర్యాల జిల్లాలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అధికారులు బస్సులు నడిపించారు. మంచిర్యాల డిపో పరిధిలో 120 పైచిలుకు బస్సులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశాయి. ఇవేకాకుండా 60 క్యాబ్‌లు, 40నుంచి 60 వరకు ఆటోలు, టాటా ఏస్ ట్రాలీలు నడుస్తున్నాయి. నిర్మల్ జిల్లాలోని మూడు డిపోల నుంచి 304 బస్సులు నడిపించారు. మెదక్ రీజియన్‌లోని ఎనిమిది డిపోల పరిధిలో 359 ఆర్టీసీ, 169 ప్రైవేట్ బస్సులు నడిచాయి. వికారాబాద్ జిల్లాలో 206 బస్సులు రోడ్డెక్కాయి.

మంగళవారం ఖమ్మం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

కాంగ్రెస్ హయాంలోనే ఆర్టీసీ స్థలం లీజు

- అంతా నిబంధనల ప్రకారమే..
- కరీంనగర్ ఆర్ఎం వెల్లడి

కరీంనగర్ ప్రధానప్రతినిధి, నమస్తేతెలంగాణ: అధికార పార్టీపై నిత్యం అబద్ధాల కథనాలు రాస్తున్న ఓ దినపత్రిక.. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌ను టార్గెట్ చేసింది. వాస్తవాలను వెల్లడించకుండా.. ఆర్టీసీ స్థలానికి మాజీ ఎంపీ ఎసరు పెట్టారంటూ ఓ కథనాన్ని ప్రచురించడంపై పలువురు భగ్గుమంటున్నారు. లీజు వ్యవహారం సక్రమమేనంటూ స్వయాన ఆర్టీసీ ఆర్ఎం స్పష్టం చేశారు. వివరాలు ఇలా.. కరీంనగర్‌లో కొత్త బస్‌స్టేషన్ ప్రారంభమైన తరువాత పాత బస్టాండ్ పరిధిలో రోల్ మోడల్‌గా షాపింగ్ కాంప్లెక్సు కట్టాలని 1980లో ఆర్టీసీ సంస్థ నిర్ణయించింది. ఆ మేరకు 54 దుకాణాలతో కాంప్లెక్సు నిర్మించారు. దుకాణాలకు టెండర్లు పిలిచారు. మొదట్లో దుకాణదారులు ముందుకు వచ్చినా ఆ తదుపరి పెట్టిన దుకాణాలు నడువకపోవడంతో ఒక్కొక్కరు ఖాళీ చేస్తూ వచ్చారు. ఖాళీ అయిన దుకాణాలకు పలుమార్లు టెండర్ నోటిఫికేషన్లు వేసినా ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆర్టీసీ ప్రత్యామ్నాయ ఆలోచన చేసింది. 2006లో పాత బస్టాండ్ స్థలాన్ని లీజుకివ్వడానికి టెండర్ నోటిఫికేషన్ జారీచేసింది. అప్పటి సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ 2006లో హన్మకొండ ఎంపీగా ఉన్నారు. ఆర్టీసీ టెండర్ నోటిఫికేషన్ ఆధారంగా ప్రతిమ గ్రూపు సంస్థ సదరు స్థలాన్ని చట్టబద్ధంగా లీజు తీసుకున్నది. ఆ మేరకు సంస్థతో ఒప్పందం చేసుకొని 2006 నుంచి కన్‌స్ట్రక్షన్ మొదలు పెట్టి 2009లో కాంప్లెక్స్‌ను ప్రారంభించింది. కాంగ్రెస్ హయాంలోనే నిబంధనల ప్రకారమే జరిగిన లీజు వ్యవహారంలో వాస్తవాలను దాచిపెట్టి.. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఆ పత్రిక ప్రయత్నించింది. ఆర్టీసీ స్థలాన్ని ఇప్పుడే లీజుకు తీసుకున్నారని, ఆ స్థలాన్ని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అందులో మాజీ ఎంపీ వినోద్‌కుమార్ హస్తం ఉన్నట్టు భావన వచ్చేలా ఆ పత్రికలో కథనం రావడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉన్నదన్న విమర్శలు వస్తున్నాయి.

నిబంధనల మేరకే : ఆర్టీసీ ఆర్ఎం

ప్రతిమ గ్రూప్ ఆఫ్ కంపెనీకి ఆ స్థలాన్ని ఆర్టీసీ పూర్తి చట్టబద్ధంగానే ఇచ్చిందని కరీంనగర్ ఆర్ఎం జీవన్‌ప్రసాద్ మంగళవారం 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. అప్పట్లో లీజు కోసం నిర్వహించిన టెండర్‌లో నిబంధనల ప్రకారం సదరు సంస్థ పాల్గొన్నదనీ, అన్నింటినీ పరిశీలించిన తరువాతే లీజుకు ఇచ్చినట్టు చెప్పారు. 2006లో టెండర్ ద్వారా 30 ఏండ్ల కాలానికి లీజుకు ఇచ్చామనీ, సదరు సంస్థ క్రమం తప్పకుండా ఆర్టీసీకి డబ్బుచెల్లిస్తున్నదని ఆర్ఎం చెప్పారు.

మానుకోట, వరంగల్‌లో ఓ మోస్తరు వాన

మహబూబాబాద్ జిల్లాలో పిడుగుపాటుకు తండ్రీకొడుకు మృతి

వరంగల్, నమస్తేతెలంగాణ/మరిపెడ నమస్తేతెలంగాణ/మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లాతోపాటు వరంగల్ అర్బన్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మహబూబాబాద్‌తోపాటు మరిపెడ, కేసముద్రం, నెల్లికుదురు మండలాల్లో వాన పడింది. మరిపెడ మండలం తానంచర్ల శివారు వాల్యతండాలో పిడుగుపాటుకు తండ్రీకొడుకు మృతి చెందారు. తేజావత్ కిషన్ (48), ఆయన భార్య తార మంగళవారం పత్తి చేను వద్దకు వెళ్లగా.. మధ్యాహ్నం వారి కుమారుడు తేజావత్ సంతోశ్(14) భోజనం తీసుకెళ్లాడు. తల్లిదండ్రులతో కలిసి సంతోశ్ పత్తి ఏరుతుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. పత్తి తడువకుండా తార చెట్టు కిందికి తీసుకెళ్లింది. తండ్రి కొడుకు వర్షంలోనే టార్పాలిన్లు కప్పుకొని పత్తి తీస్తున్న క్రమంలో వారిపై పిడుగు పడగా అక్కడికక్కడే మరణించారు. వరంగల్ నగరంలో మంగళవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది.

నల్లగొండ జిల్లా డిండిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో రెండ్రోజులుగా జరుగుతున్న గురుకుల పాఠశాలల ఆరవ జోనల్ స్థాయి క్రీడాపోటీలు మంగళవారం ముగిశాయి. గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరై అథ్లెటిక్‌లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. - డిండి

పత్తి కూలీల వాహనం బోల్తా

28 మందికి గాయాలు.. 10 మంది పరిస్థితి విషమం

దేవరకొండ, నమస్తే తెలంగాణ: పత్తి కూలీలతో వెళ్తున్న టాటాఏస్ వాహనం టైరు పేలడంతో అదుపుతప్పి మూడు పల్టీలు కొట్టగా 28 మందికి గాయాలయ్యాయి. వీరిలో పది మంది పరిస్థితి విషమంగా ఉన్నది. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా నేరెడుగొమ్ము మండలం చిన్నమునిగల్ స్టేజీ సమీపంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. చందంపేట మండలం గువ్వలగుట్ట గ్రామానికి చెందిన 53 మంది గిరిజనులు నేరెడుగొమ్ము మండలం కొత్తపల్లిలో పత్తి ఏరేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను దేవరకొండ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. తీవ్రంగా గాయపడినవారిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ దవాఖానకు తీసుకెళ్లారు. క్షతగాత్రుల్లో ఐదుగురు పాఠశాల విద్యార్థులు కూడా ఉండటం కలిచివేసింది.

కృష్ణమ్మకు స్వల్ప ఇన్‌ఫ్లోలు

ఆల్మట్టి, నారాయణపుర, జూరాలకు 30 వేల క్యూసెక్కులపైగా వరద

నాగార్జునసాగర్ రెండు క్రస్టు గేట్ల ద్వారా నీటి విడుదల

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి/నాగర్‌కర్నూల్ ప్రతినిధి/అయిజ/నందికొండ/మెండోరా/మహదేవపూర్, నమస్తే తెలంగాణ: కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు స్వల్ప ఇన్‌ఫ్లోలు కొనసాగుతున్నాయి. మంగళవారం సాయంత్రం జూరాలకు ఇన్‌ఫ్లో 37,000 క్యూసెక్కులు ఉండగా.. 49,516 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. ఎగువనున్న ఆల్మట్టి, నారాయణపుర ప్రాజెక్ట్‌లకు వరద ప్రవాహం కొనసాగుతున్నది. ఆల్మట్టికి ఇన్‌ఫ్లో 30,991క్యూసెక్కులు కొనసాగుతుండగా.. అదేస్థాయిలో నీటిని నదిలోకి వదులుతున్నారు. నారాణయణపురకు ఇన్‌ఫ్లో 35,000 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 29,200 క్యూసెక్కులు నమోదైంది. కర్ణాటక ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 24,220 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 23,740 క్యూసెక్కులు నమోదైంది. శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గింది. మంగళవారం జూరాల నుంచి 45,968 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 19,423 క్యూసెక్కులు కలిపి 65,381క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు మంగళవారం 71,787 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో రెండు క్రస్టు గేట్లను ఎత్తి 16,178 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదలచేస్తున్నారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 590 అడుగులు కాగా ప్రస్తుతం 589.90 అడుగులుగా ఉన్నది. పులిచింతల వద్ద 36,043 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. అదేస్థాయిలో అవుట్‌ఫ్లో నిర్వహిస్తున్నారు.

నిలకడగా ఎస్సారెస్పీ నీటిమట్టం

నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ పాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గిపోవడంతో నీటిమట్టం నిలకడగా ఉందని ప్రాజెక్టు ఏఈఈ మహేందర్ తెలిపారు. మంగళవారం ఎగువప్రాంతాల నుంచి 4,100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నదని చెప్పారు. ఈ సీజన్‌లో 81.422 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చిందన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన లక్ష్మీ (మేడిగడ్డ)బరాజ్‌లో మంగళవారం కూడా 11 గేట్లను ఎత్తివేసి నీటిని దిగువకు తరలిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

మంగళవారం నాగార్జునసాగర్ రెండు క్రస్టు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

పురుగుల మందు కలిపిన కూల్‌డ్రింక్ తాగిన చిన్నారులు

బాలుడు మృతి.. కోలుకుంటున్న బాలిక

శివరాం(ఫైల్)

బెల్లంపల్లిరూరల్: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం పెర్కపల్లి లంబాడితండాలో పురుగుల మందు కలిపిన శీతలపానియాన్ని అక్కాతమ్ముడైన ఇద్దరు చిన్నారులు తాగారు. నాలుగేండ్ల బాలుడు మృతిచెందగా, ఏడేండ్ల అక్క దవాఖానలో చికిత్స పొందుతున్నది. లంబాడితండాకు చెందిన బానోతు తిరుపతి, రజిత దంపతులకు కుమారుడు శివరాం, కూతురు ఐశ్వర్య ఉన్నారు. సోమవారం పిల్లలను తీసుకొని తమ పొలం పనులకు వెళ్లారు. ఆలుమగలు పొలం పనుల్లో నిమగ్నంకాగా.. గట్టుమీదున్న చిన్నారులకు కూల్‌డ్రింక్ బాటిల్ కనిపించింది. దాంట్లో ఉన్న ద్రవాన్ని తాగిన చిన్నారులు అపస్మారకస్థితికి చేరుకున్నారు. తల్లిదండ్రులు చిన్నారులిద్దరిని దవాఖానకు తరలిస్తుండగా బాలుడు శివరాం మార్గమధ్యంలో మృతిచెందాడు. ఐశ్వర్య కరీంనగర్ దవాఖానలో కోలుకుంటున్నది.

epaper.ntnews.com

శాఫ్ అండర్-15 విజేత భారత్

ఫైనల్లో బంగ్లాదేశ్‌పై ఉత్కంఠ విజయం

థింపు: శాఫ్ అండర్-15 మహిళల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భారత్ విజేతగా నిలిచింది. మంగళవారం ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో భారత్ 5-3 తేడాతో బంగ్లాదేశ్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. మ్యాచ్ నిర్ణీత సమయంలో ఎలాంటి గోల్ నమోదు కాకపోవడంతో విజేతను నిర్ణయించేందుకు పెనాల్టీ షూటౌట్ అనివార్యమైంది. ఇందులో బంగ్లాపై భారత్ పైచేయి సాధించింది. మ్యాచ్ విషయానికొస్తే ప్రియాంక సుజేశ్.. బంగ్లాపై మెరుపు దాడులకు పూనుకుంది. మిడ్‌ఫీల్డ్, ఫార్వర్డ్ దళాన్ని సమనయ్యం చేసుకుంటూ గోల్ లక్ష్యంగా ముందుకు సాగింది. మరోవైపు అమీశా, లిండా కోమ్ పలుమార్లు చేసిన ప్రయత్నాలు గోల్ కాకుండానే విఫలమయ్యాయి. భారత్ గోల్ ప్రయత్నాలను బంగ్లా కీపర్ దీటుగా తిప్పికొట్టింది. కీలకమైన ద్వితీయార్ధంలో బంగ్లా పుంజుకుని పోటీలోకి వచ్చింది. నిర్ణీత సమయంలో గోల్ కాని పరిస్థితుల్లో జరిగిన పెనాల్టీ షూటౌట్‌లో కెప్టెన్ శిల్కీ దేవి భారత్ విజయాన్ని ఖరారు చేసింది.

అసలేం జరిగిందంటే..

గంగూలీ అధ్యక్ష ఎన్నికపై ఆసక్తికర పరిణామాలు.. రాత్రికి రాత్రే మారిన సీన్

సమయం: ఆదివారం రాత్రి 10.30
స్థలం: ముంబైలోని స్టార్ హోటల్

ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ మీడియాతో మాట్లాడాడు. బీసీసీఐ నయా అధ్యక్షుడిగా ఎవరు ఎన్నిక కానున్నారు అని విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులుగా.. 'మాజీ క్రికెటర్ బ్రిజేశ్ పటేల్‌కే ఆ చాన్స్ ఉంది' అని చెప్పాడు.

సమయం: ఆదివారం రాత్రి 12.45

సుదీర్ఘ చర్చల అనంతరం హోటల్ లాబీలోకి వచ్చిన గంగూలీ.. బీసీసీఐ ప్రెసిడెంట్ పోస్ట్‌కు నామినేషన్ వేసేందుకు అవసరమైన ఐడీ ప్రూఫ్‌ల ప్రింట్ అవుట్‌లు సిద్ధం చేసుకున్నాడు. ఈ సందర్భంగా మరోసారి విలేకరులు ప్రశ్నించగా...'రెండు గంటల క్రితం వరకు నాకే తెలియదు. అందుకే మీరిందాక అడిగినప్పుడు బ్రిజేశ్ అవుతాడని చెప్పా. కానీ ఆ తర్వాత నిర్ణయం మారింది' అని వివరించాడు.

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

మరి ఆ రెండు గంటల్లో సమీకరణాలు ఎలా మారాయి. బీసీసీఐలో తన పట్టు కొనసాగించాలని బలంగా ప్రయత్నించిన మాజీ అధ్యక్షుడు, ధోనీ సన్నిహితుడు ఎన్ శ్రీనివాసన్ ఎందుకు వెనక్కి తగ్గాడు. అప్పటి వరకు పోటీలో ఉన్న మాజీ క్రికెటర్ బ్రిజేశ్ పటేల్ బరిలో నుంచి తప్పుకొని దాదాకు ఎలా దారిచ్చాడు. అంటే సమాధానం మాత్రం ఒక్కటే. కేంద్రంలోని 'పెద్ద తలలు' ఆదేశించడంతోనే ఇదంతా క్షణాల్లో చక్కబడినట్లు సమాచారం. ఇక మిగిలిందల్లా అక్టోబర్ 23న అధికారికంగా దాదా బాధ్యతలు చేపట్టడమే. పైకి మాత్రం 'నేను ఏ రాజకీయ నాయకుడితో టచ్‌లో లేను. నన్నెవరూ సంప్రదించలేదు. సమీకరణాలు ఎలా ఉంటాయో తెలియదు. నాకేవరూ ఏమీ చెప్పలేదు' అని గంగూలీ చెప్తున్నా.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. బెంగాల్ ఎన్నికల్లో దాదాను ప్రచారాస్త్రంగా వినియోగించుకునేందుకే ఈ అనూహ్య ఎన్నిక జరిగిందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

దాదా దారి చూపేనా

మంతనాలతోనే దాదా తెరపైకి..

రెండు రోజుల క్రితం వరకు అసలు సోదిలోనే లేని సౌరవ్ గంగూలీ బీసీసీఐ అధ్యక్షుడిగా నామినేషన్ వేయడం వెనుక పెద్ద కసరత్తే సాగింది. ఆదివారం రాత్రి ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన గంగూలీ పేరు గంటల వ్యవధిలో అనూహ్యంగా తెరపైకి వచ్చింది. క్రీడలపై రాజకీయాల ప్రభావం ఉండకూడదని జస్టిస్ లోధా కమిటీ ఉత్తర్వులుండటంతో భవిష్యత్తు అవసరాల దృష్ట్యా గంగూలీని సీన్‌లోకి తెచ్చినట్లు స్పష్టమవుతున్నది. గంగూలీ ఉన్న హోటల్లోని ఓ గదిలో రాత్రి పదిన్నర ప్రాంతంలో బీసీసీఐ మాజీ అధ్యక్షులు శ్రీనివాసన్, అనురాగ్ ఠాకూర్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుమారుడు జై షా, భారత బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు హిమంత బిశ్వ శర్మ సమావేశమయ్యారు. సుదీర్ఘంగా సాగిన ఈ మంతనాల్లో దాదా కూడా పాలు పంచుకున్నాడు. ఈ సమయంలో ఢిల్లీ పెద్దలు జోక్యం చేసుకొని ఫోన్‌లో తగిన ఆదేశాలివ్వడంతో అంతా చకచకా జరిగిపోయింది. చర్చల అనంతరం.. అధ్యక్ష పదవికి గంగూలీ నామినేషన్ వేస్తారని మీడియాకు చెప్పాల్సిందిగా శ్రీనివాసన్ పేర్కొన్నాడు. దీంతో తెరపైకి వచ్చిన గంగూలీ.. 'నేను రేసులో ఉన్నాను' అని అధికారికంగా ప్రకటించాడు.

సమయం: సోమవారం తెల్లవారుజామున 4.00

సమాలోచనల అనంతరం అనురాగ్ ఠాకూర్.. అనుకున్న పని అయిందనే ఆనందంలో ప్రసన్న వదనంతో విమానాశ్రయానికి తిరుగు పయనమయ్యాడు.

ప్రపంచంలోనే ధనిక బోర్డుగా పేరున్న బీసీసీఐకి అధ్యక్షుడిగా పనిచేయడం అంత ఆషామాషీ విషయమేం కాదు. అయితే ఎప్పటి నుంచో క్రికెట్‌పై పట్టు కొనసాగిస్తున్న రాజకీయ నాయకులు.. ఆటపై తమ ఆధిపత్యాన్ని వదులుకోవడం ఇష్టం లేకే గంగూలీని తెరపైకి తెచ్చారనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా సంధి కాలంలో భారత క్రికెట్ ప్రతిష్ఠను కాపాడిన 'గ్రేట్ కెప్టెన్'.. పరిపాలనలోనూ తనదైన మార్క్ వేస్తే అంతకుమించిన సంతోషం ఏముంటుంది.

బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (క్యాబ్) అధ్యక్షుడిగా గత ఐదేండ్లుగా తన పని తాను చేసుకుంటూ వెళ్లిన బెంగాల్ టైగర్ ముక్కుసూటితనం.. మున్ముందు ఎలాంటి పర్యవసనాలకు దారితీస్తుందో వేచి చూడాల్సిందే. అయితే బీసీసీఐ బాస్‌గా దాదా తనదైన మార్క్ చూపించే అవకాశాలు మాత్రం తక్కువే అని చెప్పొచ్చు. ఎందుకంటే మరో 10 నెలల అనంతరం గంగూలీ ఆ బాధ్యత నుంచి తప్పుకోవాల్సి ఉంటుంది. జస్టిస్ లోధా కమిటీ తెచ్చిన తప్పనిసరి విరామం నిబంధన (కూలింగ్ ఆఫ్ పీరియడ్) ప్రకారం బీసీసీఐ, రాష్ట్ర క్రికెట్ సంఘాల్లో ఆరేండ్ల పాటు పదవిలో ఉన్నవారెవరైనా.. మూడేండ్ల విరామం తీసుకోని క్రికెట్ పాలన వ్యవహారాలకు దూరంగా ఉండాలి. గత ఐదేండ్లుగా క్యాబ్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న దాదా మరో పది నెలల అనంతరం గరిష్ఠ పరిమితిని దాటేస్తాడు. మైదానంలో ఓటమిని అంగీకరించని మనస్తత్వం కలిగిన దాదా ఈ కాస్త వ్యవధిలో బలమైన ముద్ర వేస్తాడా.. అనేది కాలమే నిర్ణయించాలి.

దూసుకుపో..

మరికొన్ని రోజుల్లో బీసీసీఐ అధ్యక్ష పీఠం అధిరోహించనున్న గంగూలీకి.. అన్ని వైపుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో దాదా మాజీ సహచరులు వీవీఎస్ లక్ష్మణ్, వీరేంద్ర సెహ్వాగ్ కూడా తమ 'ఆల్‌టైం కెప్టెన్'కు కంగ్రాట్స్ చెప్పారు. 'అభినందనలు దాదా. మీ నేతృత్వంలో భారత క్రికెట్ మరింత వృద్ధి చెందుతుందనడంలో రవ్వంత సందేహం లేదు. కొత్త బాధ్యతల్లో మీకు జయం చేకూరాలి' అని లక్ష్మణ్ ట్వీట్ చేస్తే.. 'భారత్ క్రికెట్‌కు ఇది శుభసూచికం. ఇప్పటికే టీమ్‌ఇండియాకు ఎనలేని సేవ లు చేసిన దాదా కొత్త బాధ్యతల్లో మరింత ముందుకు సాగాలి' అని సెహ్వాగ్ ఆకాంక్షించాడు. లక్ష్మణ్ ట్వీట్‌కు గంగూలీ బదులిస్తూ.. 'ధన్యవాదాలు వీవీఎస్. మీ సహాయ సహకారాలు చాలా ముఖ్యం' అని పేర్కొన్నాడు.

భారత్, బంగ్లా 1-1

మూడో మ్యాచ్‌ను 'డ్రా' చేసుకున్న ఛెత్రి సేన

ఫిఫా ప్రపంచకప్ క్వాలిఫయర్స్

ఆదిల్ ఖాన్

కోల్‌కతా: ఫుట్‌బాల్ ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో బోణీ కొట్టాలని భావించిన భారత జట్టుకు భంగపాటు ఎదురైంది. టోర్నీలో భాగంగా మంగళవారం ఇక్కడి సాల్ట్‌లేక్ స్టేడియంలో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌ను భారత్ 1-1తో 'డ్రా'గా ముగించింది. ముందంజ వేయాలంటే తప్పక నెగ్గాల్సిన పోరులో సునీల్ ఛెత్రి సేన నిరాశ పరిచింది. తొలి అర్ధభాగంలో పూర్తి ఆధిపత్యం కనబర్చిన ప్రపంచ 104వ ర్యాంకర్ భారత్.. చివర్లో అనూహ్యంగా ప్రత్యర్థికి గోల్ సమర్పించుకొని ఒత్తిడిలో కూరుకుపోయింది. బంగ్లా తరపున సాదుద్దీన్ (42వ ని.లో) గోల్ నమోదు చేశాడు. తమకంటే మెరుగైన ప్రత్యర్థిపై ఆధిక్యం సాధించామనే ఆనందంలో రెండో సగంలో బంగ్లాదేశ్ (187వ ర్యాంక్) ఆటగాళ్లు రెచ్చిపోవడంతో.. భారత్ రక్షణాత్మక ధోరణికే పరిమితమైంది. మ్యాచ్ ముగియడానికి కొన్ని క్షణాల ముందు భారత ఆటగాడు ఆదిల్ ఖాన్ (88వ ని.లో) గోల్ చేయడంతో చివరకు చచ్చిచెడి మ్యాచ్‌ను 'డ్రా'చేసుకోగలిగింది. 65 వేల మంది అభిమానులతో కిక్కిరిసిన స్టేడియంలో భారత్ ఉసూరుమనిపిస్తే.. అండర్ డాగ్స్‌గా బరిలోదిగిన బంగ్లా మాత్రం అదరగొట్టింది. క్వాలిఫయర్స్ గ్రూప్-ఈ రెండో రౌండ్‌లో మూడు మ్యాచ్‌లాడిన భారత్ రెండు 'డ్రా'లు, ఓ ఓటమితో 2 పాయింట్లు ఖాతాలో వేసుకొని ప్రస్తుతం గ్రూప్‌లో 4వ స్థానంలో నిలిచింది. నవంబర్ 14న జరుగనున్న తదుపరి మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో భారత్ తలపడనుంది.

సంధూ తొందరపాటువల్లే..

ఆసియా చాంపియన్ ఖతార్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి అద్వితీయ ఆటతీరు కనబర్చిన గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధూ.. ఈ మ్యాచ్‌లో తన తొందరపాటు వల్ల విలన్‌గా మారాడు. ప్రత్యర్థి జట్టు కెప్టెన్ జమాల్ భుయాన్ 42వ నిమిషంలో మిడ్‌ఫీల్డ్ నుంచి షాట్ ఆడాడు. దాన్ని అడ్డుకునేందుకు పోస్ట్ వదిలి ముందుకొచ్చిన సంధూ.. బంతిని తప్పుగా అంచనావేశాడు. అమాంతం గాల్లోకి ఎగిరినా బంతి అతడి చేతికి చిక్కలేదు. దీంతో గోల్ పోస్ట్ పక్కనే కాచుకొని ఉన్న సాదుద్దీన్ బంతిని సునాయాసంగా పోస్ట్‌లోకి పంపించి బంగ్లాను ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. ఫలితంగా ఫస్ట్‌హాఫ్ ముగిసేసరికి భారత్ 0-1తో వెనుకంజలో నిలిచింది. బ్రేక్ తర్వాత కూడా ఆధిక్యాన్ని కాపాడుకున్న బంగ్లా.. పదే పదే దాడులు చేస్తూ భారత డిఫెన్స్‌ను ఇరకాటంలో పడేసింది. ఎంత ప్రయత్నించినా భారత ఆటగాళ్లు గోల్ చేయలేకపోవడంతో ఒకదశలో ఓటమి ఖాయమే అనిపించింది. అయితే మ్యాచ్ ముగియడానికి రెండు నిమిషాల ముందు బ్రెండన్ ఫెర్నాండెస్ ఇచ్చిన కార్నర్ కిక్‌ను ఆదిల్ హెడర్ ద్వారా గోల్‌పోస్ట్‌లోకి పంపి స్కోరు సమం చేశాడు. అనంతరం ఇరుజట్లు ఎంత ప్రయత్నించినా మరో గోల్ నమోదు చేయలేకపోవడంతో మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది.

యువ భారత్‌కు తొలి ఓటమి

జొహర్ బహ్రూ (మలేషియా): సుల్తాన్ జొహర్ కప్‌లో రెండు విజయాలతో జోరు మీదున్న భారత జూనియర్ హాకీ జట్టుకు బ్రేక్ పడింది. టోర్నీలో భాగంగా మంగళవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 3-4తేడాతో జపాన్ చేతిలో పరాజయం పాలైంది. మ్యాచ్ తొలి నిమిషంలోనే పెనాల్టీ కార్నర్ రాగా జపాన్ ప్లేయర్ మట్సుమోటో వటారు గోల్‌గా మలిచాడు. ఆ తర్వాత భారత్ దూకుడుగా ఆడినా ప్రత్యర్థి జట్టు డిఫెన్స్‌ను ఛేదించలేకపోయింది. 22వ నిమిషంలో జపాన్ ఆటగాడు కీసే కవాబే గోల్ చేయడంతో భారత్ 0-2తో వెనుకబడిపోయింది. ఇక రెండో అర్ధభాగంలో వచ్చిన రెండో పెనాల్టీ కార్నర్‌ను గుర్‌సాహిబ్‌జిత్ సింగ్(31ని.) గోల్‌గా మలచడంతో టీమ్‌ఇండియా ఖాతా తెరిచింది. అయితే, మరో రెండు నిమిషాల్లోనే జపాన్ ప్లేయర్ కీటా వతాంబే పెనాల్టీ కార్నర్‌ను చక్కగా ఉపయోగించుకోవడంతో భారత్ మరిన్ని కష్టాల్లో పడింది. 37వ నిమిషంలో ప్రత్యర్థి జట్టు ఆటగాడు కవాబే రెండో గోల్ చేయడంతో టీమ్‌ఇండియా 1-4తో వెనుకబడిపోయింది. తర్వాతి నిమిషంలోనే శ్రద్ధానంద్ తివారీ, 53వ నిమిషంలో ప్రతాప్ లక్రా గోల్స్ సాధించడంతో 3-4తో నిలిచిన భారత్ ఆశలు చిగురించాయి. అయితే, అప్పటి నుంచి జపాన్ మరో గోల్ సమర్పించుకోకుండా ఆత్మరక్షణ ధోరణిలో జాగ్రత్తగా ఆడడంతో టీమ్‌ఇండియాకు పరాజయం తప్పలేదు. టోర్నీ రౌండ్ రాబిన్ లీగ్‌లో భాగంగా బుధవారం ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది.

మరోసారి విండీస్ కోచ్‌గా సిమన్స్

సెయింట్ జాన్స్ : వెస్టిండీస్ క్రికెట్ జట్టుకు హెడ్‌కోచ్‌గా ఆ దేశ మాజీ ఆల్‌రౌండర్ ఫిల్ సిమన్స్ మరోసారి నియమితుడయ్యాడు. 2016 టీ20ప్రపంచకప్ గెలిచిన విండీస్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించి, ఆ తర్వాత బోర్డుతో విభేదాల కారణంగా సిమన్స్ పదవిని కోల్పోయాడు. అయితే అతడిని నాలుగేండ్ల కాలానికి మరోసారి హెడ్‌కోచ్‌గా నియమిస్తున్నట్టు క్రికెట్ వెస్టిండీస్ (సీడబ్ల్యూఐ) మంగళవారం ప్రకటించింది. సరైన సమయంలో, సరైన వ్యక్తిని కోచ్ పదవికి ఎంపిక చేశామని తెలిపింది. మార్చి 2015 నుంచి దాదాపు 18 నెలల పాటు ఫిల్ కోచ్‌గా ఉండగా.. టీ20ల్లో రాణించిన విండీస్ జట్టు.. 14 టెస్టుల్లో ఒక్కటి మాత్రమే గెలిచి ఘోర ప్రదర్శన చేసింది. బోర్డు సంప్రదాయాలు, వ్యూహాల అమలు పట్ల సీడబ్ల్యూఐ - సిమన్స్‌కు మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. దీంతో ఆటగాళ్ల ఎంపిక ప్రక్రియలో తరచూ జోక్యం చేసుకుంటున్నాడన్న కారణంతో 2016 సెప్టెంబర్‌లో సిమన్స్‌ను కోచ్ పదవి నుంచి తొలగించారు. ఆ తర్వాత ఆఫ్ఘనిస్థాన్ జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా వ్యవహరించిన ఫిల్, ఈ ఏడాది ప్రపంచకప్ తర్వాత తప్పుకున్నాడు.

నాకౌట్ ఫీవర్ పోవాలి : గంగూలీ

కోల్‌కతా: ఐసీసీ టోర్నీల్లో నాకౌట్ మ్యాచ్‌ల్లో ఓడిపోయే ట్రెండ్‌ను తిరగరాసి, కోహ్లీ సారథ్యంలోని టీమ్‌ఇండియా టైటిల్స్ సాధిస్తుందని ఆశిస్తున్నట్టు మాజీ కెప్టెన్, బీసీసీఐకి కాబోయే అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ చెప్పాడు. 'భారత్ మంచి జట్టు. అయినా పెద్ద టోర్నీలు గెలువడం లేదని నాకు తెలుసు. సెమీఫైనల్, ఫైనల్ తప్ప టోర్నీ అంతా టీమ్‌ఇండియా బాగా ఆడుతున్నది. విరాట్ సారథ్యంలోని జట్టు ఈ పరిస్థితిని మారుస్తుందని ఆశిస్తున్నా. కోహ్లీ ఓ చాంపియన్ ప్లేయర్' అని గంగూలీ మీడియాతో మంగళవారం అన్నాడు. 2013 చాంపియన్స్ ట్రోఫీ తర్వాత భారత్ ఒక్క ఐసీసీ టోర్నీలోనూ విజేతగా నిలువలేదు. స్వదేశంలో జరిగిన 2016 టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్లో విండీస్‌పై.. 2017 చాంపియన్ ట్రోఫీ ఫైనల్లో పాకిస్థాన్ చేతిలో ఓడింది. అలాగే ఈ ఏడాది జరిగిన ప్రపంచ కప్ సెమీస్‌లో న్యూజిలాండ్ చేతిలో భారత్ ఓడిన సంగతి తెలిసిందే.

సమయమొచ్చినప్పుడు మాట్లాడుతా

ప్రతి మూడేండ్లకోసారి వన్డే ప్రపంచకప్, ప్రతి ఏడాది టీ20 ప్రపంచకప్ నిర్వహించాలన్న ఐసీసీ ఆలోచనలపైనా గంగూలీ స్పందించాడు. ' ఆ నిర్ణయం ఐసీసీ తీసుకోవాలి. ఈ ప్రతిపాదనలపై జరిగే చర్చల్లో అవకాశం వస్తే కచ్చితంగా మాట్లాడుతా. కొన్నిసార్లు జీవితంలో కొన్ని తక్కువగా ఉంటేనే బాగుంటాయనిపిస్తుంది. ఆ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఫుట్‌బాల్ ప్రపంచకప్ నాలుగేండ్లకోసారి జరుగుతుంది. అప్పుడు ఎంత సందడి నెలకొంటుందో అందరికీ తెలిసిందే' అని సౌరవ్ చెప్పాడు.

ప్రిక్వార్టర్స్‌లో సింధు, ప్రణీత్

డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

ఒడెన్సె(డెన్మార్క్) : ప్రపంచ చాంపియన్ పీవీ సింధు, స్టార్ షట్లర్ సాయి ప్రణీత్ డెన్మార్క్ ఓపెన్‌లో శుభారంభం చేశారు. తొలి రౌండ్‌లో సింధు వరుస గేమ్‌లో విజయం సాధించగా.. ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత సాయి ప్రణీత్.. చైనా దిగ్గజ ప్లేయర్ లిన్ డాన్‌పై సునాయాసంగా గెలిచి సత్తా చాటాడు. మంగళవారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఐదో సీడ్ సింధు 22-20, 21-18తేడాతో గ్రెగొరియా మరిస్కా తున్‌జంగ్ (ఇండోనేషియా)పై గెలిచింది. 38నిమిషాల పాటు మ్యాచ్ జరుగగా.. తొలి గేమ్‌లో హోరాహోరీ పోరు సాగింది. చివర్లో 19-20తో వెనుకబడ్డ సమయంలో వరుసగా మూడు పాయింట్లు సాధించిన తెలుగమ్మాయి గేమ్‌ను చేజిక్కించుకుంది. ఆ తర్వాతి గేమ్‌లో కూడా 16-16తో పాయింట్లు సమమైనా... ఆ తర్వాత మెరుగ్గా ఆడిన సింధు విజయం సాధించింది. ప్రిక్వార్టర్స్‌లో అన్‌సే యంగ్ (కొరియా)తో సింధు తలపడనుంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రణీత్ 21-14, 21-17 తేడాతో చైనా దిగ్గజం లిన్ డాన్‌ను 35 నిమిషాల్లో వరుస సెట్లలో మట్టికరిపించాడు. ప్రపంచ చాంపియన్‌షిప్ సెమీస్‌లో తనను ఓడించిన ప్రపంచ నంబర్ వన్ కెంటో మొమోటా (జపాన్)ను ప్రిక్వార్టర్స్‌లో ప్రణీత్ ఢీకొంటాడు. ఇక కామన్వెల్త్ గేమ్స్ మాజీ చాంపియన్ పారుపల్లి కశ్యప్ 13-21, 12-21 తేడాతో సితికోమ్ తమాసిన్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయం పాలై మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. సౌరభ్‌వర్మ 21-19, 11-21, 17-21తో మార్క్ చెలిజొ(నెదర్లాండ్స్)పై పోరాడి ఓడాడు. థాయ్‌లాండ్ ఓపెన్ చాంపియన్స్ సాత్విక్ సాయిరాజ్ రాంకీ రెడ్డి - చిరాగ్ శెట్టి 24-22, 21-11 తేడాతో కొరియా ద్వయం కిమ్ జీజంగ్ - లీయంగ్‌పై మొదటి రౌండ్‌లో విజయం సాధించి, ముందడుగేశారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ప్రారంభం

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం 65వ రాష్ట్రస్థాయి హాకీ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అధికారికంగా పోటీలను ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే టోర్నీలో తొమ్మిది జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు బరిలోకి దిగుతున్నారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. జాతీయస్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర పేరును నిలబెట్టాలన్నారు. క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ రాజన్న, డీసీసీబీ చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి, హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధన్ రెడ్డి, పార్థసారథి పాల్గొన్నారు.

నేడు పీకేఎల్ సెమీఫైనల్స్

అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఏడో సీజన్ ఆఖరి అంకానికి చేరుకుంది. డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు బుల్స్, టేబుల్ టాపర్ దబాంగ్ ఢిల్లీ మధ్య బుధవారం తొలి సెమీ ఫైనల్ జరుగనుంది. మరో సెమీస్‌లో బెంగాల్ వారియర్స్, యూ ముంబా ముఖాముఖి తలపడనున్నాయి. ఎలిమినేటర్ మ్యాచ్‌లో యూపీ యోధాపై అద్భుత విజయంతో సెమీస్‌లోకి ప్రవేశించిన బెంగళూరు.. అదే జోరులో ఢిల్లీని మట్టికరిపించాలని చూస్తున్నది. సమవుజ్జీలుగా కనిపిస్తున్న ఈ రెండు జట్లలో ఫైనల్ బెర్తు దక్కించుకునేది ఎవరన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు వరుస విజయాలతో జోరు మీదున్న యూ ముంబా.. ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్న బెంగాల్ వారియర్స్‌ను ఎదుర్కోబోతున్నది.

రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

రొనాల్డో @700

కీవ్(ఉక్రెయిన్): అద్భుతమైన ఆటతో రికార్డులను బద్దలు కొట్టుకుంటూ ముందుకు సాగుతున్న పోర్చుగల్ స్టార్ ఫుట్‌బాలర్ క్రిస్టియానో రొనాల్డో మరో మైలురాయిని అందుకున్నాడు. ఉక్రెయిన్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో గోల్ సాధించి... కెరీర్‌లో 700వ గోల్‌ను నమోదు చేశాడు. దీంతో ఫుట్‌బాల్ ఎలైట్ గ్రూప్‌లో చేరాడు. అయితే, ఈ మ్యాచ్‌లో పోర్చుగల్ 1-2తేడాతో ఓటమి పాలైంది. దీంతో యూరో 2020 టోర్నీకి ఉక్రెయిన్ అర్హత సాధించింది. ఓవరాల్‌గా 805 గోల్స్‌తో జోసెఫ్ బికాన్ (చెక్-ఆస్ట్రియా) అత్యధిక గోల్స్ సాధించిన ఆటగాడి అగ్రస్థానంలో ఉండగా.. రొనాల్డో ఎలైట్ క్లబ్‌లో అడుగుపెట్టడం సహా ఆరో స్థానానికి చేరాడు. ఇప్పటి వరకు క్రిస్టియానో 973 మ్యాచ్‌లు ఆడి, 458 వాటిల్లో కనీసం ఒక్క గోల్ అయినా సాధించాడు. రొనాల్డో తన దేశం పోర్చుగల్ తరపున 95 గోల్స్ చేసి అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో అత్యధిక గోల్స్ చేసిన రెండో ఆటగాడిగా ఉన్నాడు. తొలి స్థానంలో అలీ దాయీ(109) ఉన్నాడు.

సెన్సెక్స్	నిఫ్టీ
38,506	11,428
↗ 292	↗ 87

ముడి చమురు (బ్రెంట్) ↘ 59.04 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ (రూ.లలో)

24 క్యారెట్లు	39,105
22 క్యారెట్లు	---
వెండి (కిలో)	46,809

మలేషియా పామాయిల్‌కు దూరం

పన్నుల భయంతో దిగుమతుల్ని ఆపేసిన వ్యాపారులు

ముంబై, అక్టోబర్ 15: పన్నులు, ఇతరత్రా కారణాల దృష్ట్యా మలేషియా నుంచి పామాయిల్ దిగుమతుల్ని భారతీయ వ్యాపారులు తగ్గించేస్తున్నారు. ఇక నవంబర్, డిసెంబర్ నెల లకుగాను దిగుమతుల్నే ఆపేశారు. కశ్మీర్ వివాదంలో భారత్ వైఖరిని మలేషియా విమర్శించిన నేపథ్యంలో ఆ దేశం నుంచి దిగుమతి చేసుకుంటున్న పామాయిల్ తదితర ఉత్పత్తులపై ఆంక్షలు విధించాలని కేంద్రం యోచిస్తున్నది. దీనిపై కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ నుంచి ఇప్పటికిప్పుడు ఎలాంటి సంకేతాలూ రానప్పటికీ.. భారతీయ వ్యాపార వర్గాలు మాత్రం అప్రమత్తమవుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా మలేషియా పామాయిల్‌ను భారతే పెద్ద ఎత్తున దిగుమతి (3.9 మిలియన్ టన్నులు) చేసుకోగా, తాజా పరిణామం.. ఇండోనేషియాకు లాభించనున్నది.

ఆగిన 2వేల నోటు ప్రింటింగ్

2019-20లో ఒక్కటంటే ఒక్కటి ముద్రించలేదు

సమాచార హక్కు చట్టం ద్వారా వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: కేంద్ర ప్రభుత్వం మరోసారి పెద్ద నోట్లను రద్దు చేయడానికి సిద్ధమవుతున్నదా! ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇది నిజమేననిపిస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2,000 నోట్‌ను ఒక్కటంటే ఒక్కటి ముద్రించకపోవడంతో ఈ అనుమానాలకు తావిస్తున్నది. సమాచారం హక్కు చట్టం ద్వారా రిజర్వు బ్యాంక్‌ను అడిగిన ప్రశ్నకు ఈ సమాధానం వెల్లడైంది. 2019-20లో తొలి ఆరు నెలలు పూర్తైనప్పటికీ ఒక్క రూ.2 వేల నోటు ముద్రించలేదని తెలిపింది. నల్లధనాన్ని నిర్మూలించడానికి మూడేండ్ల క్రితం రూ.500, రూ.1,000 పాత పెద్ద నోట్లను రద్దుచేసి సంచలన నిర్ణయం తీసుకున్న నరేంద్ర మోదీ సర్కార్.. ఆ తర్వాత వీటి స్థానంలో రూ.500, రూ.2,000 నోట్లను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. 2016-17లో 3,542.991 మిలియన్ల(354.29 కోట్ల) రూ.2వేల నోట్లను ప్రింటింగ్ చేసినట్లు సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. 2017-18లో 11.15 కోట్ల నోట్లను ముద్రించగా..ఆ తర్వాతి సంవత్సరంలో దీనిని 4.66 కోట్లకు తగ్గించింది. నల్లధనాన్ని నిర్మూలించాలంటే అధిక విలువైన నోట్ల చలామణిని రద్దు చేయాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. రూ.2 వేల విలువైన నోట్ ద్వారా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు, అక్రమ రవాణా మరింత సులభతరం అవుతున్న నేపథ్యంలో ఈ పెద్దనోట్లను రద్దుచేయాలని ప్రభుత్వానికి పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్-తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులో రూ.6 కోట్ల విలువైన రూ.2 వేల నోట్లను సీజ్ చేసిన విషయం తెలిసిందే. రూ.2 వేల నోట్ల చలామణి క్రమంగా తగ్గుతున్నట్లు ఆర్బీఐ వెల్లడించిన సమాచారం మేరకు తెలిసింది. మార్చి 2018 నాటికి 336.3 కోట్లుగా ఉన్న అత్యంత విలువైన నోట్ల చలామణి..మొత్తం కరెన్సీలో ఈ వాటా 3.3 శాతంగా ఉండగా, విలువ పరంగా చూస్తే 37.3 శాతం. మార్చి 2019 నాటికి ఇది 329.10 కోట్లకు తగ్గగా, మొత్తం కరెన్సీలో ఇది 3 శాతానికి, విలువలో 31.2 శాతానికి పడిపోయింది. గడిచిన మూడేండ్లలో రూ.50 కట్లో విలువైన నకిలీ కరెన్సీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు.

ప్రఫుల్ పటేల్‌కు ఈడీ సమన్లు

దావూద్ ఇబ్రహీం అనుచరుడితో ఆస్తి లావాదేవీలు

క్విడ్ ప్రోకో ఆరోపణలపై విచారణ • 18న హాజరు కావాలని ఆదేశం

ముంబై, అక్టోబర్ 15:

కేంద్ర మాజీ మంత్రి, ఎన్సీపీ సీనియర్ నేత ప్రఫుల్ పటేల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. డ్రగ్ స్మగ్లర్ ఇక్బాల్ మిర్చీ మొదటి భార్య హజ్రా మేమన్‌తో పటేల్ కున్న ఆస్తి లావాదేవీలపై దర్యాప్తు చేస్తున్న ఈడీ.. శుక్రవారం విచారణకు హాజరు కావాలని సదరు సమన్లలో స్పష్టం చేసింది. ఇక్బాల్ మిర్చీ 2013లో లండన్‌లో చనిపోయిన విషయం తెలిసిందే. అంతేగాకుండా అంతర్జాతీయ ఉగ్రవాది, అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంకు సన్నిహితుడు కూడా. కాగా, మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న యూపీఏ ప్రభుత్వ హయాంలో పటేల్ పౌర విమానయాన శాఖ మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో హజ్రా, పటేల్ మధ్య జరిగిన డీల్‌లో క్విడ్ ప్రోకో ఆరోపణలపై ఈడీ మనీ లాండరింగ్ దర్యాప్తు చేస్తున్నది. తీవ్రవాదులకు నిధులు అందాయా? అన్న కోణంలోనూ విచారణ చేపడుతున్నది. అయితే మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు పటేల్ వ్యవహారం మాత్రం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈ ఎన్నికల్లో నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)తో కలిసి కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తున్నది.

అవన్నీ ఊహాగానాలు: పటేల్

గ్యాంగ్‌స్టర్ ఇక్బాల్ మిర్చీతో ముంబైలో తాను డీలింగ్స్ చేశానన్న వార్తలు కేవలం ఊహాగానాలేనని పటేల్ మంగళవారం ఇక్కడ కొట్టిపారేశారు. 'ఏవో కొన్ని డాక్యుమెంట్లు లీకైనట్లున్నాయి. మీరు జర్నలిస్టులు కాబట్టి వాటిపై సహజంగానే ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు' అని విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. ప్రఫుల్ పటేల్‌కు చెందిన మిల్లేనియం డెవలపర్స్.. ముంబైలోని వొర్లీలోగల సీజే హౌజ్‌ను 2005లో రీడెవలప్ చేసిందని, 2007లో దీనిలోని రెండు అంతస్తులను హజ్రాకు బదిలీ చేశారని ఈడీ చెబుతున్నది. 'మిల్లేనియం డెవలపర్స్ మా కుటుంబానిదే. ఇందులో ఎవరికీ భాగస్వామ్యం లేదు. అలాగే హజ్రా మేనన్‌కు పటేల్ కుటుంబానికి మధ్య నయా పైసా విలువైన ఆస్తి లావాదేవీ కూడా జరుగలేదు' అన్నారు. ప్రస్తుతం ఈ అంశంపై దర్యాప్తు జరుగుతున్నదన్న ఆయన 'సీజే హౌజ్‌లోని ఓ వ్యక్తితో నాకూ సంబంధాలు ఉన్నాయా? లేవా? అన్న కోణంలోనే విచారణ చేస్తుండవచ్చని పరోక్షంగా హజ్రాతో ఉన్న సంబంధాల ఆరోపణలపై వ్యాఖ్యానించారు. 1970లో నిర్మించిన సీజే హౌజ్‌లోగల 21 మంది కో-ఓనర్ల మధ్య విభేదాలు ఏర్పడ్డాయని 1978 నుంచి 2005 వరకు బాంబే హైకోర్టు రిసీవర్ వద్దే ఈ ఆస్తి ఉందని ఈ సందర్భంగా పటేల్ గుర్తుచేశారు. ఇదిలావుంటే దీని వెనుక రాజకీయ కుట్ర ఏమైనా ఉందా? అన్న ప్రశ్నకు నా కంటే మీకే బాగా తెలుసని పటేల్ వ్యాఖ్యానించారు.

రాజద్రోహం: అమిత్ షా

పటేల్, హజ్రా మధ్య జరిగిన ఆస్తి లావాదేవీని రాజద్రోహంగా అభివర్ణించారు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా. ముంబై పేలుళ్ల నిందితుడు ఇక్బాల్ మిర్చీ భార్యతో ఓ కేంద్ర మంత్రికి డీలింగ్స్ ఏమిటీ? అని ప్రశ్నించారు. దీనికి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఎన్సీపీ అధినేత శరద్ పవార్ సమాధానం చెప్పాలన్నారు. ఓ ప్రముఖ జాతీయ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ వ్యవహారంలో ఈడీ చర్యలు తీసుకుంటుందన్నారు. బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర స్పందిస్తూ డీల్‌పై పటేల్, హజ్రా సంతకాలు ఉన్నాయన్నారు. కేంద్ర క్యాబినెట్‌లో పటేల్‌ను చేర్చుకోవడానికి సోనియా గాంధీ క్విడ్ ప్రోకోకు పాల్పడ్డారా? అని ప్రశ్నించారు.

ఐసీబీఏ డైరెక్టర్‌గా రవీందర్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 15: అంతర్జాతీయ సహకార బ్యాంకింగ్ సమాఖ్య (ఐసీబీఏ) డైరెక్టర్‌గా తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టీఎస్‌క్యాబ్) అధ్యక్షుడు కొండూరు రవీందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో టీఎస్‌క్యాబ్ వెల్లడించింది. సహకార బ్యాంకుల అభివృద్ధి కోసం రవాండ రాజధాని కిగాలిలో జరుగుతున్న అంతర్జాతీయ సహకార కూటమి జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో రవీందర్‌రావును ఎన్నుకున్నారు. ఈ సమావేశాలకు 94 దేశాల నుంచి 1,100 మంది ప్రతినిధులు హాజరైయ్యారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో 20 ఏండ్ల అనుభవం రవీందర్‌రావుకు ఉన్నది.

2019లో వృద్ధి 6.1 శాతమే

భారత వృద్ధి అంచనాల్లో కోత విధించిన ఐఎంఎఫ్

ఏప్రిల్‌లో అంచనావేసిన 7.3 శాతంతో పోలిస్తే 1.2 శాతం తక్కువ

అయినప్పటికీ వేగవంతమైన వృద్ధిని సాధిస్తున్న దేశంగా భారత్

2020లో 7 శాతానికి చేరుకోనున్న దేశ ఆర్థిక వ్యవస్థ

వాషింగ్టన్, అక్టోబర్ 15:

భారత వృద్ధి అంచనాలు క్రమంగా తగ్గిస్తున్నాయి అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీలు. తాజాగా ఇదే జాబితాలోకి అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్) చేరింది. ప్రస్తుత సంవత్సరంలో భారత వృద్ధి అంచనాను 6.1 శాతానికి కుదిస్తున్నట్లు వెల్లడించింది. ఏప్రిల్ నెలలో అంచనావేసిన 7.3 శాతం కంటే ఇది 1.2 శాతం తక్కువ. గడిచిన మూడు నెలల్లోనే దేశ వృద్ధిరేటును భారీ స్థాయిలో తగ్గిస్తున్నట్లు ప్రకటించడం ఆర్థిక మాంద్యం గుప్పిట్లోకి భారత్ జారుకుంటుందా అనే భయాలు వెల్లడవుతున్నాయి. గతేడాదికిగాను భారత్ 6.8 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. ప్రస్తుత సంవత్సరానికిగాను ప్రపంచ దేశాల వృద్ధి అంచనాలను ఐఎంఎఫ్ తాజాగా విడుదల చేసింది. ఈ ఏడాది 6.1 శాతంగా నమోదవనున్న దేశ వృద్ధి..వచ్చే ఏడాది మాత్రం 7 శాతానికి చేరుకోనున్నదని పేర్కొంది. కాగా, ఇటీవల వరల్డ్ బ్యాంక్ కూడా భారత వృద్ధి అంచనాను 6.9 శాతం నుంచి 6 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ, పరపతి సమీక్షలో రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించడం, కార్పొరేట్లపై ఆదాయం పన్ను కోత విధించడం, ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, ప్రభుత్వ పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో వినిమయం పెరుగడానికి దోహదం చేస్తున్నాయని తన నివేదికలో ఐఎంఎఫ్ పేర్కొంది. భారత్ పొరుగు దేశమైన చైనా వృద్ధిని 6.1 శాతంగా ఉంటుందని అంచనావేసిన ఐఎంఎఫ్..వచ్చే ఏడాది 5.8 శాతానికి దిగజారనున్నదని తెలిపింది. దీంతో ప్రపంచంలో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్న దేశంగా భారత్ తిరిగి అవతరించనున్నదని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో భారత వృద్ధి మరింత పడిపోయే ప్రమాదం ఉన్నదని, ఆటోమొబైల్, రియల్ ఎస్టేట్ రంగాల్లో నెలకొన్న మందకొడి పరిస్థితులు, నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సేవల సంస్థల్లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు ఇందుకు కారణమని విశ్లేషించింది. మానిటరి పాలసీ నిర్ణయాలు, సంస్థాగత సంస్కరణలు బలహీన పరిస్థితుల నుంచి గట్టెక్కడానికి దోహదం చేయనున్నాయని, అలాగే నమ్మకం మరింత బలపడుతుందని వ్యాఖ్యానించింది. ఇదే సమయంలో ప్రభుత్వం తన ఖర్చులను తగ్గించుకోవడానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని సూచించింది.

లింగ అసమతుల్యత ఎక్కువే..

మహిళలు, పురుషుల మధ్య చెల్లించని పనిలో లింగ అసమతుల్యత ఇంచుమించు అన్ని దేశాల్లో అత్యధికంగా ఉన్నదని ఐఎంఎఫ్ తెలిపింది. పురుషుల కంటే మహిళలు రెండు గంటలు అధికంగా పనిచేస్తున్నారని వెల్లడించింది. హాంకాంగ్‌లో మహిళలు 2.6 గంటలు అదనంగా పనిచేస్తుండగా, మెక్సికోలో 7.1 గంటలు అధికం.

ప్రపంచ దేశాల వృద్ధి 3 శాతమే..

ప్రపంచ దేశాల వృద్ధి 3 శాతానికి దిగజారనున్నదని ఐఎంఎఫ్ పేర్కొంది. పలు దేశాల్లో నెలకొన్న రాజకీయ అస్థిరత ఇందుకు కారణమని హెచ్చరించింది. అంతర్జాతీయ ఆర్థిక మాంద్యం తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి వృద్ధి కానున్నది. 2017లో వృద్ధి 3.7 శాతంగా ఉన్నది. 2020లో కాస్త పెరిగి 3.4 శాతానికి చేరుకోనున్నదని తెలిపింది. ఏప్రిల్‌లో అంచనా వేసిన కంటే 0.2 శాతం తక్కువ.

హైదరాబాద్‌లో బ్రిడ్జ్‌ల్యాబ్

హైదరాబాద్, అక్టోబర్ 15: ఇంజినీరింగ్ విద్యార్థులకు కోడింగ్‌పై శిక్షణ ఇవ్వడానికి హైదరాబాద్‌లో ప్రత్యేక ల్యాబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు బ్రిడ్జ్‌ల్యాబ్జ్ ప్రకటించింది. 150 సీట్ల కెపాసిటీ కలిగిన ఈ ల్యాబ్ ద్వారా ప్రతియేటా 1,500 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు కంపెనీ ఫౌండర్ మనోజ్ బరోట్ తెలిపారు. ప్రతియేటా 15 లక్షల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు చదువు పూర్తి చేసుకొని బయటకు వస్తే వీరిలో 4 వేల మందికి మాత్రమే నైపుణ్యం ఉంటున్నదని, ఈ లోటును పూడ్చడానికి ఈ శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. నాలుగు నెలలపాటు ఇవ్వనున్న ఈ శిక్షణకు ఎలాంటి రుసుంను వసూలు చేయడం లేదని, కార్పొరేట్ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందం వారు భరించనున్నారు. ఇప్పటికే ముంబై, బెంగళూరులలో ఉన్న ల్యాబ్‌ల ద్వారా 800 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఉపాధి కల్పించడానికి హైదరాబాద్‌కు చెందిన మూడు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు.

టెల్కోల్లో ఐయూసీ రచ్చ

జియో-ఎయిర్‌టెల్, వొడాఫోన్ మధ్య మాటల యుద్ధం

నిమిషానికి 6 పైసల చార్జీపై ట్విట్టర్ వేదికగా పరస్పర విమర్శలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 15:

రిలయన్స్ జియో-వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్‌ల మధ్య ఇంటర్‌కనెక్ట్ యూసేజ్ చార్జీ (ఐయూసీ) రచ్చ రాజుకున్నది. సోషల్ మీడియాలో వరుస ట్వీట్లతో ఈ టెలికం ఆపరేటర్లు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్నారు. ఇతర నెట్‌వర్క్‌లకు మొబైల్ కాల్స్‌పై నిమిషానికి 6 పైసలు చార్జీ పడుతుందంటూ తమ కస్టమర్లకు జియో ఇచ్చిన సందేశాన్ని వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్‌లు ట్విట్టర్ వేదికగా విమర్శలు మొదలుపెట్టాయి. 'అన్‌లిమిటెడ్ కాల్స్ అంటే అపరిమిత కాల్స్ అనే అర్థమని, ఈ తరహా చార్జీలు మేము మా కస్టమర్లపై వేయబోమని, వెంటనే ఎయిర్‌టెల్‌కు మారవచ్చని' ఎయిర్‌టెల్ ట్వీట్ చేసింది. ఐయూసీ విధానాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవాలనే జియో తమ కాల్ రింగ్ సమయాన్ని తగ్గించిందని ఆరోపించింది. అయితే 6 పైసల చార్జీని మేము అడుగలేదని, టెలికం రెగ్యులేటర్ ట్రాయ్ ఆదేశమని జియో గుర్తుచేస్తున్నది. వొడాఫోన్ ఐడియాపైనా తనదైన శైలిలో దాడి చేసింది. ఇతర టెలికం ఆపరేటర్లే కస్టమర్లపై అదనపు చార్జీల భారాన్ని మోపుతున్నారంటూ వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్‌పై పరోక్షంగా విరుచుకుపడింది. ఈ నెల 10 నుంచే ఈ ఐయూసీ చార్జీల నిబంధన అమల్లోకి రాగా, అంతకుముందు రీచార్జ్ చేసుకున్న జియో కస్టమర్లకు ఈ చార్జీలేవీ ఉండవు. ఐయూసీ చార్జీలతో సంబంధం లేకుండా ఎస్ఎమ్ఎస్‌లు మాత్రం ఎప్పట్లాగే అందరికీ ఉచితం. ఈ చార్జీలను తప్పించుకోవాలంటే తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులను జియో వినియోగదారులుగా ఉంచుకోవాలని కస్టమర్లకు జియో సందేశాలిస్తున్నది.

ట్రాయ్ తీరుపై జియో ఆగ్రహం

ట్రాయ్ తీరు ఎయిర్‌టెల్ తదితర పాత టెలికం ఆపరేటర్లకు అవాంఛిత, అపరిమిత లాభాలను తెచ్చిపెట్టేలా ఉందని జియో ఆగ్రహం వ్యక్తం చేసింది. మార్కెట్‌లో ప్రభావవంతంగా ఉన్న తమకు నష్టం చేకూరుతుందన్నది. ఐయూసీ సమీక్షపై మండిపడింది. ఈ మేరకు 14 పేజీల ఓ లేఖను ట్రాయ్‌కి జియో పంపింది. ఫోన్ కాల్స్ రద్దుపై ఆకస్మికంగా మారిన ట్రాయ్ తీరు తమను ఆశ్చర్యానికి గురిచేస్తున్నదని వ్యాఖ్యానించింది. ఒక టెలికం సంస్థ మరో టెలికం సంస్థకు చెల్లించేదే ఈ ఐయూసీ చార్జీ. తమ కస్టమర్లు ఇతర నెట్‌వర్క్‌ల కస్టమర్లకు ఫోన్ చేసినప్పుడు ట్రాయ్ నిబంధనల ప్రకారం నిమిషానికి 6 పైసల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఈ చార్జీనే ఇప్పుడు తమ కస్టమర్లపై జియో వేసింది. కస్టమర్ల సౌకర్యార్థం వారం రోజుల గడువుతో ఇతర నెట్‌వర్క్‌లకు 30 నిమిషాల ఉచిత టాక్‌టైంనూ జియో అందిస్తున్నది. ఇది పూర్తయితే మాత్రం తమతమ ప్లాన్లపై అదనంగా రూ.10 నుంచి వెయ్యి రూపాయల వరకు టాప్‌అప్‌లను వేసుకోవాల్సి ఉంటుంది. ప్రతి రూ.10 టాప్‌అప్‌పై 124 నిమిషాల ఐయూసీ టాక్‌టైం వస్తుంది. అలాగే 1జీబీ డాటా కూడా అందుతుంది.

చార్జీలు పెరుగాలి: ఎయిర్‌టెల్

మొబైల్ సేవల ధరలు అస్థిరంగా ఉన్నాయని, పెరుగాల్సిన అవసరం ఉందని ఎయిర్‌టెల్ ఇండియా ఎండీ, సీఈవో గోపాల్ విఠల్ అన్నారు. జియో ఐయూసీ చార్జీలపై స్పందిస్తూ ఐయూసీ చార్జీలు టారిఫ్‌లలో భాగం కాకున్నప్పటికీ వాటిని టెలికం సంస్థలే చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు.

ఎగుమతులు ఢీలా

సెప్టెంబర్‌లో 6 శాతం పతనం • ఏడు నెలల కనిష్ఠానికి వాణిజ్యలోటు

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: వరుసగా రెండో నెలలోనూ దేశీయ ఎగుమతులు ఢీలాపడ్డాయి. పెట్రోలియం, ఇంజినీరింగ్, లెదర్, కెమికల్స్, జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ రంగంలో నెలకొన్న మందకొడి పరిస్థితుల కారణంగా సెప్టెంబర్ నెలలో ఎగుమతులు 6.57 శాతం తగ్గి 26 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ఇదే సమయంలో దిగుమతులు 13.85 శాతం తగ్గి 36.89 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. దీంతో వాణిజ్యలోటు(ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసం) ఏడు నెలల కనిష్ఠ స్థాయి 10.86 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో లోటు 14.95 బిలియన్ డాలర్లుగా ఉన్నది. 30 కీలక రంగాల్లో 22 రంగాలు ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకోగా, కేవలం ఎనిమిది అనుకూలంగా ఉన్నాయి. గత నెలలో జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ ఎగుమతులు 5.56 శాతం పడిపోగా, ఇంజినీరింగ్ గూడ్స్ 6.2 శాతం, పెట్రోలియం ఉత్పత్తులు 18.6 శాతం తగ్గాయి. చమురు దిగుమతులు 18.33 శాతం తగ్గి 8.98 బిలయన్ డాలర్లకు చేరుకోగా, చమురేతర ఉత్పత్తుల దిగుమతులు కూడా 12.3 శాతం పడిపోయి 27.91 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. పసిడి దిగుమతులు ఏకంగా 62.49 శాతం తగ్గి 1.36 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో ఎగుమతులు 2.39 శాతం క్షీణించి 159.57 బిలియన్ డాలర్లకు, దిగుమతులు 7 శాతం తగ్గి 243.28 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. లోటు 83.7 బిలియన్ డాలర్లుగా ఉన్నది.

గుండె పగిలింది..!

పీఎంసీ బ్యాంక్ కుంభకోణంలో ప్రాణాలు కోల్పోతున్న డిపాజిటర్లు

24 గంటల వ్యవధిలో గుండెపోటుతో ఇద్దరు మృతి.. ఒకరు ఆత్మహత్య

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: పీఎంసీ బ్యాంక్ కేసులో కస్టమర్ల గుండెలు ఆగుతున్నాయి. కష్టార్జితాన్ని బ్యాంక్‌లో దాచితే కష్టకాలంలో తమకు, తమను నమ్ముకున్నవారికి ఆసరాగా ఉంటుందనుకున్న డిపాజిటర్లకు కుంభకోణం వ్యవహారంతో గుండెలు పగులుతున్నాయి. సోమవారం ఇద్దరు, మంగళవారం మరొకరు చనిపోగా, 24 గంటల వ్యవధిలో ముగ్గురు డిపాజిటర్లు ప్రాణాలు కోల్పోయారు. తమ సొమ్ము కోసం రోడ్డెక్కిన బాధితులు.. భవిష్యత్‌పై ఆందోళనతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. సోమవారం ఓ జెట్ ఎయిర్‌వేస్ మాజీ ఉద్యోగి, ఓ డాక్టర్ కన్నుమూసిన నేపథ్యంలో మంగళవారం మరో చావును చూడాల్సి వచ్చింది. ముంబైలోని ఓషీవారా నివాసి అయిన 51 ఏండ్ల సంజయ్ గులాటీ.. పీఎంసీ బ్యాంక్‌లో రూ.90 లక్షలు దాచుకున్నారు. పీఎంసీ బ్యాంక్ కుంభకోణం నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ తెచ్చిన ఆంక్షలు సంజయ్‌ని తీవ్రంగా కుంగదీశాయి. ఈ క్రమంలోనే సోమవారం బాధితులంతా ఆందోళనకు దిగగా, అది ముగిసిన తర్వాత ఇంటికొచ్చి భోజనం చేస్తున్న సంజయ్ గుండెపోటుతో చనిపోయారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. అలాగే మెట్రోపోలిస్ వర్సోవా ప్రాంతానికి చెందిన 39 ఏండ్ల డాక్టర్ నివేదితా బిజ్లాని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మోతాదుకు మించి నిద్ర మాత్రలను తీసుకుందని పోలీసులు తెలిపారు. పీఎంసీ బ్యాంక్‌లో నివేదితాకు కోటి రూపాయల డిపాజిట్లున్నాయి. అయితే ఇటీవలే రెండో పెండ్లి చేసుకున్న ఈమె.. గతంలో ఓసారి అమెరికాలోనూ ఆత్మహత్యకు ప్రయత్నించిందని, తీవ్ర మానసిక ఒత్తిడి రుగ్మతను ఎదుర్కొంటున్నదనీ పోలీసులు అంటున్నారు. ఇక మంగళవారం ఫట్టోమల్ పంజాబీ అనే మరో వ్యక్తి గుండెపోటుతో మరణించారు. పీఎంసీ బ్యాంక్ ములంద్ శాఖలో ఈయనకు ఖాతా ఉన్నది. రూ.8-10 లక్షల సొమ్ము దాచుకున్నారు. మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో గుండెపోటు వచ్చిందని, సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే చనిపోయారని ఇరుగుపొరుగువారు చెబుతున్నారు. పంజాబీ భార్య ఇప్పటికే చనిపోగా, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారని తెలిపారు. మరోవైపు సంజయ్, నివేదితా పంజాబీలతోనే ఈ చావులు ఆగవని, రేపు వందలాది మంది బలవుతారని బాధితులు తమ ఆవేదన, ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. అసలే ఉద్యోగం కోల్పోయిన సంజయ్‌ని పీఎంసీ బ్యాంక్ మోసం మరింత కుంగదీసిందని ఆయన స్నేహితులు చెబుతున్నారు. పంజాబీ తాను జీవితాంతం కష్టపడిన సొమ్మును బ్యాంక్‌లోనే దాచారని ఆయన మిత్రుడు అన్నారు.

సంజయ్ గులాటి, ఫట్టోమల్ పంజాబీ (ఫైల్)

హెచ్‌డీఐఎల్ ప్రమోటర్ల విమానాల్లో పటేల్

కేంద్ర మాజీ పౌర విమానయాన శాఖ మంత్రి ప్రఫుల్ పటేల్.. నిర్మాణ రంగ సంస్థ హెచ్‌డీఐఎల్ డైరెక్టర్లకు చెందిన చార్టెడ్ విమానాల్లో తిరిగారాన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈ విషయంపై దృష్టి పెట్టింది. పీఎంసీ బ్యాంక్ కుంభకోణంలో హెచ్‌డీఐఎల్ డైరెక్టర్లు వాధవాన్లు ఇప్పటికే అరెస్టయిన విష యం తెలిసిందే. ఇండియా టుడే టీవీ వివరాల ప్రకారం పటేల్ తన భార్యతో కలిసి హెచ్‌డీఐఎల్‌కు చెందిన ప్రివిలేజ్ ఎయిర్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్ చార్టెడ్ ఫ్లైట్స్‌ల్లో ఎనిమిదిసార్లు ప్రయాణించారని ఈడీ చెబుతున్నది. ఓసారి వాధవాన్లతోనూ తిరిగారని అంటున్నది.

అంచనాలు మించిన విప్రో

క్యూ2లో రూ.2,552 కోట్ల లాభం

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: దేశంలో మూడో అతిపెద్ద ఐటీ సేవల సంస్థయైన విప్రో లిమిటెడ్ విశ్లేషకుల అంచనాలకుమించి ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను సంస్థ రూ.2,552.70 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.1,889 కోట్ల లాభంతో పోలిస్తే 35 శాతం వృద్ధి కనబరిచింది. జూలై-సెప్టెంబర్ మధ్యకాలంలో కంపెనీ ఆదాయం రూ.15,203.20 కోట్ల నుంచి రూ.15,875.40 కోట్లకు ఎగబాకింది. ప్రస్తుత త్రైమాసికంలో ఐటీ రంగంలో 0.8 శాతం నుంచి 2.8 శాతం మధ్యలో వృద్ధి ఉంటుందని అంచనావేసిన విప్రో..

ఇంటి వద్దే ఐరిస్

బాధితుడి గృహానికే తరలిన రెవెన్యూ సిబ్బంది

చర్ల: కదలలేని స్థితిలో ఉన్న అన్నదాత చెంతకే రెవెన్యూ యంత్రాంగం తరలివెళ్లింది. కాళ్లూచేతులు కాలిపోయి మంచానికే పరిమితమైన బాధితుడి గోస తీర్చడానికి స్వయంగా గ్రామానికే వెళ్లి రెవెన్యూ అధికారులు సమస్యను పరిష్కరించారు. తాసిల్దారే దగ్గరుండి పని పూర్తి చేశారు. వివరాలిలా ఉన్నాయి.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండల పరిధిలోని సింగ సముద్రం గ్రామానికి చెందిన గిరిజన రైతు బోడిక నాగేశ్వరరావుకు ప్రమాదంలో రెండు చేతులు, కాళ్లు కాలిపోయి మంచానికే పరిమితమయ్యాడు. తన పేరుతో ఉన్న సర్వే నెంబరు 19 ఏ లో 2.70 సెంట్ల భూమి పట్టాదారు పాస్‌పుస్తకం కోసం దరఖాస్తు చేసుకునే శక్తిలేక పడిఉన్న విషయాన్ని తెలుసుకున్న తాసిల్దార్ రాఘవరెడ్డి తన సిబ్బందితో సింగముద్రంలోని బోడిక నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి ఐరిస్ ద్వారా ఆధార్ అనుసంధానంచేసి వెంటనే డిజిటల్ సంతకం చేసి పట్టాదారు పాసు పుస్తకం అందజేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండల పరిధిలోని సింగసముద్రంలో రైతు నుంచి ఐరిస్‌తో నమూనా సేకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

యూఎస్ కాన్సులేట్ 'సేఫ్ విలేజ్'కు అనూహ్య స్పందన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ జనరల్, మై చాయిస్ సంస్థతో కలిసి నిర్వహిస్తున్న సేఫ్ విలేజ్ కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తున్నది. మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఏపీలోని వంద గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని సోమవారం యూఎస్ కాన్సులేట్ జనరల్ జోయెల్ రిఫ్మన్ ప్రారంభించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన రెండోరోజు మంగళవారం విశాఖపట్నం సమీప సబ్బవరంలో నిర్వహించిన సమావేశంలో వందలమంది గ్రామస్థులు వలంటీర్లుగా, రక్షకులుగా పేర్లు నమోదుచేయించుకున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఏపీలో సబ్బవరంలో సేఫ్ విలేజ్ కార్యక్రమానికి హాజరైన యూఎస్ కాన్సులేట్ సిబ్బంది

సావర్కర్‌కు 'భారతరత్న'!

- ప్రకటించాలని కేంద్రాన్ని కోరుతాం
- మహారాష్ట్ర ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న బీజేపీ
- తప్పుపట్టిన ప్రతిపక్షాలు

ముంబై/న్యూఢిల్లీ, అక్టోబర్ 15: హిందుత్వవాది వీర్ సావర్కర్‌కు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్నను అందజేయాలని మహారాష్ట్ర బీజేపీ శాఖ ప్రతిపాదించింది. ఈ మేరకు తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ఈ అంశాన్ని పొందుపర్చింది. రానున్న ఐదేండ్లలో ఐదు కోట్ల ఉద్యోగాలను సృష్టిస్తామని, 2022నాటికి అందరికీ గృహ వసతి కల్పిస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. ఈ నెల 21న జరుగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఆ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేసింది. సావర్కర్‌తోపాటు సామాజిక సంస్కర్తలు జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలేకు కూడా భారత రత్న ప్రకటించాలని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని కోరుతామని బీజేపీ తెలిపింది. మహారాష్ట్రలోని జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్వహణ కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొంది. తీవ్ర నీటి ఎద్దడితో సతమతమవుతున్న మరాఠ్వాడా ప్రాంతానికి నీటిని అందించడానికి 11 డ్యాంలను అనుసంధానిస్తామని తెలిపింది. రాష్ట్రంలోని మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులను పెడుతామని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను లక్ష కోట్ల డాలర్లకు పెంచుతామని వెల్లడించింది.

గాడ్సేకూ ఇవ్వాలని కోరుతారేమో

సావర్కర్‌కు భారతరత్న ఇవ్వాలని మహారాష్ట్ర బీజేపీ శాఖ ప్రతిపాదించడంపై ప్రతిపక్షాలు విరుచుకుపడ్డాయి. కాంగ్రెస్ స్పందిస్తూ ఒకవేళ ఈ ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపితే ఈ దేశాన్ని దేవుడే రక్షించాలని పేర్కొంది. ఆపార్టీ అధికార ప్రతినిధి మనీశ్ తివారీ మాట్లాడుతూ మహాత్మాగాంధీని హత్య చేయడానికి సావర్కర్, ఆయన అనుచరులు కుట్ర పన్నారని తెలిపారు. గాంధీజీ హత్య కేసులో సావర్కర్ విచారణను కూడా ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. తర్వాత కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించిందని, అదే వేరే విషయమని చెప్పారు. సీపీఐ స్పందిస్తూ మహాత్మాగాంధీని హత్య చేసిన నాథూరాం గాడ్సేకు కూడా భారతరత్న ఇవ్వాలని బీజేపీ కోరే రోజులు ఎంతో దూరంలో లేవని ఎద్దేవా చేసింది. ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ట్విట్టర్‌లో స్పందిస్తూ '1. గాంధీజీ హత్యలో సావర్కర్ ప్రమేయం ఉన్నదని జీవన్ లాల్ కమిషన్ తేల్చింది. 2. లైంగికదాడిని (రేప్‌ను) రాజకీయ ఉపకరణంగా (టూల్) ఉపయోగించుకోవాలని సావర్కర్ సూచించారు. 3. లైంగికదాడిని రాజకీయ ఉపకరణంగా ఉపయోగించుకోనందుకు శివాజీని సావర్కర్ విమర్శించారు. 4. బ్రిటీష్ వారికి తాను విధేయుడినని సావర్కర్ ప్రకటించుకున్నారు. అలాంటి వ్యక్తికి భారతరత్న ఇవ్వాలంటూ కేంద్రాన్ని కోరుతామని మహారాష్ట్ర బీజేపీ శాఖ ప్రకటించింది' అని విమర్శించారు.

పల్లె ప్రణాళిక @ 7.32 కోట్ల మొక్కలు

30 రోజుల కార్యాచరణతో మరింత పచ్చదనం

వచ్చే ఏడాదికీ మొక్కలు సిద్ధంచేస్తున్న అటవీశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పల్లెలకు హరిత కళొచ్చింది. పంచాయతీల్లో పచ్చదనం పరిఢవిల్లుతున్నది. అన్ని గ్రామాల్లో 'పచ్చదనం-పరిశుభ్రత'ను పెంచటమే లక్ష్యంగా చేపట్టిన 30 రోజుల కార్యాచరణ ప్రణాళికలో అటవీశాఖ మంచి పనితీరును కనబరిచింది. విజయవంతంగా పూర్తయిన ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో 7.32 కోట్ల మొక్కలను నాటారు. పంచాయతీరాజ్, అటవీశాఖ, గ్రామ కమిటీల సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం పెంపునకు నిరంతరం ముమ్మరంగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అధికారులు ప్రతి గ్రామానికి హరిత కార్యాచరణ ప్రణాళికను (విలేజ్ లెవల్ గ్రీన్ ప్లాన్) సిద్ధంచేశారు. ఒక్కో గ్రామంలో అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలు, ఎన్ని మొక్కలు నాటవచ్చు, ప్రస్తుత ఏడాదితోపాటు రానున్న సంవత్సరాల్లో ఎన్ని మొక్కలు నాటేందుకు అవకాశం ఉన్నదనే అంశాలపై గ్రామస్థాయిలోనే నిర్ణయాలు తీసుకున్నారు. గ్రామస్థులు కోరిన మొక్కలనే పంపిణీ చేసేందుకు ప్రణాళికలు రూపొందించటంతోపాటు అందుబాటులో ఉన్న మొక్కలను అటవీశాఖ సరఫరా చేసింది. నర్సరీల్లో మిగిలిన నిల్వలను వచ్చే ఏడాది సరఫరా చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అటవీశాఖ నిర్ణయించింది. ఇప్పటిదాకా అటవీశాఖ ఆదీనంలో ఉన్న నర్సరీలను గ్రామీణాభివృద్ధిశాఖకు అప్పగించారు. ప్రతి గ్రామంలో ఆ ఊరి పేరుపై ఒక నర్సరీ ఏర్పాటు చేసే ప్రక్రియ కొనసాగుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా 12,751 గ్రామ పంచాయతీలకు దాదాపు అన్నింట్లో హరిత కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. 12,292 గ్రామాల్లో ఒక్కో నర్సరీ ఏర్పాటుకు స్థలం గుర్తింపు, మొక్కల పెంపకం పనులు ప్రారంభమయ్యాయి.

సంరక్షణకూ నడుంబిగించారు

ఇక 30 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చేపట్టిన పనుల విషయానికొస్తే.. 24,244 కిలోమీటర్ల మేర గ్రామ రహదారి, ఊరికి మరో ఊరికి మధ్య అవెన్యూ ప్లాంటేషన్‌ను చేపట్టారు. ఇందుకోసం 80.88 లక్షల మొక్కలను నాటి వాటి సంరక్షణకు నడుంబిగించారు. గ్రామాల్లో గుర్తించిన ఖాళీ ప్రదేశాలు, వివిధ సంస్థలకు చెందిన సామూహిక ప్రాంతాల్లోని 40,522 ఎకరాల్లో బ్లాక్ ప్లాంటేషన్‌లో భాగంగా 2.60 కోట్ల మొక్కలను నాటారు. గ్రామాల్లో ఇంటింటికీ ఆరు మొక్కల సరఫరాలో భాగంగా అధికారులు.. 2.26 కోట్ల మొక్కలను సరఫరా చేశారు. నాటిన ప్రతి మొక్కను కుటుంబ సభ్యుల్లా భావించి సంరక్షించాలని గ్రామస్థులకు ప్రత్యేకంగా విన్నవించారు. కోతులకు అటవీప్రాంతాల్లోనే ఆహార లభ్యత కోసం మంకీ ఫుడ్ కోర్టులను ఏర్పాటుచేస్తున్నారు. క్షీణించిన అటవీప్రాంతాల్లో కోతులు తినే పండ్లు, కాయగూరల మొక్కలను నాటుతున్నారు. మొదటి దశలో కామారెడ్డి, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో మంకీ ఫుడ్ కోర్టులు ఏర్పాటయ్యాయి.

గ్రామాల్లో నాటేందుకు నర్సరీల్లో సిద్ధం చేసిన మొక్కలు

నెల్లూరు జిల్లా సింహపురి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మంగళవారం రైతులకు చెక్కులు అందజేస్తున్న ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

ఏపీలో వైఎస్సార్ రైతు భరోసా ప్రారంభం

అమరావతి: వైఎస్సార్ రైతు భరోసా- పీఎం కిసాన్ సమ్మాన్ పథకాన్ని ఏపీ సీఎం వైఎస్ జగన్ నెల్లూరు జిల్లా సింహపురి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. పథకం కింద ప్రతిరైతుకు ఏడాదికి రూ.13,500 చొప్పున ఐదేండ్లు ఇస్తామని, ఏటా మే నెలలో రూ.7,500, అక్టోబర్‌లో 4,000, సంక్రాంతికి 2,000 రైతుల ఖాతాల్లో నేరుగా జమచేస్తామని, కౌలు రైతులకు కూడా ఈ పథకాన్ని అమలుచేస్తామని తెలిపారు. వ్యవసాయ ట్రాక్టర్లకు పన్ను మినహాయింపు, ప్రతి మండలంలో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు కోల్డ్‌స్టోరేజ్‌లను ఏర్పాటుచేస్తామని చెప్పారు.

'విజయ' ఉత్పత్తులకు విస్తృత ప్రచారం

- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో కొత్తగా 500 అవుట్‌లెట్లు
- బోర్డు సమావేశంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

విజయడెయిరీ బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని. చిత్రంలో డెయిరీ చైర్మన్ లోక భూమారెడ్డి, పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా కూడా ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విజయ డెయిరీ పాలు, పాల ఉత్పత్తుల విక్రయాలను మరింతగా పెంచేందుకు విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉన్నదని రాష్ట్ర పాడి, పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. రానున్న రోజుల్లో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో 500 అవుట్‌లెట్లను ప్రారంభించనున్నట్టు తెలిపారు. మంగళవారం బేగంపేటలోని హరిత ప్లాజాలో విజయ డెయిరీ బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సినిమా థియేటర్లు, సోషల్ మీడియా, టీవీల్లో విజయ ఉత్పత్తులపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలని, అలాగే వాల్ పెయింటింగ్స్ చేపట్టడంతోపాటు పర్యాటక ప్రాంతాలు, హైవేలు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలో ప్రచారం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించామన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో విజయ ఉత్పత్తులను మాత్రమే వినియోగించేలా ఆదేశాలు ఇచ్చేందుకు త్వరలో సీఎం కేసీఆర్‌ను కలువనున్నట్టు చెప్పారు. అన్ని ఆలయాల్లో విజయ నెయ్యి వినియోగించేలా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకొంటున్నదని, త్వరలో జరుగనున్న సమ్మక్క సారలమ్మ జాతరలో 150 మొబైల్ ఔట్‌లెట్ల ద్వారా విజయ ఉత్పత్తులు విక్రయించాలని నిర్ణయించినట్టు తెలిపారు. కాగా, ప్రైవేట్ డెయిరీ ఉత్పత్తుల ధరలకు అనుగుణంగా విజయ ఉత్పత్తుల ధరల పెంపుదల నిర్ణయం తీసుకొనే విషయాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సమావేశంలోని నిర్ణయించారు. బోర్డు సమావేశంలో విజయ డెయిరీ చైర్మన్ లోక భూమారెడ్డి, పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, విజయ డెయిరీ ఎండీ శ్రీనివాస రావు, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ వీ లక్ష్మారెడ్డితోపాటు దేవాదాయ, జాతీయ రహదారులు, రైల్వే, హెచ్ఎండీఏ తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తెలుగువర్సిటీ పరీక్షలు వాయిదా

తెలుగుయూనివర్సిటీ: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని దూర విద్యా కేంద్రం ద్వారా నిర్వహించే వార్షికపరీక్షలు వాయిదా వేస్తున్నట్టు కేంద్రం ఇంచార్జి సంచాలకులు ఆచార్య మురళీ కృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలు తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని చెప్పారు.

ప్రవేశాల గడువు పొడిగింపు

2019-20 విద్యా సంవత్సరానికి దూర విద్యా కేంద్రం ద్వారా నిర్వహించే పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల ప్రవేశాలకు ఆలస్యరుసుము లేకుండా అభ్యర్థులు ఈ నెల 31 వరకు ప్రవేశాలు పొందవచ్చని రిజిస్ట్రార్ అలేఖ్య తెలిపారు. మంగళవారం వరకే గడువు ఉండగా ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో పొడిగించినట్టు చెప్పారు.

రామాలయంలో పంచలోహ విగ్రహం చోరీ

తుంగతుర్తి: సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలోని రామాలయంలో పంచలోహ విగ్రహం సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ అర్చకుడు కాటూరి రామాచార్యులు, స్థానిక ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి రామాలయంలో సోమవారం రాత్రి దొంగలు చొరబడి గర్భగుడి తాళాలు పగులకొట్టి 25 కిలోల లక్ష్మణుడి పంచలోహ విగ్రహంతోపాటు దేవతామూర్తుల వెండి, ఇతర ఆభరణాలు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం ఆలయ అర్చకుడు వెళ్లి చూడగా గర్భగుడి తలుపులు తెరిచి ఉండటం గమనించి గ్రామస్థులు, పోలీసులకు సమాచారం అందించారు. విగ్రహం, ఆభరణాల విలువ రూ.15 లక్షలు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు.

'ఓరియంట్' ఎన్నికల్లో టీఆర్ఎస్ ఘనవిజయం

పూస్కూరి రామ్మోహన్‌రావు గెలుపు

రామ్మోహన్‌రావు

కాసిపేట: మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవాపూర్‌లో మంగళవారం జరిగిన ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీఆర్ఎస్ బలపరిచిన పూస్కూరి రామ్మోహన్‌రావు ఘనవిజయం సాధించారు. కంపెనీ మెయిన్‌గేట్ వద్ద యూనియన్ కార్యాలయంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎల్ చతుర్వేది ఆధ్వర్యంలో బ్యాలెట్ పద్ధతిలో ఉదయం ఏడుగంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహించారు. టీఆర్ఎస్ బలపరిచిన ఓరియంట్ సిమెంట్ కార్మిక సంఘం(118) అభ్యర్థి రామ్మోహన్‌రావు.. తన సమీప ప్రత్యర్థి తెలంగాణ ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్(0090) అభ్యర్థి సతీశ్‌రెడ్డిపై 60 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఎన్నికల సరళిని పరిశీలించారు.

రామ్మోహన్‌రావు గెలుపుతో సంబురాల్లో ఓరియంట్ సిమెంట్ కంపెనీ కార్మికులు

మద్యం దుకాణాల దరఖాస్తుకు నేడు ఆఖరు

- ఈ నెల 18న డ్రా తీయనున్న ఎక్సైజ్‌శాఖ
- 2,216 దుకాణాల ఏర్పాటుకు చర్యలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాల టెండర్ దాఖలుకు దరఖాస్తు గడువు బుధవారంతో ముగియనున్నది. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ఒక్కరోజే 10 వేల దరఖాస్తులు వచ్చినట్టు తెలిసింది. దాంతో ఈ నెల 9 నుంచి మంగళవారం వరకు అందిన మొత్తం దరఖాస్తుల సంఖ్య 20,630 కి చేరినట్టు సమాచారం. దరఖాస్తు దాఖలుకు బుధవారం ఒక్కరోజే మిగిలి ఉండటంతో త్వరపడాలని అధికారులు సూచిస్తున్నారు. మద్యం దుకాణాల ఏర్పాటుకు ఈ నెల 9 నుంచి టెండర్ దరఖాస్తులు స్వీకరించేందుకు అన్ని జిల్లాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాల్లో ఎక్సైజ్‌శాఖ ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ సూచనల మేరకు 33 జిల్లాల్లో టెండర్ దరఖాస్తుల స్వీకరణకు 34 కేంద్రాలను నెలకొల్పారు. మద్యం దుకాణాలకు టెండర్లు దాఖలు చేసేవారు నిర్దేశించిన విధంగా ఫారం-ఏ3 (ఏ)లో దరఖాస్తు చేసుకోవాలి. నాన్ రీఫండబుల్ ఫీజు కింద రూ.2 లక్షల డీడీని దరఖాస్తుతో జతచేయాల్సి ఉంటుంది. మద్యం దుకాణాల సంఖ్యలో మార్పు లేకుండా ప్రస్తుతమున్న 2,216 దుకాణాలనే కొనసాగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొన్నది. దరఖాస్తుదారుల నుంచి లాటరీ పద్ధతిలో ఎంపికచేసి దుకాణాలను కేటాయించనున్నారు. ఈసారి జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజులను ప్రభుత్వం ఖరారు చేసింది. గతంలో ఉన్న నాలుగు స్లాబులను ఈసారి ఆరు స్లాబులకు పెంచింది. దరఖాస్తుదారులకు టోకెన్ నంబర్లు కేటాయిస్తున్న అధికారులు.. ఈ నెల 18న డ్రా తీసి మద్యం దుకాణాల లైసెన్స్‌లు కేటాయించనున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాలో పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం మంగళ వారం వైభవంగా ప్రారంభమైంది. ఆలయ ప్రధాన పూజారి సిరిమానును అధిరోహించారు. పైడితల్లి అమ్మవారికి ఏపీ రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి బొత్స సత్యనారాయణ పట్టువస్త్రాలను సమర్పించారు. ఏపీకి చెందిన పలువురు మంత్రులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాలకు ఏపీ, తెలంగాణతోపాటు ఒడిశానుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. - అమరావతి

గ్రామస్థుల దాడిలో దొంగ మృతి

నిజామాబాద్ జిల్లాలో ఘటన

మాక్లూర్: నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం ధర్మోరా గ్రామమహాలక్ష్మి ఆలయంలో సోమవారం రాత్రి చోరీకి యత్నించిన దొంగకు గ్రామస్తులు దేహశుద్ధిచేశారు. దవాఖానలో చికిత్సపొందుతూ మంగళవారం అతడు మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నిజామాబాద్ రూరల్ మండలం అర్సపల్లికి చెందిన కంట గంగాధర్ (28) సోమవారం అర్ధరాత్రి ధర్మోరాలోని మహాలక్ష్మి ఆలయ తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడుతుండగా.. పక్కనే ఉన్న ఆలయ పూజారి కుమారుడు బట్టు పవన్ శబ్దంవిని ఇంట్లో నుంచి బయటకొచ్చాడు. గంగాధర్‌ను చూసి అరువడంతో పరుగెత్తాడు. పవన్ ఇచ్చిన సమాచారంతో గ్రామస్తులు వెంబడించి గంగాధర్‌ను పట్టుకొని చితకబాదారు. రాత్రి 12.45 గంటలకు సర్పంచ్ భర్త .. పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఘటనాస్థలానికి చేరుకొని బాధితుడిని నిజామాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్సపొందుతూ మంగళవారం గంగాధర్ చనిపోయాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వీరికి మూడు నెలల పాప ఉన్నది. గంగాధర్ పాత నేరస్థుడని పోలీసులు తెలిపారు.

విదేశీ సిగరెట్లు స్వాధీనం

భువనేశ్వర్‌లో పట్టుకున్న డీఆర్ఐ హైదరాబాద్ అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డీఆర్ఐ హైదరాబాద్ విభాగం అధికారులు భారీమొత్తంలో నిషేధిత విదేశీసిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఉదయం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో తనిఖీలు జరిపి రూ.12 లక్షల విలువైన విదేశీ సిగరెట్లను పట్టుకున్నారు. మలేషియా నుంచి భువనేశ్వర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి పెద్ద మొత్తంలో విదేశీ సిగరెట్లు తరలిస్తున్నట్టు డీఆర్ఐ అధికారులకు విశ్వసనీయ సమాచారమందింది. అప్రమత్తమైన అధికారులు ఎయిర్‌ఏషియా విమానం ఏకే31లో వచ్చిన రెండు పార్సిళ్లను తనిఖీచేయగా 400 పెట్టెల్లో 80వేల సిగరెట్లు లభ్యమయ్యాయి. ఇవి ఎవరు.. ఎవరికి పంపారన్నదానిపై దర్యాప్తు జరుపుతున్నట్టు అధికారులు తెలిపారు.

విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

నిషేధిత విదేశీ సిగరెట్లను విక్రయిస్తున్న ఓ వ్యాపారిని మంగళవారం ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని అతడి వద్ద రూ. 6 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ చైతన్యకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన సంతోష్‌దేవ్ అష్టల్‌గంజ్ ప్రాంతంలో నివాసముంటూ.. మహాలక్ష్మి మార్కెటింగ్ పేరుతో బేగంబజార్ ప్రాంతంలో సుగంధద్రవ్యాలు విక్రయిస్తున్నాడు. ఈ వ్యాపారంలో ఆశించిన మేర లాభాలు రాకపోవడంతో రెండేండ్లుగా విదేశీ సిగరెట్లను విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు బేగంబజారోని సంతోష్‌దేవ్‌కు చెందిన గోడౌన్‌పై దాడి చేసి 23 రకాలకు చెందిన 3300 సిగరేట్ బాక్సులను పట్టుకున్నారు. నిందితుడిని అరెస్ట్‌చేసి అతని వద్ద నుంచి ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం ఈ కేసును షాహినాయత్‌గంజ్ పోలీసులకు అప్పగించినట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

మంత్రాల నెపంతో లైంగికదాడి

- హైదరాబాద్ పాతబస్తీలో ఘటన
- ఇద్దరు నిందితులు అరెస్ట్, పరారీలో భర్త, అత్తామామలు

చాంద్రాయణగుట్ట: దయ్యం పట్టిందని నమ్మించి ఓ యువతిపై లైంగికదాడికి పాల్పడిన ఘటన హైదరాబాద్‌లోని ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితురాలు, ఫలక్‌నుమా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రకుంట సాదత్‌నగర్‌కు చెందిన బాధితురాలు (20) కొంత కాలంగా వింతగా ప్రవర్తిస్తోంది. ఆమెకు దయ్యం పట్టిందని భావించిన భర్త మహ్మద్ తయ్యబ్ పాషా, అత్తామామలు సరూర్‌నగర్‌కు చెందిన మంత్రగాళ్లు షేక్ మోసిన్, బార్కస్‌కు చెందిన షేక్ మూసా బావజీర్‌లను 2018 డిసెంబర్ 24న కలిసారు. దయ్యం వదిలించడానికి డబ్బులు వద్దన్న మంత్రగాళ్లు.. భర్త, అత్తామామల అంగీకారంతో బాధితురాలిపై ఐదుసార్లు లైంగికదాడికి పాల్పడ్డారు. అఘోరా పేరుతో మరో మంత్రగాడి వద్దకు తీసుకెళ్లగా..అతను కూడా లైంగికదాడికి పాల్పడ్డాడు. మంత్రాల పేరుతో ఇబ్బంది పెడుతున్నారని బాధితురాలు జహానుమాలోని పుట్టింటికి వచ్చింది. ఒమన్‌లో ఉండే ఆమె తండ్రి ఇటీవలే వచ్చాక విషయం తెలియడంతో గత నెల 25న ఫలక్‌నుమా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొన్న పోలీసులు విచారణ చేపట్టి మంగళవారం షేక్ మోసిన్, షేక్ మూసా బావజీర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న భర్త, అత్తామామతోపాటు మరోముగ్గురి కోసం గాలిస్తున్నట్టు ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపారు.

గుప్తనిధుల కోసమేనా?

ఇంట్లో గుప్తనిధులు ఉండటం వల్లే దయ్యం పట్టిందని నమ్మించిన మంత్రగాళ్లు.. వాటిని వెలికితీసేందుకు డబ్బులు డిమాండ్ చేసినట్టు సమాచారం. డబ్బులు లేవని చెప్పడంతో అదనుగా తీసుకొని బాధితురాలిపై లైంగికదాడికి పాల్పడ్డారు. గుప్తనిధులు ఎందుకు దొరుకడంలేదని బాధితురాలి అత్తామామలు, భర్త ప్రశ్నించిన క్రమంలో తప్పించుకొనేందుకు మంత్రగాళ్లు షేక్ మోసిన్, షేక్ మూసా బావజీర్.. తమకు తెలిసిన మరో అఘోరా వద్దకు తీసుకెళ్తే వెంటనే నిధులు దొరుకుతాయని చెప్పారు. సదరు అఘోరా సైతం పూజల పేరుతో బాధితురాలిపై లైంగిక దాడి చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
జిందగీ
బుధవారం 16 అక్టోబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

కలదేముంది? కళ్లు మూసుకుంటే ఎవ్వరైనా కనొచ్చు. కానీ ఈమెది.. కళ్లు తెరిచినా మూసినా ఒకటే ప్రపంచం. అంధకారం. అందరిలా కాదు. అయినా కలతచెందలేదు. కలగన్నది. తన లక్ష్యం కోసం ఎన్ని అవాంతరాలు ఎదురైనా చీకటిని జయించి సరికొత్త రికార్డు సృష్టించింది. భారతదేశపు తొలి అంధ మహిళా ఐఏఎస్ అధికారిగా చరిత్రకెక్కింది. ఈ విజయగాథ వెనుక ఎంతో వ్యథ.. కష్టాల కథ ఉన్నది.

కళ్లు తెరిచి చదవండి ఈమె కథ

మంచి ఉద్యోగం సాధించాలంటే పరీక్షలు పాసవ్వాలి. పోటీని ఎదుర్కోవాలి. ఈ పరీక్షలు అందరికీ ఓ దశలో వచ్చేవే. కానీ ప్రంజల్ పాటిల్ జీవితమే ఓ పరీక్షగా మారింది. చిన్నతనంలోనే ఆమె జీవితాన్ని చీకటి అలుముకున్నది. ఆరేండ్లప్పుడే ఆమెకు వందశాతం దృష్టి లోపించింది. అప్పుడు ఆమె కోల్పోయింది చూపును మాత్రమే మేధస్సును కాదు. చీకటి నిండిన కన్నులతోనే కలలు కన్నది. జీవితంలో చదువుల జ్యోతిని వెలిగించుకుంది. జీవితం అనే పరీక్షలో ప్రతి దశనూ ఎదుర్కొంది. బెగినింగ్, లెర్నింగ్, స్ట్రెంథెనింగ్ అన్ని ఫేజ్‌లను దాటింది. ఇప్పుడు ఓ విజేతగా నిలిచింది. ఆమె ఎదుర్కొన్న ప్రతి ఫేజ్ స్ఫూర్తినిచ్చేదే..

1. Beginning phase

బలహీనమైన కంటి చూపుతో ఆమె జన్మించింది. రోజులు గడిచాయి. ఆడుతూపాడుతూ బడికి వెళ్లింది. బడికెళ్తున్న కొద్ది రోజులకే ఆమె దృష్టి మరింత మసకబారడం ప్రారంభమైంది. సూర్యరశ్మి ఆమె కండ్లను నేరుగా తాకడంతో ఆమె దృష్టిని పూర్తిగా కోల్పోయింది. ఆమెకప్పుడు ఆరేండ్ల వయసు పసి ప్రాయంలోనే ఆమెను చీకటి అలుముకుంది. ఆరేండ్ల వయసులో ఆమెకేం తెలుసు జీవితం అంటే. తల్లిదండ్రులు మాత్రం ఆమె చదువును మధ్యలో ఆపాలనుకోలేదు. కండ్లు లేవని ఆమె జీవితం మధ్యలోనే ఆగిపోవడానికి వారు ఇష్టపడలేదు. మహారాష్ట్రలో అంధుల కోసం ప్రత్యేకంగా నడిపే కమలా మెహతా స్కూల్‌లో చేర్పించారు.

> ప్రంజల్ అసిస్టెంట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నప్పుడే సోదరుని వివాహం అయింది. ఆ వివాహంలో ప్రంజల్, ఆమె భర్త కోమల్ సింగ్ పాటిల్ అందరినీ ఆశ్చర్యపరిచారు. అవయవదానం చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు ఇద్దరూ సంతకాలు చేశారు. అవయవదానం కోసం అందరిలో చైతన్యం కలిగిస్తామని చెప్పారు.

2. Learning phase

'దేశ భవిష్యత్ తరగతి గదిలోనే రూపు దిద్దుకుంటుంది' అన్న మాట ఎంత నిజమో ప్రంజల్ భవిష్యత్తు కూడా ఆ తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంది. పాఠశాలలో చేరిన తర్వాత ఆమె మేధస్సు మెరుగు పడింది. పరీక్షల్లో ఎప్పుడూ ముందుండేది. మహారాష్ట్రలోని ఉల్హాస్‌నగర్‌లో ఇంటినుంచి ఆమె రోజూ పాఠశాలకు హాజరయ్యేది. శివాజీ టెర్మినస్ రైల్వేస్టేషన్ నుంచి ఆమె రోజూ నడుచుకుంటూ వెళ్లేది. అక్కడ ప్రయాణికులు ఆమెకు సాయం చేసేవారు. రైల్లో ఎక్కించడానికి, రోడ్డు దాటడానికి, ఎప్పుడూ ముందుండేవారు. ఇట్లా ఆమె పాఠశాలకు వెళ్లడానికి ఎప్పుడూ ఎక్కువ ఇబ్బంది పడలేదు. తర్వాత చాందీబాయి హిమాత్మల్ మన్సుఖాని కళాశాలలో ఇంటర్ చేసింది. మంచి మార్కులతో పాసైంది. ముంబైలోని సెయింట్ జేవియర్ కళాశాలలో డిగ్రీలో చేరింది. బీఏలో పొలిటికల్ సైన్స్ ఎంచుకుంది.

3. Strengthening phase

ఒక పరీక్షకు సిద్ధమయ్యేటప్పుడు పై రెండు దశలను దాటి సుదీర్ఘ ఫలితం కోసం కష్టపడేదే ఈ మూడో దశ. జీవితపు పరీక్ష రాసేటప్పుడు ఎంత కష్టం వస్తే అంత పోరాడడం ఈ దశలో నేర్చుకుంటాడు మనిషి. సమస్యలకు తగ్గట్టు సత్తా చూపిస్తాడు. ఒక దశలో ఓడిపోయినా, ఇంకో దశలో గెలుస్తాడు. ప్రంజల్ జీవితంలో మూడో దశ ప్రారంభమైంది. డిగ్రీలో పొలిటికల్ సైన్స్‌లో చేరింది. ఇదే సమయంలో ఆమె జీవిత లక్ష్యం ఎంచుకుంది. కాలేజీలో ఓ రోజు ఆమె స్నేహితుడు కలిశాడు. ఇండియన్ ఆడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్) గురించి ఒక ఆర్టికల్ వినిపించాడు. ఆ సమయం ఆమెకు సివిల్ సర్వీస్‌పై ఆసక్తిని పెంచింది. సివిల్ సర్వీస్‌లోనే ఆమె జీవితాన్ని కొనసాగించడానికి నిర్ణయించుకుంది.

ఇప్పుడు సివిల్ సర్వీస్ ఆమె డ్రీమ్. అనుకున్నవెంటనే ఆమె ప్రయత్నాలు చేయలేదు. ఆటలో గెలవడం వేరు, ఉత్తమంగా గెలిచి నిలవడం వేరు. ఆమె సివిల్ సర్వీస్‌లో ఉత్తమంగా నిలవాలనుకుంది. పూర్తిగా సిద్ధమయ్యాకే సివిల్ సర్వీస్ ప్రయత్నాలు ప్రారంభించాలనుకుంది. అందుకే పరీక్షకు సిద్ధమయ్యేంత వరకూ ఆలస్యం చేసింది. డిగ్రీ తర్వాత ఆమె ఢిల్లీలోని జేఎన్‌యూ (జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ) మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్‌లో చేరింది. ఆమె జీవితం పూర్తి చదువుల ప్రపంచంలో వెల్లివిరిసిందక్కడే. 2015లో జేఎన్‌యూలో ఆమె ఎంఫిల్ డిగ్రీ చేస్తున్న క్రమంలో యూపీఎస్‌సీ కోసం ప్రయత్నాలు ప్రారంభించింది. దీని కోసం టెక్నాలజీ సాయం తీసుకుంది. జేఏడబ్ల్యూ (జాబ్ యాక్సెస్ విత్ స్పీచ్) స్క్రీన్ రీడింగ్ సాఫ్ట్‌వేర్‌తో ఆమె పరీక్షలకు సిద్ధమయింది. అక్షరాలను శబ్దంలోకి మార్చి వినిపిస్తుంది ఈ సాఫ్ట్‌వేర్. ఇలా ఆమె సివిల్ సర్వీస్‌కు సిద్ధమైంది. ఈ టెక్నాలజీ చాలా కఠినతరమైందనీ, దీన్ని ఉపయోగించడానికి అవసరమైన పుస్తకాలన్నిటినీ స్కాన్ చేయాల్సి ఉంటుందని ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. దీంతో పాటు ఆమె పరీక్షలు రాయడానికి ఓ సహాయకున్ని పెట్టుకోవాల్సి వచ్చేది. సాధారణంగా పరీక్ష సమయం 3 గంటలు ఉంటే సాయం చేసే వారికి ఎక్కువ సమయం పట్టేది. అందుకే వేగంగా రాసే వారిని వెతికి పట్టుకోవడంలో ప్రంజల్ కొంత ఇబ్బంది ఎదుర్కొన్నది. అలాంటి సమయంలోనే విధూషి అనే మిత్రురాలు ఆసరా అయింది. ఆమె చాలా వేగంగా రాసేది. ఒకవేళ ప్రంజల్ జవాబులు చెప్పడంలో నెమ్మదిగా ఉంటే ఆమె తిట్టేది. అందుకే ప్రంజల్ మరింత వేగంగా జవాబులు చెప్పడానికి సిద్ధమయ్యేది. సివిల్స్‌కు సిద్ధమవుతున్న క్రమంలో ప్రంజల్ ఏ కోచింగ్ సెంటర్‌ల్లో కూడా ప్రత్యేక శిక్షణ తీసుకోలేదు. కేవలం మాక్ టెస్టులకు మాత్రమే హాజరయ్యేది. ఇది ఆమెలో క్రమశిక్షణను పెంపొందించిందని చెప్తుంది.

4. Finishing phase

సివిల్స్ కోసం పూర్తిగా సిద్ధమైన తర్వాత ఆమె 2015లో యూపీఎస్సీ పరీక్ష రాసింది. 773వ ర్యాంకు వచ్చింది. ఐఆర్ఏఎస్ (ఇండియన్ రైల్వే అకౌంట్ సర్వీస్)లో ఉద్యోగం సాధించింది. దీని కోసం 2016 డిసెంబర్‌లో శిక్షణ ప్రారంభవవుతుందని ఆమెకు సమాచారం ఇచ్చారు. కానీ వంద శాతం దృష్టి లోపం ఉన్నవారికి నియమించలేమని ఆమె నియమకాన్ని రద్దు చేశారు. ఇది ప్రంజల్‌కు బాధ కలిగించింది. న్యాయం కోసం ప్రధాని మోడీకి, అప్పటి రైల్వేశాఖ మంత్రి సురేశ్ ప్రభుకు లేఖ రాసింది. ప్రభుత్వం స్పందించింది. కానీ ఆమె ఈ ఉద్యోగానికి తగినట్టుగా భావించలేదు.

5. Achievement

రైల్వే ఉద్యోగం విరమించుకునే సమయంలో ప్రంజల్ జేఎన్‌యూలో పీహెచ్‌డీ చేస్తున్నది. 2017 మరో ప్రయత్నంగా యూపీఎస్సీ పరీక్ష రాసింది. 124వ ర్యాంకు సాధించింది. ఐఏఎస్‌కు అర్హత సాధించిన తొలి అంధ విద్యార్థిణిగా గుర్తింపు పొందింది. 2018లో యూపీలోని లాల్‌బహదూర్‌శాస్త్రీ నేషనల్ అకాడమీ ఆఫ్ ఆడ్మినిస్ట్రేషన్ నుంచి ఐఏఎస్ శిక్షణ మొదటి దశను పూర్తి చేసుకుంది. 2018 మేలో కేరళలోని ఎర్నాకుళం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా విధుల్లో చేరింది. అక్కడ నుంచి తాజాగా అక్టోబర్ 14న తిరువనంతపురం సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించింది. మొదటి రోజు ఆమెకు కలెక్టర్ కె. గోపాల కృష్ణన్ స్వాగతం పలికారు.

...✍ వినోద్ మామిడాల

మేమున్నామనీ.. మీకేం కాదనీ!

ఆనందం..

'చదువు అయిపోయినంక మా బిడ్డెను అమెరికా పంపిస్తాం'
'మా కొడుకు ఢిల్లీలోనే సెటిల్ అయ్యిండు'

ఆరాటం..

'మా బిడ్డె ఆస్ట్రేలియా నుంచి ఏమో పంపిందంట కొంచెం తెలుసుకో నాయనా'
'మా కొడుకు డబ్బులు పంపిస్తా అన్నడు.. వచ్చినయా కొంచెం చూడమ్మా'

ఆవేదన..

'అంత గావురంగా పెంచి పెద్ద చేస్తే.. వాళ్లు అమెరికాలో.. మేం ఇక్కడ'
'ఢిల్లీ ఎంతదూరం? ఎప్పుడు చూసినా బిజీ బిజీ. యాడాదికొక్కసారి కూడా రాకపాయె'

ఇలా.. ఓదార్పు లేక నిట్టూర్పుతో సహవాసం చేస్తున్న తల్లిదండ్రులు ఎక్కడో అక్కడ తారసపడుతూనే ఉన్నారు. ఆశ రేకెత్తి ఆనందంగా పిల్లల్ని తమకు దూరంగా వేరే రాష్ట్రాలకు.. వేరే దేశాలకు పంపుతారు. తర్వాత వారికోసం ఆరాటపడుతారు. బిజీ లైఫ్‌లో తల్లిదండ్రులను కలవలేక.. చూడలేకపోతున్న పిల్లలకు సైతం పేరెంట్స్‌కు ఏ లోటూ లేకుండా చూసుకోవాలి అనిపిస్తుంది. ఎప్పటికప్పుడు డబ్బులు.. కావాల్సిన సామగ్రి అందేట్లు చొరవ చూపిస్తుంటారు. కానీ కలిసేది లేదు.. వారిని చూసుకునేది లేదు. ఆయుష్షు మీద పడి.. అనారోగ్యం దరిచేరి ఒంటరిగా ఉంటున్న పేరెంట్స్‌కు ఆసరా అవుతూ తోడుగా నిలుస్తున్నది అన్వయ డాట్ కామ్. ఇదొక స్టార్టప్ సంస్థ.

తోడుగా నిలుస్తూ..

పిల్లలు కళ్లెదుట లేకపోతే తల్లిదండ్రులకు ఎప్పుడూ ఏదో లోటు కనిపిస్తుంది. కనీసం మనవలు.. మనవరాండ్లతో అయినా కాలక్షేపం చేద్దామా అనుకుంటే అందరూ ఎక్కడో సుదూర ప్రాంతాల్లో ఉంటారు. చేతగాని వయసులో ఓ పెండ్లికి పోలేరు.. పేరంటానికి పోలేరు. ఏ కాళ్ల నొప్పులో.. బీపీ.. షుగర్ తిప్పలో పరీక్ష చేయించుకోవడానికి హాస్పిటల్‌కు కూడా వెళ్లలేని పరిస్థితి. తినడానికైనా అన్నం వండుకోలేరు.. అలాగనీ బయట నుంచి తెచ్చుకునే ఓపిక ఉండదు. ఏ ఆర్నెళ్లకోసారో బయటకు వెళ్లి మనసు కుదుట పడేసుకుందామనుకుంటే తీసుకెళ్లేవారెవరు? అనే ప్రశ్న దగ్గరే ఆగిపోతారు. ఇలాంటి పనులన్నీ మేం చేసి పెడతాం.. మిమ్మల్ని కన్న బిడ్డల్లా చూసుకుంటా అని భరోసా ఇస్తున్నది అన్వయ డాట్ కామ్. పొద్దున పలకరింపు నుంచి పాలబిల్లు దాకా.. ఆరోగ్య పరీక్ష నుంచి ఆరు బయట పిక్‌నిక్ దాకా.. అన్నింట్లో ఆసరా అవుతూ పిల్లలు దగ్గరా లేని లోటు పూడుస్తున్నది అన్వయ.

ఏమేం చేస్తారు?

అన్వయ డాట్ కామ్ సంస్థ ఆధ్వర్యంలో పేరెంట్స్‌ను చూసుకోవడానికి ప్రతి ఆరు కుటుంబాలకు ఒక కేర్ మేనేజర్.. నర్సు.. సెక్యూరిటీ ఆఫీసర్ పర్యవేక్షణ ఉంటుంది. ఇరవై నాలుగు గంటలూ నర్స్ పర్యవేక్షణలో ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు జరుగుతాయి. హృద్రోగులుంటే దవాఖానాలు ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా ఎమర్జెన్సీ సేవలు అందిస్తారు. 105 ఎమర్జెన్సీ కేసుల్లో 98 శాతం సక్సెస్ సాధించారు. కాల్ సెంటర్ నుంచి మెడిసిన్స్ వాడుతున్నారా? ఇంట్లో ఏం సమస్యలున్నాయి? అంటూ ఇంటి సభ్యుల్లా పలకరించి వారి యోగక్షేమాలు చూసుకుంటున్నారు. అలా చూసుకోవడానికి కేర్ టేకర్స్ అన్వయలో ప్రస్తుతం 42 మంది ఉన్నారు. వీరికి డబ్బు కన్నా సేవా భృక్పథం ముఖ్యం. వీరు తెలంగాణ పోలీస్ వారి హాక్‌ఐలో నమోదై ఉన్నారు కూడా.

ఎలాంటి ప్లాన్స్?

జూబ్లీహిల్స్‌లో అన్వయ కేర్ సెంటర్ ఉంది. దీని ద్వారా తమ పేరెంట్స్‌కు సేవలు అందాలి అనుకునేవారు www.anvayaa.com ద్వారా పేరు నమోదు చేసుకోవాలి. అన్ని సేవలు హోం డెలివరీ ఉంటాయి. మూడు దశల్లో 24x7 సేవలు అందిస్తారు. హెల్త్‌ప్లాన్‌లో.. హెల్త్ కేర్ అసిస్టెంట్లు, డాక్టర్లు, అంబులెన్స్, ఫార్మసీలు, హోం హెల్త్ కేర్, డయాగ్నస్టిక్ సెంటర్లు, హాస్పిటల్స్, డెంటిస్టులు అందుబాటులో ఉంటారు. హోం కేర్ అసిస్టెంట్స్ ప్లాన్‌లో సాధారణ అవసరాలేంటో సమకూరుస్తారు. ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రిషియన్స్ ఈ ప్లాన్‌లో ఉంటారు. కుకింగ్, బిల్ పేమెంట్స్, బర్త్ డే సెలబ్రేట్స్ వంటి సేవలు అందిస్తారు. ప్రతీది అన్వయ యాప్‌కు అనుసంధానం చేస్తారు.

ఆలోచన ఎలా వచ్చింది?

అన్వయ ఫౌండర్ ప్రశాంత్‌రెడ్డి. ఒక్కడే కొడుకు. చదువు పూర్తయిన తర్వాత అమెరికా వెళ్లి.. పలు దేశాల్లో ఉద్యోగం చేశాడు. పేరెంట్స్ హైదరాబాద్‌లో.. అతను విదేశాల్లో. పేరెంట్స్‌కు ఏ అవసరం వచ్చినా ఇతరుల సహాయం తీసుకునేవాడు. ప్రతీసారి ఇతరులపై ఆధారపడటం నచ్చలేదు. అమెరికా, ఆఫ్రికా, యూరప్, కెనడాలో టాటా కన్సల్టెన్సీ కంపెనీలో పది సంవత్సరాల పాటు పనిచేసి ఇండియాకు వచ్చేశాడు. తాను ఒకప్పుడు ఎలాగైతే తల్లిదండ్రులకు సేవలందించాలని వేడుకున్నాడో.. స్నేహితుల నుంచి కూడా తనకు అవే రెక్వెస్ట్‌లు వచ్చాయి. 'నేనైతే తీరిక చేసుకొని వచ్చేశాను కానీ.. నాలాగ అందరూ రాలేరు కదా? ఏదైనా పరిష్కారం కనుక్కొని ఒంటరిగా బతుకీడుస్తున్న నా తల్లిదండ్రుల్లాంటి వారికి ఆసరా అవ్వలేనా?' అని ఆలోచించి 'ఒన్‌స్టాప్ సీనియర్ కేర్ ప్లాట్‌ఫామ్' ఏర్పాటుచేసి.. 400 కుటుంబాలపై సర్వే చేసి అన్వయ డాట్ కమ్ రూపొందించాడు. అన్వయ అంటే సంస్కృతంలో కుటుంబం అని అర్థం.

లక్షమంది మా లక్ష్యం

> రూ. 60 లక్షలతో దీనిని ప్రారంభించాం. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు కేంద్రంగా సేవలందిస్తున్నాం. ప్రస్తుతం 800 కుటుంబాలకు అన్వయ సేవలు అందుతున్నాయి. వచ్చే మూడేండ్లలో పుణె, ముంబై, ఢిల్లీ నగరాల్లోనూ మా సేవల్ని విస్తరిస్తాం. ఒక కుటుంబానికి ఏడాదికి రూ. 45వేల నుంచి రూ.1,50,000 వరకు ప్యాకేజీ ఉంటుంది. సభ్యులు ఎంతమంది ఉన్నా ప్యాకేజీ ఒకేవిధంగా ఉంటుంది. లక్ష మందికి సేవ చేయాలన్నది మా లక్ష్యం. అన్వయ సేవల గురించి తెలుసుకోవాలనుకుంటే +91 7288818181 నంబర్ ద్వారా సంప్రదించవచ్చు.
>
> –ప్రశాంత్‌రెడ్డి

...✍ వర్ధెల్లి బాపురావు, సిటీబ్యూరో
📷 చిన్న యాదగిరి గౌడ్

తొక్కే కదాని పారేయకండి..

> మనలో చాలామందికి అరటిపండు తినడం ఎంత అలవాటో దాని తొక్కను పడేయడం అంతే అలవాటు. కానీ అరటి తొక్కతో చాలా ప్రయోజనాలున్నాయి. అవేంటంటే..

- అరటి పండులోని తొక్కలో పీచు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. దీన్ని తినడం వల్ల సాఫీగా మలవిసర్జన అవుతుంది. అరటి పండు తొక్కను తినలేకపోయినా దాని లోపలి భాగంలో ఉండే తెల్లని పదార్థాన్ని స్పూన్‌తో తినడం వల్ల కూడా ఫలితం ఉంటుంది.
- దంతాల మెరుపునకు అరటిపండు తొక్క లోపలి భాగాన్ని దంతాలపై రుద్దాలి. రెండు వారాల పాటు ఇలా చేయడం వల్ల దంతాలు తెల్లగా మెరుస్తాయి. అరటి పండు తొక్కలోని లోపలి భాగాన్ని తినడం వల్ల రాత్రిళ్లు బాగా నిద్రపడుతుంది.
- వయసు పెరిగే కొద్ది కంటిచూపు మందగిస్తుంది. అరటిపండు తొక్క లోపలి భాగాన్ని తినడం వల్ల దృష్టి సంబంధ సమస్యలు తగ్గుతాయి. అరటి తొక్కలో ల్యూటిన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది అతి నీలలోహిత కిరణాల ప్రభావం నుంచి కంటిని కాపాడుతుంది.
- అరటి తొక్కలోని పీచు పదార్థాలు గుండె జబ్బులు రాకుండా కాపాడుతాయి. ఇవి కొలెస్ట్రాల్‌ను కరిగిస్తాయి. ఫలితంగా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. పులిపిర్లపై అరటి తొక్కను ఉంచి దానిపైనుంచి బ్యాండ్ ఎయిడ్‌తో పట్టీలా వేయాలి. ఇలా కొద్దిరోజులు చేయడం వల్ల పులిపిర్లు తొలగిపోతాయి.

మెదడులో గడ్డకు రేడియోసర్జరీ మంచిదేనా?

అడుగండి చెబుతా

> నా వయసు 45 సంవత్సరాలు. ఈ మధ్య తలనొప్పి ఎక్కువగా ఉంటే డాక్టర్‌ను కలిసాను. మెదడులో గడ్డ పెరుగుతున్నట్టు గుర్తించారు. పరీక్షల తర్వాత అది క్యాన్సర్ కాదని, బినైన్ ట్యూమర్ అంటారని చెప్పారు. అయితే దీనికి సిటీలో స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ చేయాలని అన్నారు. క్యాన్సర్ కాకపోయినా మెదడులో గడ్డ అంటే భయమవుతుంది. ఈ సర్జరీ వల్ల ఇబ్బందులేమైనా ఉంటాయా? హైదరాబాద్‌లో చేస్తారా? వివరంగా తెలుపండి.
>
> - జె. సూర్యనారాయణ రావు, ఆందోల్

మీరు మీ మెదడులో గడ్డ గురించి ఆందోళన చెందవద్దు. దీనికి చాలా మంచి చికిత్స అందుబాటులో ఉంది. మెదడులో గడ్డను తీసేయడానికి ప్రస్తుతం రేడియోసర్జరీ వంటి అత్యాధునిక చికిత్సలు వచ్చాయి. క్యాన్సర్‌తో సంబంధం లేని, నిరపాయకరమైన బినైన్ బ్రెయిన్ ట్యూమర్లను (3 సెం.మీ. లోపు సైజు) తొలగించడానికి ఇది మంచి చికిత్స. అంతేకాదు.. శరీరంలోని ఇతర భాగంలో ఏర్పడిన క్యాన్సర్ మెదడుకు విస్తరించడం వల్ల ఏర్పడే మెటాస్టాటిక్ బ్రెయిన్ డిసీజ్‌కు కూడా ఇది మేలైన చికిత్స.

స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీలో రోగి శరీరంపైన ఎటువంటి కోతలు ఉండవు. పుర్రెకు కోత లేకుండా మెదడుకు శస్త్రచికిత్స చేయడం వల్ల ఏమాత్రం రక్తనష్టం లేకుండా సర్జరీ పూర్తవుతుంది. కంప్యూటర్ సహాయంతో పనిచేసే ప్రత్యేక పరికరాలను ఉపయోగిస్తూ మెదడులోని గడ్డను టార్గెట్‌గా చేసుకుని ఈ శస్త్రచికిత్స చేస్తారు. గడ్డ పరిమాణాన్ని బట్టి దీన్ని ఒకటి నుంచి అయిదుసార్లు చేయాల్సి ఉంటుంది. చికిత్స చేయించుకున్న రోజునే ఇంటికి వెళ్లిపోవచ్చు. స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ చాలా సురక్షితమైంది. ఎటువంటి సైడ్ ఎఫెక్టులూ ఉండవు. కాబట్టి మీకు ఎలాంటి సందేహాలూ అవసరం లేదు. హైదరాబాద్‌లో ఈ సర్జరీ అందుబాటులో ఉంది.

డాక్టర్ రవి సుమన్ రెడ్డి
సీనియర్ న్యూరో అండ్ స్పైన్ సర్జన్
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్

నమస్తే తెలంగాణ
యువ
[కరీంనగర్]
బుధవారం 16 అక్టోబర్ 2019

ఏం డైలాగ్ గురూ..



ఆశ క్యాన్సర్ ఉన్నవాడిని కూడా బతికిస్తుంది. భయం అల్సర్ ఉన్నవాడిని కూడా చంపేస్తుంది.
సినిమా: (జులాయి)

వాట్సప్ మెసేజ్

జీవితమంటే మనకోసమే కాదు మన అనుకునే వారికోసం కూడా బతకడం. ప్రేమంటే డబ్బు, అందం కాదు. ప్రేమంటే ఒక నమ్మకం. ఐశ్వర్యమంటే డబ్బు సంపాదించడం కాదు. ఇతరుల ప్రేమాభిమానాలు సంపాదించడం. సంతృప్తి అంటే నచ్చిన దానికోసం వెంటపడడం కాదు ఉన్నదానితో ఆనందించడం.

మంచిమాట



నాకు సాయం చేయడానికి రాని వారందరికీ కృతజ్ఞతలు. ఎందుకంటే వారివల్లనే నేను సొంతంగా పనిచేయడం నేర్చుకోగలిగాను.

- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

నవ్వుకొందాం

రాజు కొత్తగా సిటీకి వచ్చాడు. స్నేహితులతో కలిసి ఓ రెస్టారెంట్‌కు వెళ్లాడు.

వెంకట్ : ఏం చేస్తున్నావ్ రా అక్కడ? త్వరగా చేతులు కడుక్కొని రా..!

రాజు : వస్తున్నా.. బేసిన్‌ను క్లీన్ చేస్తున్నా..

వెంకట్ : ఎందుకు?

రాజు: ఇక్కడ 'వాష్ బేసిన్' అని రాసుంది..

టెక్నాలెడ్జీ

వన్‌ప్లస్ 7టీ ప్రో

వన్‌ప్లస్ 7టీ ప్రో విడుదలైంది. ఆధునిక ఫీచర్లతో ఇది ఆకట్టుకుంటున్నది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, వన్‌ప్లస్ స్టోర్లలో అందుబాటులో ఉంది.

వన్‌ప్లస్ 7టీ ప్రో ఫీచర్లు..

డిస్‌ప్లే	6.67 అంగుళాలు, గొరిల్లా గ్లాస్ ప్రొటెక్షన్
ప్రాసెసర్	క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 855 ప్లస్
ఓఎస్	ఆండ్రాయిడ్ 10
కెమెరా	48ఎంపీ + 16ఎంపీ + 8ఎంపీ (మూడు కెమెరాలు)
సెల్ఫీ కెమెరా	16 మెగాపిక్సల్
మెమొరీ	8 జీబీ ర్యామ్
స్టోరేజీ	256 జీబీ స్టోరేజ్
బ్యాటరీ	4085 ఎంఏహెచ్ బ్యాటరీ,
ధర	రూ.53,999

శాశ్వతంగా చెరిపేయండి!

గూగుల్ మ్యాప్స్

గూగుల్ మ్యాప్స్‌లో మీరు ఏదైనా లొకేషన్ సెర్చ్ చేస్తున్నారా? గూగుల్ మ్యాప్స్ రీజియన్లవారీగా ఎప్పటికప్పుడూ లొకేషన్లను ట్రాక్ చేస్తుంటుంది. మీ డేటాను గూగుల్ ట్రాక్ చేయకుండా ఉండాలంటే మీరు క్రోమ్ బ్రౌజర్‌లో incognito mode టర్న్ ఆన్ చేసి సెర్చ్ చేయండి.

- క్రోమ్ incognito mode (Shift +Ctrl+N) ఓపెన్ చేయండి.
- ఇందులో సెర్చ్ చేస్తే.. గూగుల్ మీ డేటా యాక్టివిటీని ట్రాక్ చేయలేదు.
- మీరు ఎక్కడికి ట్రావెల్ చేస్తున్నారు? ఏ లొకేషన్‌లో ఉన్నారో ట్రాక్ చేయలేదు.

యూట్యూబ్ :

గూగుల్ సొంత సర్వీసుల్లో యూట్యూబ్ ఒకటి. మీరు సెర్చ్ చేసిన ప్రతి వీడియో అందులో స్టోర్ అవుతుంది. సెర్చ్ చేసిన డేటా డిలీట్ చేసుకోవాలంటే కొత్త టూల్ ద్వారా పూర్తిగా క్లీన్ చేసుకోవచ్చు.

- యూట్యూబ్ లాగిన్ అయ్యాక.. My activity ఓపెన్ చేయండి.
- Change how long you keep బటన్ పై క్లిక్ చేయండి.
- 3 నెలలు తర్వాత హిస్టరీని ఆటోమాటిక్ డిలీట్ చేసుకోవచ్చు.
- 18 నెలల తర్వాత ఆటోమాటిక్ డిలీట్ సెట్ చేసుకోవచ్చు.
- Next బటన్ క్లిక్ చేయాలి.
- Delete Future, Delete Now అనే రెండు ఆప్షన్లు కనిపిస్తాయి.
- కావాల్సిన ఆప్షన్ పై క్లిక్ చేయండి. Confirm బటన్ క్లిక్ చేయండి. ఇలా వీడియోల హిస్టరీని మొత్తం క్లీన్ చేసుకోవచ్చు.

గూగుల్ అసిస్టెంట్ :

- వాయిస్ కమాండ్స్ ద్వారా ఈ అసిస్టెంట్ యాక్టివిటీని వెంటనే డిలీట్ చేసుకోవచ్చు.
- గూగుల్ అసిస్టెంట్ నుంచి ఏదైనా సెర్చ్ చేయాలంటే.. Hey Google అని వాయిస్ కమాండ్ ఇస్తుంటారు.
- Hey Google.. delete the last thing i said to you అని వాయిస్ కమాండ్ ఇస్తే చాలు.. అప్పటివరకూ సెర్చ్ చేసినా డేటా మాత్రమే డిలీట్ చేస్తుంది.

గూగుల్‌లో ఏది సెర్చ్ చేసినా అంతా స్టోర్ వుతుంది. మీ బ్రౌజర్ క్లీన్ చేసినప్పటికీ గూగుల్ ప్లాట్‌ఫాంపై మీ ప్రైవసీ డేటా అలానే ఉంటుంది. అది డిలీట్ కాదు. అయితే మాన్యువల్‌గా డిలీట్ చేసుకోవచ్చు. గూగుల్ మ్యాప్స్, యూట్యూబ్, అసిస్టెంట్ ప్లాట్‌ఫాంల్లో స్టోర్ అయిన యూజర్ డేటాను ఎలా డిలీట్ చేయాలో ఓసారి చూద్దాం.

నాయిస్ నుంచి స్మార్ట్‌వాచ్‌లు

స్మార్ట్ యాక్సరీస్ తయారీదారు నాయిస్.. కలర్‌ఫిట్ ప్రొ 2 పేరిట ఓ నూతన స్మార్ట్‌వాచ్‌ను భారత్‌లో విడుదల చేసింది. ఇందులో 1.3 అంగుళాల ఎల్‌సీడీ టచ్ స్క్రీన్ డిస్‌ప్లే, ఆండ్రాయిడ్, ఐఓఎస్ కనెక్టివిటీ, బ్రీత్ ఫీచర్, 9 రకాల స్పోర్ట్స్ మోడ్స్, యాక్టివిటీ ట్రాకర్, 24 అవర్ హార్ట్ రేట్ మానిటర్, స్టెప్ కౌంటర్, స్లీప్ ట్రాకర్, స్మార్ట్‌ఫోన్ నోటిఫికేషన్లు, ఐపీ 68 వాటర్, డస్ట్ రెసిస్టెన్స్, 7 నుంచి 10 రోజుల వరకు బ్యాటరీ బ్యాకప్ తదితర ఫీచర్లను అందిస్తున్నారు. రూ.2,999 ధరకు ఈ వాచ్‌ను వినియోగదారు సొంతం చేసుకోవచ్చు.

మెడికల్ కోడింగ్...ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రాచుర్యంలోకి వస్తున్న ఉద్యోగం. ఇండియాలో అంతగా గుర్తింపు లేనప్పటికీ ఇప్పుడిప్పుడే ఇక్కడ కూడా వేళ్లూనుకుంటున్నది. బీఎస్సీ, మైక్రో బయాలజీ, లైఫ్‌సైన్స్, బీఫార్మసీ, బయోటెక్నాలజీ, ఫిజియో థెరఫీ, నర్సింగ్ వంటి వైద్య సంబంధ కోర్సులు చదివిన వారికి ఈ రంగంలో అవకాశాలు ఎక్కువ. మెడికల్ కోడింగ్ బిల్లింగ్ విధానంలో కొత్తగా అనేక ఉద్యోగాలు పుట్టుకొస్తున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా మెడికల్ కోడింగ్ రంగంలో యువతను స్థిరపర్చేందుకు మెడిసన్ హెల్త్‌కేర్ సంస్థ కృషి చేస్తున్నది. వేలాదిమందికి శిక్షణనిస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు ఆ సంస్థ అధినేత డాక్టర్ సంతోష్‌కుమార్ గుప్త.

ఉన్నచోటే ఉపాధి

మెడికల్ కోడింగ్ విదేశాల్లో అత్యంత ప్రాచుర్యం పొందింది. ఆయా దేశాల్లో ఈ ఉద్యోగం చేసేవారు తక్కువ. అందుకని అక్కడి ఇన్సూరెన్స్ కంపెనీలు మన ప్రాంత యువతను ఉద్యోగాల్లో చేర్చుకుంటున్నాయి. భారీ ప్యాకేజీలు ఇస్తున్నాయి. ఆయా కంపెనీలకు మెడికల్ కోడింగ్ పనిచేసేందుకు ఓ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఇందుకోసం మెడిసన్ హెల్త్‌కేర్ సంస్థ శిక్షణ అందిస్తున్నది. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు మూడు నెలలు. తెలుగు మీడియం విద్యార్థులకు ఆరునెలల కోచింగ్ ఇస్తారు. అవకాశాలను బట్టి ఉద్యోగాలనూ కల్పిస్తారు.

అసలేంటీ మెడికల్ కోడింగ్

మనకు జబ్బు చేస్తే హాస్పిటల్‌కు పరిగెడతాం. అవసరమున్నా లేకున్నా.. కొన్ని టెస్టులు జరిగిపోతుంటాయి. పరిస్థితిని బట్టి అడ్మిట్ చేసుకుంటారు. లేదంటే మందులిచ్చి పంపించేస్తారు. చికిత్స అనంతరం బిల్లు కడతాం. హెల్త్‌కార్డులు ఉంటే బిల్లులు పెట్టుకుంటాం. అప్రూవల్ అయితే అక్కడికే ఆనందపడతాం. మళ్లీ కొన్నాళ్లకు జబ్బు చేస్తే పాత పద్ధతినే అనుసరిస్తాం. అయితే విదేశాల్లో అలా కాదు. పుట్టిన పాపాయి నుంచి పండుటాకుల వరకు అందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ ఉండాల్సిందే. ఇది ఆయా దేశాల్లోని నిబంధన. ఇతర దేశాల్లో హాస్పిటల్‌కు వెళ్తే ఆస్పత్రి సిబ్బంది రోగి హెల్త్ ఇన్సూరెన్స్ నంబర్, అనారోగ్య కారణాలు, పూర్తి డేటా సేకరిస్తారు. ఆ తర్వాత పేషెంట్ ట్రీట్మెంట్ తీసుకుని ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా వెళ్లిపోతాడు. హాస్పిటల్ యాజమాన్యం వారి చికిత్సకైన ఖర్చుల్ని ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి తీసుకుంటుంది. ఆయా హాస్పిటల్స్ ఇన్సూరెన్స్ కంపెనీలకు బిల్లులు పెట్టుకుంటాయి. ఈ క్రమంలో హాస్పిటల్స్ పెట్టుకున్న బిల్లుల్ని నిర్ధారించేందుకు ఒక కోడింగ్ వ్యవస్థ ఉంటుంది. కోడ్స్‌ను ఉపయోగించి బిల్లులను కోడర్స్ అప్రూవల్ చేస్తుంటారు. మెడికల్ వ్యవస్థలో ప్రతి వ్యాధికి ఒక కోడ్ కేటాయించి ఉంటుంది. వ్యాధి తీవ్రతను, స్థాయిని నిర్ధారించే వారిని మెడికల్ కోడర్స్ అంటారు.

కోడింగ్ వర్క్ మనకే ఎందుకిస్తున్నారు?

అమెరికాలో ఉద్యోగులకు డిమాండ్ ఎక్కువ. మన దగ్గర చెల్లించే జీతంతో పోలిస్తే దాదాపు పది రెట్లు అక్కడి ఉద్యోగులకు చెల్లించాల్సి ఉంటుంది. అమెరికాలో రాత్రయితే మన దగ్గర పగలు. అక్కడి వారు నిద్రించే సమయంలో మన దగ్గర కోడింగ్ చేసి పంపవచ్చు. వీటన్నింటి కంటే మన దగ్గర అంకితభావంతో పనిచేసే యువత ఎక్కువ. మెడికల్ కోడింగ్ సిస్టమ్ మన దగ్గర అమలులో లేదు. అయినప్పటికీ కొన్ని కంపెనీలు ఇక్కడి యువతకు ఉద్యోగాల్ని ఆఫర్ చేస్తున్నాయి. నెలకు రూ. 15 వేలు నుంచి రూ.70 వేల వరకు ఇచ్చి ఉద్యోగాల్ని ఆఫర్ చేస్తున్నాయి. ప్రతీ ఏటా CPC (Certified Professional Coder) లో ఉత్తీర్ణులయ్యే వారికి ఈ అవకాశం లభిస్తున్నది.

సీపీసీలో ఉత్తీర్ణులయ్యేలా తీర్చిదిద్దుతారు!

సంతోష్‌కుమార్ గుప్త హైదరాబాద్ వాసి. ఆయన మెడిసన్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభించి పదేళ్లుగా శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు 5 వేల మందికి శిక్షణ ఇచ్చారు. ఇందులో 80 శాతం మందికి ఉద్యోగాలొచ్చాయి. సీపీసీలో ఉత్తీర్ణులయ్యేలా విద్యార్థుల్ని తీర్చిదిద్దడంలో ఆయన విజయం సాధిస్తున్నారు. 1999లో సంతోష్‌కుమార్ ఒక మెరిట్ వైద్య విద్యార్థి. ఆయన తండ్రి ఒక బట్టల దుకాణంలో సేల్స్‌మన్‌గా పనిచేసేవారు. తన కొడుకును ప్రయోజకుడిగా తీర్చిదిద్దాలనే తండ్రి ఆశయాన్ని నీరు గార్చలేదు సంతోష్‌కుమార్. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి అమెరికా వెళ్లి ప్రతిభతో యూఎస్ సర్టిఫైడ్ కోడర్‌గా పేరు పొందారు. అంత సాధించినా మనసులో ఏదో వెలితి. తన పురిటిగడ్డకు ఏదో చేయాలనే ఆలోచన అతడిని ఓ పట్టాన నిద్రపోనివ్వలేదు. ఆ సమయంలోనే కొంత మంది మెడిసిన్ చదివిన వాళ్లు, సైన్స్ స్టూడెంట్స్ సంతోష్‌ను ఉపాధి అవకాశాలు కల్పించమని అడిగారు. అప్పుడప్పుడే అమెరికాలోని కొన్ని ఇన్సూరెన్స్ కంపెనీలు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల మీద కన్నేశాయి. ఆయా ప్రాంతాల యువతతో మెడికల్ కోడింగ్ చేయించుకునేవి. అక్కడితో పోలిస్తే చాలా తక్కువ మొత్తం చెల్లించేవి. 2003లో సంతోష్ తిరిగి హైదరాబాద్ వచ్చారు. స్థానికంగా ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తూ మధ్యమధ్యలో అమెరికా వెళ్లివచ్చేవారు. అక్కడి కంపెనీల్లో కోడింగ్ పనులను చూసుకునేవారు. ఆ తర్వాత తానే కంపెనీ పెట్టి వేలాది మందికి ఉపాధి కల్పించాలని అనుకున్నారు. కానీ స్థానిక యువతకు మెడికల్ కోడింగ్ గురించి తెలియదనే విషయాన్ని గమనించాడు. ఆర్థికంగా పరిస్థితులు అనుకూలించకపోవడంతో కంపెనీ ఆలోచనను పక్కన పెట్టేశారు. 2009 వరకు ఓ ఎంఎన్‌సీ కంపెనీలో పనిచేశారు.

విద్యార్థుల్ని తీర్చిదిద్దారిలా..

2009లో హిమాయత్‌నగర్‌లో 'MEDESUN' కోచింగ్ సెంటర్ ప్రారంభించారు. మొదటి బ్యాచ్‌లో 40 మంది శిక్షణ పొందితే 40 మంది ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఆ తర్వాత అమీర్‌పేటకు ఇన్‌స్టిట్యూట్‌ను మార్చారు. మూడు నెలల మెడికల్ కోడింగ్ కోర్సులో మెడికల్ బిల్లింగ్, ఆస్ట్రేలియా కోడింగ్, ఆడిటింగ్, రిస్క్ అడ్జెస్ట్‌మెంట్ కోడింగ్, హాస్పిటల్ కోడింగ్ నేర్పిస్తారు. ఆయన దగ్గర శిక్షణ పొందిన వారిలో అత్యధికంగా ఏడాదికి రూ. 20 లక్షలు వేతనం తీసుకునే వారు కూడా ఉన్నారు. మెడికల్ కోడింగ్‌లో లక్షాయాభై వేల కోడ్స్ ఉంటాయి. వీటిని సులభమైన మార్గంలో కోచింగ్‌లో నేర్పిస్తారు. సీపీసీ(Certified Professional Coder) ఎంట్రన్స్‌కు విద్యార్థుల్ని సిద్ధం చేస్తారు. దేశవ్యాప్తంగా జరిగే ఈ పరీక్షకు హైదరాబాద్‌లో సెంటర్ కూడా ఉన్నది. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే కోటివీటీ, ఎక్లాట్, విప్రో, డిలైట్, డబ్ల్యూఎన్ఎస్, విజన్2కే, మెడ్‌స్పేస్ తదితర కంపెనీలు మెడికల్ కోడర్స్‌కు శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తాయి. అంతేకాకుండా ఆన్‌లైన్ ద్వారా అమెరికా, దుబాయ్‌లోని విద్యార్థులకు సైతం సంతోష్ శిక్షణ ఇస్తున్నారు. అమెరికాలో ఉన్న మెడిసన్ బ్రాంచి ద్వారా అక్కడి విద్యార్థులు శిక్షణ పొందుతారు. ఇతర దేశాల్లోని అన్ని ప్రముఖ నగరాల్లో సైతం ఉద్యోగాల్ని కల్పిస్తున్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు!

డాక్టర్‌గా, బోధకుడిగా సంతోష్‌కుమార్ విధులు నిర్వహిస్తూనే 43 డిగ్రీలు సాధించారు. ఈ రంగంలో ఇప్పటివరకు ఇన్ని డిగ్రీలు పొందిన మొదటి వ్యక్తిగా సంతోష్ నిలిచారు. సీసీఎస్-పీ, సీసీఎస్, సీపీసీ, సీవోసీ, సీఐసీ, ఎఫ్ఎన్ఆర్, సీజీఎస్సీ, ఆర్ఎంఏ ఇలా పలు డిగ్రీలు పొందారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సైతం చోటు దక్కించుకున్నారు. ఏహెచ్ఐఎంఏ ఐసీడీ-10 మొదటి ట్రైనర్‌గా కూడా సంతోష్‌కుమార్ గుర్తింపు పొందారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న తన స్నేహితుల ద్వారా కోడింగ్‌లో విద్యార్థులకు ఉపాధి కల్పిస్తున్నారు. తెలంగాణలోని పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు అనేక మంది ఉద్యోగాల్లో స్థిరపడేందుకు చేయూతనిచ్చారు. అత్యధిక డిగ్రీలు సాధించిన వ్యక్తిగా రాష్ట్రంలో సంతోష్‌కుమార్‌కు మంచి గుర్తింపు ఉంది.

మీరూ శిక్షణ పొందొచ్చు.. సైన్స్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న విద్యార్థులు ఎవరైనా మెడికల్ కోడింగ్ ద్వారా ఉపాధి పొందవచ్చు. తెలుగు మీడియం వారికి ప్రత్యేక శిక్షణ కూడా ఉంటుంది. సీపీసీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించేందుకు శిక్షణ ఇస్తారు. వివరాలకు 9966933693, 9492021666లో సంప్రదించవచ్చు.

ఉపాధి అవకాశాలు ఎక్కువ

ఇండియాలో ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య శ్రీవంటి పథకాలకు మెడికల్‌కోడింగ్‌ను అమలు చేయాలి. తద్వారా వాటిలో జరిగే అవినీతిని అరికట్టవచ్చు. మెడికల్ కోడింగ్‌లో యువతకు ఉపాధి అవకాశాల్ని కల్పించవచ్చు. చాలా కంపెనీల్లో మెడికల్ కోడర్‌గా ఉద్యోగ అవకాశాలున్నాయి. మెడికల్ కోడింగ్‌కు మంచి డిమాండ్ ఉంది. సైన్స్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న విద్యార్థులకు ఇది మంచి అవకాశం. గ్రామీణ విద్యార్థులు, ఆర్థికంగా వెనుకబడిన వారికోసం ఫీజులో రాయితీ ఇస్తున్నాం. ఉద్యోగం సాధించాకే డబ్బులు చెల్లించాలనే శిక్షణ ఇస్తున్నాం. పేద విద్యార్థులను సైతం ఆదుకుంటున్నాం.

- డాక్టర్ మిర్యాల సంతోష్‌కుమార్ గుప్త,
మెడిసన్ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకులు

...✍ పడమటింటి రవికుమార్
📷 చిన్న యాదగిరిగౌడ్

నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం

ఐఐటీ రోపర్‌లో

రోపర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.

- **ప్రోగ్రామ్:** పీహెచ్‌డీ (జనవరి 2020)
- **విభాగాలు:** ఇంజినీరింగ్&సైన్సెస్, బయోమెడికల్, కెమికల్, సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రికల్, మెకానికల్, మెటలర్జికల్&మెటీరియల్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఫిజిక్స్, హ్యూమానిటీస్&సోషల్ సైన్సెస్.
- ఈ ప్రోగ్రామ్ ఫుల్‌టైం, ఎక్స్‌టర్నల్, పార్ట్‌టైం ఆఫర్ చేస్తున్నారు.
- **అర్హతలు:** బీఈ/బీటెక్ లేదా ఎంఈ/ఎంటెక్ లేదా ఎంఏ, ఎమ్మెస్సీ, బీఎస్-ఎంఎస్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో, **చివరితేదీ:** నవంబర్ 3
- **వెబ్‌సైట్:** www.iitrpr.ac.in

ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)లో సైంటిస్ట్/ఇంజినీర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

ఇస్రోలో 327 ఇంజినీర్ పోస్టులు

- **పోస్టు:** సైంటిస్ట్/ఇంజినీర్ 'ఎస్‌సీ'
- **మొత్తం ఖాళీల సంఖ్య:** 327
- **విభాగాలవారీగా ఖాళీలు:** ఎలక్ట్రానిక్స్-131, మెకానికల్-135, కంప్యూటర్ సైన్స్-58, ఎలక్ట్రానిక్స్ (అటానమస్ బాడీ) -3 ఉన్నాయి. వీటిలో 31 పోస్టులు పీహెచ్‌సీ అభ్యర్థులకు కేటాయించారు.
- **పేస్కేల్:** లెవల్ 10 పేమ్యాట్రిక్స్ ప్రకారం జీతభత్యాలు చెల్లిస్తారు. ప్రారంభ వేతనం రూ.56,100/- ఉంటుంది. దీనికి అదనంగా ఇతర అలవెన్సులు ఇస్తారు.
- **అర్హతలు:** కనీసం 65 శాతం మార్కులతో లేదా 6.84/10 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2019, నవంబర్ 4 నాటికి 35 ఏండ్లు మించరాదు.
- **ఎంపిక విధానం:** దరఖాస్తు చేసుకున్నవారిని మొదట షార్ట్‌లిస్ట్ చేసి రాతపరీక్షకు ఎంపిక చేస్తారు.
- రాతపరీక్షను 2020, జనవరి 12న నిర్వహిస్తారు. రాష్ట్రంలో పరీక్ష కేంద్రం హైదరాబాద్‌లో ఉంది. రాతపరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. రాతపరీక్షలో 80 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు.
- ఇంటర్వ్యూలో కనీసం 60 శాతం మార్కులు వచ్చిన వారిని పరిగణనలోకి తీసుకుని మెరిట్ ఆధారంగా తుది ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** నవంబర్ 4
- **ఫీజు:** రూ.100/-
- **వెబ్‌సైట్:** www.isro.gov.in

నీట్-ఎండీఎస్

నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జరీ (ఎండీఎస్)లో ప్రవేశాలకు నిర్వహించే నీట్-ఎండీఎస్ 2020 ప్రకటన విడుదల చేసింది.

- **ఎంట్రెన్స్:** నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్(నీట్)- ఎండీఎస్ 2020
- **అర్హతలు:** బీడీఎస్ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఫీజు:** జనరల్/ఓబీసీలకు రూ.3,750/-. ఇతరులకు రూ. 2750/-
- **చివరితేదీ:** అక్టోబర్ 31
- **ప్రవేశపరీక్ష తేదీ:** 2019, డిసెంబర్ 20
- **వెబ్‌సైట్:** www.nbe.edu.in

నిట్‌లో ఫ్యాకల్టీలు

రాయ్‌పూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) కింది టీచింగ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు :** 63
- **పోస్టులు:** ప్రొఫెసర్-10, అసోసియేట్ ప్రొఫెసర్-16, అసిస్టెంట్ ప్రొఫెసర్-37 ఖాళీలు ఉన్నాయి.
- **విభాగాలు:** బయోమెడికల్ ఇంజినీరింగ్, బయోటెక్నాలజీ, మ్యాథ్స్, ఎంసీఏ, ఐటీ, ఫిజిక్స్, కెమికల్ ఇంజినీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజినీరింగ్, అప్లయిడ్ జియాలజీ, ఆర్కిటెక్చర్ తదితర డిపార్ట్‌మెంట్లలో ఖాళీలు ఉన్నాయి.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్/ ఎంఈ/ ఎంటెక్, పీహెచ్‌డీ ఉత్తీర్ణత, బోధనలో అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ప్రజంటేషన్/ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** నవంబర్ 15
- **వెబ్‌సైట్:** www.nitrr.ac.in

లక్నవరానికి విదేశీ శోభ!

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సును ఫ్రాన్స్‌కు చెందిన విద్యార్థుల బృందం సందర్శించింది. తేలియాడే వంతనలపై విద్యార్థులు సందడిగా గడుపుతూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

- గోవిందరావుపేట

స్వదేశీ ఆయుధాలతోనే యుద్ధం

- వాటితోనే విజయం సాధిస్తాం
- భవిష్యత్తులో జరిగే యుద్ధాలపై ఆర్మీచీఫ్ బిపిన్ రావత్ వ్యాఖ్య

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: భవిష్యత్తులో యుద్ధం సంభవిస్తే భారత్ స్వదేశీ ఆయుధాలతోనే బరిలోకి దిగి విజయం సాధిస్తుందని ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ పేర్కొన్నారు. సాయుధ దళాలలో స్వదేశీ పరిజ్ఞానాన్ని మరింతగా వినియోగించాలని చెప్పారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన డీఆర్‌డీఓ డైరెక్టర్ల 41వ సదస్సులో రావత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవిష్యత్తు యుద్ధాలను దృష్టిలో ఉంచుకొని ఆయుధాలను, ఇతర సంబంధిత వ్యవస్థలను అభివృద్ధి చేయాలని అన్నారు. భవిష్యత్తులో జరిగే యుద్ధాలలో ముఖాముఖి తలపడే అవసరం ఉండకపోవచ్చని, పరోక్ష పద్ధతుల్లో ఉండవచ్చని రావత్ అభిప్రాయపడ్డారు. అందువల్ల సైబర్‌స్పేస్, అంతరిక్షం లేజర్, ఎలక్ట్రానిక్ యుద్ధతంత్రాలు, రోబోటిక్స్‌తోపాటు కృత్రిమ మేధస్సు (ఏఐ)ని అభివృద్ధి చేయాలని సూచించారు. తక్షణమే వాటిపై దృష్టి సారించాలని లేకపోతే వెనుకబడిపోయే ప్రమాదముందని పేర్కొన్నారు. రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) గత కొన్ని దశాబ్దాలలో ఎన్నో విజయాలు సాధించిందని ఆయన కొనియాడారు. రక్షణ రంగం పరిశోధన, అభివృద్ధిలో భారత్ గొప్ప ప్రగతి సాధించిందని చెప్పారు. ఆయుధాలు, ఆయుధ సామగ్రిని దిగుమతి చేసుకునే దేశాలలో భారత్ అతిపెద్దదని పేర్కొంటూ.. 70 ఏండ్ల స్వాతంత్ర్యానంతరం ఈ స్థితిలో ఉండటం అంత గర్వకారణం కాదని రావత్ ఆవేదన వ్యక్తం చేశారు. అయితే గత కొన్నేండ్లలో పరిస్థితి ఎంతగానో మారిందని.. మన అవసరాలు, సేవలకు తగిన రీతిలో, స్వదేశీ పరిజ్ఞానం అభివృద్ధిలో డీఆర్‌డీఓ ప్రగతి సాధిస్తున్నదని చెప్పారు. తదుపరి జరిగే యుద్ధంలో భారత్ స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఆయుధ వ్యవస్థతోనే పోరాడి విజయం సాధిస్తుందన్న నమ్మకం తనకుందని పేర్కొన్నారు.

పాక్ కాల్పుల్లో మరో యువతి మృతి

- నియంత్రణరేఖ వెంబడి జనావాస ప్రాంతాలు లక్ష్యంగా భారీగా కాల్పులు

జమ్ము: జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ జిల్లా నియంత్రణ రేఖ సమీప గ్రామాలే లక్ష్యంగా పాకిస్థాన్ సైన్యం భారీ ఎత్తున జరిపిన కాల్పుల్లో మంగళవారం ఓ యువతి మరణించారు. షాపూర్ సెక్టార్‌లోని నూనబందీ ప్రాంతానికి చెందిన షమీమా అక్తర్ (24) ప్రాణాలు కోల్పోయినట్టు పూంచ్ జిల్లా అభివృద్ధి కమిషనర్ రాహుల్‌యాదవ్ తెలిపారు. సరిహద్దు గ్రామాల్లో ఉదయం నుంచి జరిగిన కాల్పుల్లో నాలుగు పశువులు కూడా చనిపోయాయని చెప్పారు. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో పూంచ్‌లోని కస్బా, కిర్నీ సెక్టార్లలో మోర్టార్లతో పాక్ కాల్పుల ఉల్లంఘనకు పాల్పడిందని రక్షణ దళాల ప్రతినిధి తెలిపారు. ఈ కాల్పులకు భారత జవాన్లు దీటుగా బదులిచ్చారని, ప్రతి కాల్పుల్లో పాక్‌వైపు జరిగిన ప్రాణనష్టం వివరాలు తెలియాల్సి ఉన్నదని చెప్పారు. కాల్పులు తీవ్రమై షాపూర్ సెక్టార్ ప్రాంతానికి విస్తరించడంతో సరిహద్దు గ్రామాల ప్రజల్లో భయానక పరిస్థితి ఏర్పడిందని.. చాలామంది ఇండ్లకే పరిమితమయ్యారని తెలిపారు. పాక్ జరిపిన కాల్పుల్లో మోర్టార్ శకలం తగిలి షమీమ్ అక్తర్ చనిపోయారని, సరిహద్దు సమీపంలోని పలు ఇండ్లు దెబ్బతిన్నాయని, కాల్పులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని చెప్పారు. నియంత్రణ రేఖ వెంబడి పాక్ జరుపుతున్న కాల్పుల ఉల్లంఘనలో నాలుగు రోజుల్లో ముగ్గురు మృతి చెందారని, రాజౌరీ జిల్లా నౌషేరా సెక్టార్‌లో, బారాముల్లా జిల్లా యూరీ సెక్టార్‌లో శుక్ర, ఆదివారాల్లో జరిగిన వేర్వేరు కాల్పుల్లో ఇద్దరు జవాన్లు మరణించారని అధికారి తెలిపారు.

నవలఖకు మరో నాలుగు వారాలు ఊరట

- భీమా కోరేగావ్ కేసులో సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: భీమా కోరేగావ్ హింస కేసులో పౌర హక్కుల కార్యకర్త గౌతం నవలఖకు అరెస్టు కాకుండా కల్పించిన ఊరటను సుప్రీంకోర్టు మరో నాలుగు వారాలు పొడిగించింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం సంబంధిత కోర్టును ఆశ్రయించాలని న్యాయమూర్తులు అరుణ్ మిశ్రా, దీపక్ గుప్తాతో కూడిన ధర్మాసనం నవలఖకు సూచించింది. ఈ కేసుపై మంగళవారం జరిగిన విచారణ సందర్భంగా.. నవలఖకు అరెస్టు కాకుండా కల్పించిన రక్షణను రద్దు చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, ఏడాదిపాటు ఆయనను ఎందుకు విచారించలేదని ప్రశ్నించింది. ఇంతకుముందు కోర్టు నవలఖను ఈ నెల 4 వరకు అరెస్టు చేయరాదని ఆదేశించింది. ఆ తరువాత గడువును ఈ నెల 15వతేదీ వరకు పొడిగించింది. తాజాగా ఆ గడువును మరో నాలుగు వారాలు పెంచింది. పుణెకు సమీపంలోని భీమా కోరెగావ్‌లో 2017లో జరిగిన హింసకు సంబంధించి నవలఖపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసేందుకు బొంబాయి హైకోర్టు తిరస్కరించింది. నిషేధిత మావోయిస్టు సంస్థలతో సంబంధాలున్నాయన్న ఆరోపణపై పోలీసులు నవలఖ మీద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ముగ్గురికి బెయిల్ నిరాకరణ

ముంబై: భీమా కోరెగావ్ హింస కేసులో నిందితులుగా ఉన్న మరో ముగ్గురు పౌర హక్కుల కార్యకర్తలు సుధా భరద్వాజ్, అరుణ్ ఫెరీరా, వెర్నాన్ గంజాల్వేస్‌కు బెయిల్ ఇచ్చేందుకు బొంబాయి హైకోర్టు మంగళవారం నిరాకరించింది. ఈ ముగ్గురు కులం పేరిట హింసను రెచ్చగొట్టారని, వారికి మావోయిస్టులతో సంబంధాలున్నాయని, నిషేధిత సీపీఐ (మావోయిస్టు) పార్టీలో వీరు క్రియాశీలక సభ్యులుగా ఉన్నారని కోర్టు పేర్కొంది. ఈ ముగ్గురికి వ్యతిరేకంగా ప్రాథమిక సాక్ష్యాధారాలున్నాయని జస్టిస్ సారంగ్ కోత్వాల్ పేర్కొన్నారు. మావోయిస్టు సంస్థకు వీరు నిధులు పోగు చేసి ఇవ్వడమే కాకుండా, ఆ సంస్థలో కొందరిని భర్తీ చేసినట్టు ఆధారాలున్నాయని చెప్పారు.

రైల్వేట్రాక్‌పై మూడు శవాలు!

అమరావతి: హిందూపురం- బెంగళూరు వెళ్లే రైలుమార్గంలో పట్టాలపై మూడు మృతదేహాలు పడి ఉండటం స్థానికంగా కలకలం రేపింది. మరణించినవారిలో ఒకరిని గోళాపురానికి చెందిన ఆదినారాయణగా స్థానికులు గుర్తించారు. వీరు ఆత్మహత్య చేసుకున్నారా, ఎవరైనా హత్యచేసి పట్టాలపై పడేశారా అన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. రైల్వేస్టేషన్‌కు కిలోమీటరు దూరంలోనే మూడు మృతదేహాలు పడి ఉండగా, ఈ మార్గంలోనే మరోచోట హిందూపురం పట్టణానికి 25 కిలోమీటర్ల దూరంలో మరోవ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించడం విశేషం.

'జేబుదొంగ'లా జనం దృష్టిని మళ్లిస్తున్నారు

- పారిశ్రామికవేత్తలకు మోదీ 'లౌడ్‌స్పీకర్'లా వ్యవహరిస్తున్నారు
- ప్రజాసమస్యల ఊసెత్తకుండా చందమామ కబుర్లు చెప్తున్నారు
- మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేత రాహుల్ ధ్వజం

మహారాష్ట్రంలోని యావత్మల్ జిల్లాలో ఎన్నికల సభలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో స్థానిక నేతలు

యావత్మల్, అక్టోబర్ 15: ప్రధాని మోదీపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అదానీ, అంబానీ లాంటి పారిశ్రామికవేత్తలకు 'లౌడ్‌స్పీకర్'లా మోదీ వ్యవహరిస్తున్నారని, ఆయన వ్యూహం ప్రజలను దోచుకోవడానికి ముందు జనం దృష్టిని మళ్లించే 'జేబుదొంగ'లా ఉన్నదని నిప్పులుచెరిగారు. మహారాష్ట్రలోని యావత్మల్ జిల్లాలో రాహుల్ మంగళవారం ఓ ఎన్నికల సభలో ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. చందమామ గురించి, జమ్ముకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి (ఆర్టికల్ 370) రద్దు గురించి మాట్లాడుతున్న మోదీ.. రైతులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న నిరుద్యోగం లాంటి సమస్యల గురించి నోరుమెదపడంలేదని దుయ్యబట్టారు. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమలు, పెద్దనోట్ల రద్దుతో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, రైతులు, కార్మికులు, పేదప్రజల వెన్నువిరిచారని, రానున్న ఆరు నెలల్లో నిరుద్యోగ సమస్య తీవ్రరూపం దాల్చనున్నదని, మోదీ అధికారంలో కొనసాగినంతకాలం ఈ సమస్య దేశాన్ని వేధిస్తూనే ఉంటుందని రాహుల్ పేర్కొన్నారు. కార్పొరేట్ పన్నును మాఫీచేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన ప్రస్తావిస్తూ.. కొంతమంది పారిశ్రామికవేత్తలకు మాత్రమే ఇలాంటి ప్రయోజనాలు కల్పిస్తున్నారని, సమాజంలోని పేదవర్గాలకు లబ్ధిచేకూర్చడంలేదని విమర్శించారు. పోర్టులు, ఎయిర్ ఇండియా, బొగ్గుగనులు, ప్రభుత్వరంగ సంస్థల్లాంటి దేశ ఆస్తులను ప్రైవేటీకరించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నదన్నారు. ఉపాధి హామీ చట్టం , ఆహార హక్కు, భూసేకరణ చట్టం, గిరిజన చట్టాలను ఆమోదించిన మోదీ సర్కారు జీఎస్టీ సవరణకు ముందుకు రావడంలేదని రాహుల్ పేర్కొంటూ.. దేశ ఆర్థిక వ్యవస్థను నడిపేది రైతులు, కార్మికులు, మధ్యతరహా పరిశ్రమలే తప్ప పారిశ్రామికవేత్తలు కాదన్నారు. 'పేదలకు డబ్బు లభిస్తే కొనుగోళ్లు మొదలవుతాయి. దీంతో డిమాండ్ పెరిగి ఉత్పత్తి ఊపందుకొంటుంది' అని ఆయన చెప్పారు. రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు ఒప్పందంలో రూ.35 వేలకోట్లు దోచుకొన్నారని, ఈ విషయాన్ని మీడియా ప్రస్తావించలేదని, పారిశ్రామికవేత్తల ఆధీనంలో మీడియా నడుస్తుండటమే కారణమని పేర్కొన్నారు. ప్రజల సొమ్మును మీడియాకు ఇస్తున్నారని, అందుకే మీడియా మోదీకి ప్రచారం చేసిపెడుతున్నదని ఆరోపించారు. 21న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎన్సీపీ కూటమికి ఓటేయాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి తీసుకొస్తే పేదలు, రైతులు, కార్మికులు, చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థల సంక్షేమం కోసం కృషిచేస్తామని చెప్పారు.



'370'పై కాంగ్రెస్ వదంతులు!

- ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలి
- హర్యానా ఎన్నికల సభలో ప్రధాని మోదీ నిప్పులు
- తిరిగి బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా



హర్యానాలోని తానేసార్ పట్టణంలో ఎన్నికల బహిరంగసభలో విజయసంకేతం చూపుతున్నప్రధాని మోదీ

చర్ఖీదాద్రి /తానేసార్(హర్యానా), అక్టోబర్ 15: జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 రద్దుపై కాంగ్రెస్ నాయకులు పుకార్లను వ్యాప్తి చేస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ విరుచుకుపడ్డారు. రానున్న హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటర్లు తగిన బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. రెండు రోజుల హర్యానా ఎన్నికల పర్యటనలో భాగంగా చర్ఖీదాద్రి, తానేసార్ పట్టణాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పై దుమ్మెత్తి పోశారు. 'ఆర్టికల్ 370 రద్దుపై కొందరు కాంగ్రెస్ నాయకులు భారత్‌లోనే గాకుండా విదేశాల్లో కూడా పుకార్లను వ్యాప్తి చేస్తున్నారు. మీరు(కాంగ్రెస్) మోదీని నిందించండి. నన్ను తిట్టడానికి కొత్త పదాలు కావాలంటే బ్యాంకాక్, థాయిలాండ్, వియత్నాం నుంచి దిగుమతి చేసుకోండి. నాకు ఎలాంటి ఇబ్బంది లేదు. అయితే, అభివృద్ధి బాటలో పయనిస్తున్న భారత్‌ను వెన్నుపోటు పొడవడం ఆపేయండి' అని అన్నారు. ఒకవేళ ప్రజలు కాంగ్రెస్‌కు అధికారాన్ని కట్టబెడితే, తాము రద్దు చేసిన కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని పునరుద్ధరించే దమ్ము ఆ పార్టీకి ఉన్నదా? అంటూ మరోసారి ప్రశ్నించారు. ఆర్టికల్ 370 రద్దుకు యావత్ జాతి సంఘీభావాన్ని తెలిపిందని అన్నారు. ఆర్టికల్ 370 రద్దుపై కాంగ్రెస్ రాజకీయాలు చేస్తున్నదని విమర్శిస్తూ.. రానున్న ఎన్నికల్లో ప్రజలు ప్రతిపక్షానికి బుద్ధి చెప్పాలని కోరారు. 'వాళ్లకు(కాంగ్రెస్ పార్టీ) కఠినమైన శిక్ష విధించాలా వద్దా? అక్టోబర్ 21న మీరు ఆ పని చేస్తారా?' అంటూ సభకు వచ్చిన ప్రజలను ప్రశ్నించారు. బీజేపీని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి హర్యానా ప్రజలు ఎప్పుడో నిర్ణయించుకున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 21న హర్యానాలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.

జిన్‌పింగ్ 'దంగల్'ను చూశారు: మోదీ

బాలీవుడ్ చిత్రం 'దంగల్'ను చూసినట్టు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తనతో చెప్పాడని మోదీ వెల్లడించారు. ఆ సినిమాలో మల్లయోధురాళ్లుగా భారతీయ ఆడ బిడ్డల ప్రదర్శన అద్భుతంగా ఉన్నదని ఆయన చెప్పినప్పుడు తానెంతో గర్వపడ్డానని ప్రధాని పేర్కొన్నారు. ఇటీవల భారత్‌కు విచ్చేసిన జిన్‌పింగ్‌తో జరిగిన అనధికార సమావేశంలో 'దంగల్' ప్రస్తావన వచ్చినట్టు ఆయన తెలిపారు. కామన్వెల్త్ క్రీడల్లో బంగారు పతకం సాధించిన అంతర్జాతీయ రెజ్లర్(మల్లయోధురాలు) బబితా ఫోగట్‌కు మద్దతుగా చర్ఖీదాద్రి నియోజకవర్గంలో నిర్వహించిన సభలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'మహ్రో చోరీ చోరోన్ సే కమ్ హే కే (మగ బిడ్డల కంటే మన ఆడ బిడ్డలు ఎందులో తక్కువ?)' అంటూ హర్యానా ప్రజానీకాన్ని ప్రశ్నించారు. ఇటీవలే బబితా ఫోగట్, ఆమె తండ్రి మహావీర్ ఫోగట్ బీజేపీలో చేరారు. బబిత హర్యానాలోని చర్ఖీదాద్రి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. మహావీర్ ఫోగట్ మల్ల విద్యలో తన కుమార్తెలకు శిక్షణ ఇచ్చి వారిని విజయపథంలో నడిపారు. వీరి జీవిత కథను ఆధారంగా చేసుకుని 2016లో దంగల్ చిత్రం విడుదలైంది.

భగీరథ నీటితో సంపూర్ణ ఆరోగ్యం

- మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి
- నీటినాణ్యత, వినియోగంపై క్షేత్రస్థాయి పర్యటన

నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో మిషన్ భగీరథ నీటిని పరిశీలిస్తున్న ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి, నల్లగొండ ఎస్ఈ పాపారావు, ఈఈ రాకేశ్ తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మిషన్‌భగీరథ నీటితో ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని మిషన్‌భగీరథ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతిఒక్కరికి శుద్ధిచేసిన తాగునీటిని అందించేందుకు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి మిషన్‌భగీరథ ద్వారా నీటిని సరాఫరా చేస్తున్నామని చెప్పారు. మిషన్‌భగీరథ ద్వారా వస్తున్న నీటినాణ్యత, వినియోగంపై తనిఖీ చేసేందుకు అధికారుల బృందం మంగళవారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని కొండూరు, కొట్టాల, అశ్వాపూర్ కాలనీల్లో పర్యటించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజినీర్ విజయ్‌ప్రకాశ్‌తోకలిసి కృపాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అత్యున్నత ప్రమాణాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మిషన్‌భగీరథ నీళ్లు శుద్ధి అవుతున్నాయని చెప్పారు. ప్రజలు కొన్నేండ్లుగా ఆర్వో(రివర్స్ ఆస్మాసిస్) నీళ్లు తాగి ఒళ్లు నొప్పులు, మోకాళ్లనొప్పులతో బాధపడుతున్నారన్నారు. ఆర్వో నీటితో జీర్ణసంబంధ సమస్యలు, విటమిన్ డీ లోపం వచ్చే అవకాశం ఉన్నదని డాక్టర్లు చెప్తున్నారన్నారు. మంచినీళ్ల దందా చేస్తున్న కొందరు వ్యాపారులు భగరథ నీటినాణ్యతపై చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని కోరారు. నల్లాపైపులు డ్యామేజీ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామస్థులదేనన్నారు. మిషన్ భగీరథ నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. మర్రిగూడెం మండలం బాట్లపల్లిలో నిర్మించిన నీటిశుద్ధికేంద్రంలో సంగారెడ్డి, నల్లగొండ జిల్లా ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రజలందరూ భగీరథ నీటిని తాగేలా ఇంజినీర్లు బాధ్యత తీసుకోవాలని కోరారు. కృపాకర్‌రెడ్డి స్వయంగా మిషన్‌భగీరథ నీటిని తాగి గ్రామస్థులకు భరోసా కల్పించారు. ఆ తర్వాత ఇంటింటికి తిరిగి నల్లా కనెక్షన్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎస్ఈ పాపారావు, ఈఈ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

అవసరమైతే చిదంబరంను అరెస్ట్ చేయండి

- ఈడీకి అనుమతించిన ఢిల్లీ ప్రత్యేక కోర్టు
- తీహార్ జైలులోనే ఆయనను విచారించాలని సూచన
- బెయిలివ్వాలంటూ సుప్రీంకోర్టు తలుపుతట్టిన చిదంబరం

న్యూఢిల్లీ: సీనియర్ కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ ఆర్థికశాఖ మంత్రి పీ చిదంబరానికి ఢిల్లీ ప్రత్యేక కోర్టు మంగళవారం నాడు మరో షాకిచ్చింది. ఐఎన్ఎక్స్ మీడియా మనీ లాండరింగ్ కేసులో చిదంబరాన్ని విచారించేందుకు ప్రత్యేక కోర్టు.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కు అనుమతించింది. అవసరమైతే అరెస్ట్ చేసేందుకు వీలుగా ఆదేశాలు కూడా జారీ చేసింది. చిదరంబరం అరెస్ట్‌కు అనుమతించాలని ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు విన్న ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అజయ్ కుమార్ కుషార్ సోమవారం తీర్పును రిజర్వ్‌లో పెట్టారు. మంగళవారం తీర్పు ప్రకటించిన ప్రత్యేక కోర్టు.. చిదంబరంను ఈడీ ప్రశ్నించవచ్చునని, అవసరమైనపక్షంలో అరెస్ట్ చేయవచ్చునని కూడా ఆదేశించింది. కోర్టులోనే ప్రశ్నించేందుకు అవకాశం ఇవ్వాలని ఈడీ కోరగా.. గౌరవ మర్యాదలున్న వ్యక్తిని కోర్టు ఆవరణలో ప్రశ్నించడం భావ్యం కాదని, బుధవారం తీహార్ జైలుకే వెళ్లి ప్రశ్నించమని ప్రత్యేక కోర్టు సూచించింది. మరోవైపు, చిదంబరానికి బెయిల్ మంజూరు చేయాలంటూ ఆయన తరపున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వి సుప్రీం కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ఏ సాక్షిని సంప్రదించడానికి లేదా ప్రభావితం చేయడానికి ప్రయత్నించినట్టుగా చిదంబరంపై గానీ, ఆయన కుటుంబసభ్యులపై గానీ ఎలాంటి ఆరోపణలు లేవని, అలాగే ఆర్థిక నష్టం కలిగించడం గానీ, నిధులను మళ్లించడం గానీ చేసినట్టు ఆయనపై నిందలు మోపలేదని జస్టిస్ ఆర్ భానుమతి నేతృత్వంలోని బెంచ్‌కు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వి తెలిపారు. సాలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బుధవారం సీబీఐ తరపున వాదనలు వినిపించనున్నారు. కాగా, ఐఎన్ఎక్స్ మీడియా అవినీతి కేసులో సెప్టెంబర్ 5వ తేదీ నుంచి చిదంబరం తీహార్ జైలులో ఉంటున్నారు. ఈ నెల 17 వరకు ఆయన సీబీఐ జ్యూడిషియల్ కస్టడీలో ఉండనున్నారు.

గుట్టుగా గుప్తనిధుల వేట!

- హుజురాబాద్ కేంద్రంగా విస్తరించిన ముఠా
- రాష్ట్రంతోపాటు ఇతరరాష్ట్రాల్లో తవ్వకాలు
- పురాతన ఆలయాలు, కోటలే లక్ష్యం
- సూత్రధారి పూజారి.. ముఠాలో ప్రముఖులు

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గొడిశాలలో గుప్తనిధుల తవ్వకాలతో ధ్వంసమైన పంచలింగేశ్వరాలయం

హుజురాబాద్ నమస్తే తెలంగాణ: కరీంనగర్ జిల్లా హుజురాబాద్ కేంద్రంగా గుప్తనిధుల వేట ముమ్మరంగా కొనసాగుతున్నది. ఈ తతంగానికి హుజూరాబాద్‌కు చెందిన ఓ ప్రముఖ పూజారే సూత్రధారిగా వ్యవహరిస్తున్నాడని, ముఠాలో ప్రముఖ వ్యక్తులు ఉన్నట్లు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. రెండు, మూడేండ్ల కిందట ఈ ముఠా రాత్రి వేళల్లో పలుచోట్ల గుప్తనిధుల కోసం వేటకొనసాగించగా తర్వాత సద్దుమణిగింది. మూడు నెలల నుంచి ఈ ముఠా సభ్యులు తిరిగి గుప్తనిధుల వేటల్లో పడ్డారని తెలిసింది. గతంలో జరిపిన తవ్వకాల్లో ఆశించినంతగా గుప్తనిధులు దొరక్కపోవడంతో వీరు నిరుత్సాహడినట్టు సమాచారం. ఇటీవల వీరికి గుప్తనిధులకు సంబంధించిన కొత్త ఆధారాలు లభించడంతో వేట ముమ్మరం చేసినట్టు తెలిసింది.

అత్యాధునిక పరికరాలతో వేట

గుప్తనిధుల వేటలో ఈ ముఠా హుజూరాబాద్ నుంచే తవ్వకాలు మొదలుపెట్టింది. పట్టణ సమీపంలోని రంగనాయకుల గుట్టపై ఆ ముఠా తవ్వని చోటులేదు. దీంతో పాటు ఇప్పలనర్సింగాపూర్‌లోని కాకతీయ కెనాల్ వద్దగల మైసమ్మ బండలను పెకిలించారు. సైదాపూర్ మండలంలోని గొడిశాల శివాలయం, సర్వాయిపాపన్న గుట్ట, సైదాపూర్ సింగరాయగుడి, శంకరపట్నం మండలం మొలంగూర్ ఖిల్లా తదితర పురాతన ఆలయాల్లోనూ వేట కొనసాగించారు. తిమ్మాపూర్ మండలంలోని నల్లగొండ గుట్ట వద్దకూడా తవ్వకాలు చేపట్టింది. ఈ ముఠా రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర రాష్ట్రాల్లోనూ గుప్తనిధుల తవ్వకాల కోసం వేట సాగిస్తున్నది. కొన్నిరోజుల కిందట శ్రీశైలంలోనూ తవ్వకాలు చేపట్టినట్టు సమాచారం. గుప్తనిధుల తవ్వకాల్లో ఈ ముఠా అత్యాధునిక స్కానర్, ల్యాప్‌టాప్, మొబైల్, మొటల్‌డిటెక్టర్‌ను ఉపయోగిస్తున్నదని సమాచారం. పురాతన కట్టడాలు, గుళ్లు, సమాధుల పూర్తి సమాచారం, పురావస్తుశాఖ, తాళపత్ర గ్రంథాలు, పురాణాల ద్వారా తెలుసుకుని మరీ తవ్వకాలు చేపటడుతున్నట్టు తెలిసింది. పురావస్తు శాఖలోని కొందరు అధికారులు ఈ ముఠాకు సహకారం అందించి విలువైన సమాచారాన్ని చేరవేస్తున్నట్టు సమాచారం. గుప్తనిధుల తవ్వకాలకు పాల్పడే ఈ ముఠాలకు అడ్డుకట్ట వేసి చారిత్రక సంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

నన్ను ఘోరంగా అవమానించారు

- దుర్గాపూజ వేడుకల్లో చివర్లో సీటు కేటాయించారు
- పశ్చిమ బెంగాల్ గవర్నర్ జగదీప్ ధంఖర్

కోల్‌కతా, అక్టోబర్ 15: దుర్గాపూజ వేడుకల్లో తనను ఘోరంగా అవమానించారని పశ్చిమ బెంగాల్ గవర్నర్ జగదీప్ ధంఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం మమతా బెనర్జీ ప్రభుత్వం తీరుపై ఆయన మండిపడ్డారు. శుక్రవారం కోల్‌కతాలో జరిగిన ఓ భారీ కార్యక్రమంలో ప్రముఖ రంగాలకు చెందిన కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేదిక చివర్లో తనకు సీటు కేటాయించడంపై గవర్నర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనివల్ల కార్యక్రమాలను పూర్తిగా ఆస్వాదించలేకపోయినట్లు పేర్కొన్నారు. 'పండుగ వేడుకల్లో నేను అవమానానికి గురయ్యాను. దీనిపై చాలా మనస్తాపం చెందాను. అవమానం జరిగింది నాకు మాత్రమే కాదు. పశ్చిమ బెంగాల్ ప్రజలందరికీ జరిగినట్లే. ఇలాంటి అవమానాన్ని వారు సహించలేరు. నేను పశ్చిమ బెంగాల్ ప్రజల సేవకుడ్ని. రాజ్యాంగపరమైన బాధ్యతలను నిర్వర్తించడంలో నన్నెవరూ అడ్డుకోలేరు' అంటూ మమతా బెనర్జీ ప్రభుత్వంపై గవర్నర్ జగదీప్ ధంఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫరూఖ్ అబ్దుల్లా సోదరి, కుమార్తె అరెస్టు

- శ్రీనగర్‌లో నిరసనకు యత్నం

నల్ల రిబ్బన్లతో నిరసన తెలుపుతున్న ఫరూఖ్ అబ్దుల్లా సోదరి సురయ్యా, కుమార్తె సఫియా

శ్రీనగర్, అక్టోబర్ 15: ఆర్టికల్ 370ని రద్దు చేయడం, జమ్ముకశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించడాన్ని వ్యతిరేకిస్తూ శ్రీనగర్‌లో నిరసనకు దిగిన మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా సోదరి, కుమార్తెను అరెస్టు చేశామని అధికారులు తెలిపారు. అబ్దుల్లా సోదరి సురయ్యా, కుమార్తె సఫియా ఆధ్వర్యంలో మొత్తం ఆరుగురు మహిళా నిరసనకారులు చేతులకు నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ మంగళవారం ఆందోళన చేసేందుకు సిద్ధమయ్యారు. సీఆర్పీఎఫ్ మహిళా సిబ్బంది అ

'లూసిఫర్' రీమేక్‌కు సిద్ధం!

చిరంజీవి

మోహన్‌లాల్ కథానాయకుడిగా నటించిన 'లూసిఫర్' చిత్రం మలయాళంలో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. దాదాపు 200కోట్ల వసూళ్లతో మలయాళ చిత్రసీమలో రికార్డ్ సృష్టించింది. ఈ సినిమా తెలుగు రీమేక్ హక్కులను రామ్‌చరణ్ దక్కించుకున్న విషయం తెలిసిందే. స్వీయ నిర్మాణ సంస్థ కొణిదెల ప్రొడక్షన్స్ పతాకంపై చిరంజీవి కథానాయకుడిగా ఈ చిత్రాన్ని తెలుగులో పునర్నిర్మించేందుకు రామ్‌చరణ్ సన్నాహాలు చేస్తున్నారు. అయితే ఈ ప్రతిష్టాత్మక సినిమాకు ఎవరు దర్శకత్వం వహిస్తారనే విషయం ఆసక్తికరంగా మారింది. ప్రముఖ దర్శకుల పేర్లు తెరపైకి వస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం సుకుమార్ నిర్దేశక బాధ్యతల్ని స్వీకరించబోతున్నారని తెలిసింది. 'రంగస్థలం' రూపంలో రామ్‌చరణ్‌కు చిరస్మరణీయమైన విజయాన్ని అందించారు సుకుమార్. ఎమోషనల్ యాక్షన్ ఫిల్మ్‌గా రూపొందిన 'లూసిఫర్' కథను సుకుమార్ సమర్థవంతంగా హ్యాండిల్ చేయగలరని రామ్‌చరణ్ ధీమాతో ఉన్నారట. చిరంజీవి సైతం సుకుమార్ ప్రతిభాపాటవాలపై విశ్వాసం వ్యక్తం చేశారట. దాంతో ఆయన్ని దర్శకుడిగా ఖరారు చేశారని చెబుతున్నారు. ఈ చిత్రంలో రామ్‌చరణ్ కూడా కీలక పాత్రలో నటిస్తారని అంటున్నారు. వచ్చే ఏడాది ప్రథమార్థంలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని తెలుస్తున్నది. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ కథానాయకుడిగా నటించనున్న చిత్రం త్వరలో ప్రారంభంకాబోతుంది. కొరటాల శివ దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కనున్న తాజా చిత్రం ఇటీవలే లాంఛనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ రెండు చిత్రాలు పూర్తయిన తర్వాతే చిరంజీవి-సుకుమార్ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కిస్తారని సమాచారం.

సుకుమార్

'వెంకీమామ' చిత్రంలో నాగచైతన్య, వెంకటేష్

కొత్తదనం కోసమే..!

శృతిహాసన్

'నాపై వచ్చే విమర్శల్ని ఎప్పుడూ పట్టించుకోను. బాహ్య ప్రపంచంలో ఎదురయ్యేఅవరోధాల్ని ఎలా ఎదుర్కోవాలో నాకు తెలుసు' అని అంటోంది శృతిహాసన్. గత రెండేళ్లుగా సినిమాలకు దూరంగా ఉంటున్నది ఈ సొగసరి. అనారోగ్య సమస్యల కారణంగా శృతిహాసన్ సినిమాలకు దూరమైనట్లు పుకార్లు షికారు చేస్తున్నాయి. ఈ వార్తలపై శృతిహాసన్ స్పందిస్తూ 'ఎలాంటి సమస్య ఎదురైనా ఆత్మస్థైర్యంతో దాని నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తాను. అంతేకానీ కుటుంబ సభ్యులు, స్నేహితుల సహాయాన్ని తీసుకోను. నేను అనారోగ్యానికి గురయ్యానని వస్తున్న వార్తల్లో నిజం లేదు. కెరీర్ తొలినాళ్ల నుంచి మూసధోరణితో కూడిన పాత్రలు నన్ను వెతుక్కుంటూ వస్తున్నాయి. కమర్షియల్ చిత్రాలకు సరిపోయే నటిగానే నన్ను గుర్తిస్తున్నారు. కొత్తదనం లేని అలాంటి సినిమాల్ని అంగీకరించకూడదనే స్వీయ నిర్ణయం మేరకే విరామం తీసుకున్నాను' అని తెలిపింది.

యాక్షన్ థ్రిల్లర్ 'ఖైదీ'

కార్తీ

కార్తీ కథానాయకుడిగా నటిస్తున్న తమిళ చిత్రం 'ఖైథీ' తెలుగులో 'ఖైదీ' పేరుతో అనువాదమవుతున్నది. లోకేష్ కనకరాజ్ దర్శకుడు. దీపావళి కానుకగా విడుదలకానుంది. శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై నిర్మాత కె.కె.రాధామోహన్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఆయన చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'పాటలు, రొమాన్స్ వంటి అంశాలు లేకుండా వినూత్న పంథాలో ఈ చిత్రాన్ని రూపొందించారు. కథానాయిక కూడా ఉండదు. యాక్షన్ మరియు థ్రిల్లింగ్ అంశాలతో వాస్తవికతకు పెద్దపీట వేస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. తండ్రీకూతురు సెంటిమెంట్ ప్రధానాంశంగా కథ సాగుతుంది. కార్తీ పాత్ర చిత్రణ మునుపెన్నడూ చూడని విధంగా కొత్తదనంతో సాగుతుంది. ఇటీవల విడుదలైన ట్రైలర్ అందరిలో ఉత్సుకతను రేకెత్తిస్తున్నది. కార్తీ కెరీర్‌లో మరో విభిన్న కథా చిత్రంగా మెప్పిస్తుంది' అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సత్యన్‌సూర్యన్.

ఔత్సాహికుల్ని ప్రోత్సహిస్తున్నారు

మామిడి హరికృష్ణ, తేజ, ఉత్తేజ్, సురేందర్‌రెడ్డి

సీనియర్ నటుడు, రచయిత ఉత్తేజ్ నిర్వహిస్తున్న మయూఖా టాకీస్ యాక్టింగ్ స్కూల్ సర్టిఫికెట్స్ ప్రదానోత్సవం మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, దర్శకులు సురేందర్‌రెడ్డి, తేజ, నిర్మాతలు రాహుల్ యాదవ్, లక్ష్మీకాంత్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మామిడి హరికృష్ణ మాట్లాడుతూ 'నటుడిగా, రచయితగా, కవిగా, వక్తగా ముప్పై ఏళ్ల ప్రస్థానంలో ఉత్తేజ్ తనని తాను అద్భుతంగా తీర్చిదిద్దుకున్నాడు. ఇప్పుడు యాక్టింగ్ స్కూల్ ద్వారా ఔత్సాహికుల్ని పరిశ్రమకు పరిచయం చేయడం అభినందనీయం. ఆయనకున్న అపార అనుభవమే ఈ ఇనిస్టిట్యూట్ విజయానికి ప్రధాన కారణం' అన్నారు. 'ఉత్తేజ్‌తో ముప్పైఏళ్లుగా పరిచయం ఉంది. సినీరంగంలో తన సుదీర్ఘ అనుభవాన్ని ఉపయోగించుకొని మంచి లక్ష్యంతో ఈ స్కూల్‌ను ప్రారంభించారు' అని దర్శకుడు తేజ తెలిపారు. సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ 'హైదరాబాద్ వచ్చి ఓ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్న తర్వాత నాకు సహాయ దర్శకుడిగా అవకాశం వచ్చింది. తాము ఎంచుకున్న విభాగంలో శిక్షణ ఎంత ముఖ్యమో నా కెరీరే ఉదాహరణగా చెప్పొచ్చు. ఉత్తేజ్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ గొప్పగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నాను' అన్నారు. ఉత్తేజ్ మాట్లాడుతూ 'రెండు బ్యాచ్‌ల విజయంతో ఈ ఇనిస్టిట్యూట్‌పై కొంతమంది మిత్రులు వ్యక్తం చేసిన సందేహాలు తీరిపోయాయి. ఈ విజయానికి సహకరిస్తున్న నా సిబ్బందికి కృతజ్ఞతలు' అన్నారు. యాక్టింగ్ స్టూడెంట్స్‌కు దర్శకులు సురేందర్‌రెడ్డి, తేజ చేతుల మీదుగా సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు.

ఛోటా కె నాయుడు

'ప్రస్తుతం సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉంటున్నాను. ఔత్సాహిక దర్శకులతోనే ఎక్కువగా పనిచేయడానికి ప్రాధాన్యతనిస్తున్నాను. అందులో నా స్వార్థం ఉంది. కొత్త వారు నవ్యమైన ఆలోచనలతో సినిమాలు చేస్తారు కాబట్టి వారి నుంచి కెరీర్‌కు ఉపయోగపడే చాలా విషయాల్ని నేర్చుకోవచ్చు' అని అన్నారు సినిమాటోగ్రాఫర్ ఛోటా కె నాయుడు. ఆయన ఛాయాగ్రహణాన్ని అందించిన తాజా చిత్రం 'రాజుగారి గది-3'. ఓంకార్ దర్శకుడు. ఈ నెల 18న విడుదలకానుంది. మంగళవారం హైదరాబాద్‌లో ఛోటా కె నాయుడు పాత్రికేయులతో ముచ్చటించారు.

లాయర్ హంగామా


సందీప్‌కిషన్

సందీప్‌కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'తెనాలి రామకృష్ణ బీఏబీఎల్'. జి. నాగేశ్వరరెడ్డి దర్శకుడు. హన్సిక, వరలక్ష్మి శరత్‌కుమార్ కథానాయికలు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. నవంబర్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఇటీవలే విడుదలైన ఫస్ట్‌లుక్, టీజర్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. ఓ లాయర్ జీవితంలో ఎదురైన సంఘటనలకు వినోదాత్మకరూపంలా ఈ చిత్రం అలరిస్తుంది. కామెడీతో పాటు సెంటిమెంట్, ఎమోషన్ అంశాలుంటాయి. తెలుగు, తమిళ భాషల్లో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. మురళీశర్మ, వరలక్ష్మీశరత్‌కుమార్, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, ప్రభాస్ శ్రీను, పృథ్వీ, రఘుబాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాయిశ్రీరామ్, సంగీతం: సాయికార్తీక్, స్క్రీన్‌ప్లే: రాజు, గోపాలకృష్ణ, సంభాషణలు: నివాస్, భవానీప్రసాద్, నిర్మాణ సంస్థ: శ్రీ నీలకంఠేశ్వర స్వామి క్రియేషన్స్, నిర్మాతలు: నాగిరెడ్డి, సంజీవ్‌రెడ్డి, రూప జగదీష్.

కొత్తవాళ్ల దగ్గర నేర్చుకుంటాను!

దర్శకుడు ఓంకార్‌తో చాలా కాలంగా పరిచయముంది. అతడు ఇంతకుముందు దర్శకత్వం వహించిన 'జీనియస్', 'రాజుగారి గది' చిత్రాలకు నేను సినిమాటోగ్రాఫర్‌గా పనిచేయాల్సింది. అనివార్య కారణాల వల్ల కుదరలేదు. ఈ సినిమాతో మా కలయిక కుదిరింది. 'మీ శైలి హంగులతో కూడిన పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్ ఇది' అని చెప్పి ఒప్పించాడు ఓంకార్. హారర్ అంశాలు మిళితమైన వినోదభరిత చిత్రమిది. ఓంకార్ గత చిత్రాలకు మించిన వినోదం ఉంటుంది. హీరోగా అశ్విన్ ఈ సినిమాకు న్యాయం చేయగలడా లేడా అని తొలుత సందేహించాను. నృత్యాలు, పోరాటాలు, సంభాషణలు.. అన్నింటిని సింగిల్‌టేక్‌లో పూర్తి చేసి నా అంచనాలు తప్పని నిరూపించాడు. అవికా సహజ అభినయాన్ని కనబరిచింది.

దర్శకత్వం చేయను..

'అమ్మ రాజీనామా' చిత్రంతో సినిమాటోగ్రాఫర్‌గా నా ప్రయాణం ప్రారంభమైంది. కానీ తొలుత 'రగులుతున్న భారతం' చిత్రం విడుదలైంది. ఛాయాగ్రాహకుడిగా తొంభైకి పైగా సినిమాలు పూర్తిచేశాను. ప్రస్తుతం రూపొందుతున్న సినిమాలతో పాటు సినిమాటోగ్రఫీ విభాగంలో ఆస్కార్‌కు నామినేట్ అయినా చిత్రాల్ని చూస్తూ అప్‌డేట్ అవుతుంటాను. నాకు కోపం ఎక్కువని, ఎవరి మాట వినన్నని.. నాతో పనిచేయడం కష్టమనే అభిప్రాయం చిత్రసీమలో చాలా మందిలో ఉంది. తొలినాళ్ల నుంచి వృత్తిపట్ల ప్రేమతో పనిచేస్తున్నాను. నా తత్వం అంతే. నా అభిప్రాయం ఏదైనా నిర్మొహమాటంగా చెబుతుంటాను. ఎవరికీ భయపడను. నాకున్న కోపానికి, మనస్తత్వానికి సినిమాకు దర్శకత్వం వహించడం కష్టమని నా అభిప్రాయం. నేను దర్శకత్వం వహిస్తున్నానంటే సినిమాపై చాలా అంచనాలుంటాయి. అందుకు తగిన కథ దొరికితే భవిష్యత్తులో దర్శకత్వం గురించి ఆలోచిస్తా. నా దగ్గరకు వచ్చే దర్శకుల్ని కథేమిటని అడగకుండా తొలుత బ్యాక్‌డ్రాప్ ఏమిటో తెలుసుకుంటాను. అది నచ్చితేనే సినిమా అంగీకరిస్తాను.

తొలి హారర్ సినిమా..

నా కెరీర్‌లో యాక్షన్, ప్రేమకథలు, సెంటిమెంట్ ఇలా అన్ని రకాల జోనర్‌లలో సినిమాలు చేశాను. కానీ హారర్ కథాంశానికి కెమెరామెన్‌గా పనిచేయడం ఇదే తొలిసారి. ప్రేమకథలతో పాటు యాక్షన్ సినిమాలకు పనిచేయడంలో కంఫర్ట్ ఎక్కువగా ఉంటుంది. సంతోష్‌శివన్ నా అభిమాన ఛాయాగ్రాహకుడు. అన్ని నాకే తెలుసు అనే భావనతో ఎప్పుడూ ఉండను. అవసరమైతే కొత్తవాళ్ల నుంచి సినిమాటోగ్రఫీకి సంబంధించిన మెళుకువలను నేర్చుకోవడానికి మోహమాటపడను. నూతన కెమెరామెన్‌ల పనితనం నచ్చితే వారిని స్వయంగా అభినందిస్తుంటాను.

ప్రేమ విజేత

అనురాగ్

'వైజాగ్ నేపథ్యంలో సాగే కథ ఇది. చదువు పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థిగా, బరువు బాధ్యతలు లేని బలాదూర్ యువకుడిగా భిన్న పార్శ్వాలతో నా పాత్ర నవ్యపంథాలో సాగుతుంది' అని అన్నారు అనురాగ్ కొణిదెన. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'మళ్లీ మళ్లీ చూశా'. కె.కోటేశ్వరరావు నిర్మాత. హేమంత్ కార్తిక్ దర్శకుడు. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలకానుంది. మంగళవారం హైదరాబాద్‌లోఅనురాగ్ మాట్లాడుతూ 'పక్కా కమర్షియల్ లవ్ ఎంటర్‌టైనర్ ఇది. స్వచ్ఛమైన ప్రేమకథతో రూపొందించాం. కాకతాళీయంగా దొరికిన డైరీ ఓ యువకుడి జీవితాన్ని ఎలాంటి మలుపులు తిప్పింది? ఓ అమ్మాయిని అన్వేషిస్తూ వైజాగ్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన అతడు ఆమె జాడను ఎలా కనుగొన్నాడు?ప్రేమ సమరంలో ఆ యువకుడు ఎలా విజేతగా నిలిచాడన్నది ఆకట్టుకుంటుంది. రచయితగా కెరీర్‌ను ప్రారంభించిన హేమంత్ కార్తిక్ దర్శకుడిగా ఈ సినిమాతో ప్రతిభను చాటుకున్నారు. ప్రతి సన్నివేశాన్ని సహజంగా తీర్చిదిద్దారు. కథ నచ్చడంతో మా సంస్థలోనే సొంతంగా సినిమాను నిర్మించాం. హీరోగానే కాకుండా నిర్మాణ బాధ్యతల్ని దగ్గరుండి చూసుకున్నాను. చిత్రనిర్మాణ రంగంలోని సాదకబాధకాలేమిటో ఈ సినిమాతో అర్థమయ్యాయి. నా స్వస్థలం హైదరాబాద్. రామానాయుడు ఫిల్మ్ స్కూల్‌లో నటనలో శిక్షణ తీసుకున్నాను. థ్రిల్లర్ కథాంశంతో తదుపరి సినిమా చేయబోతున్నాను' అని తెలిపారు.

ఇన్‌స్టాగ్రామ్

లేడీ అర్జున్‌రెడ్డిగా కనిపించాలి!

బాలీవుడ్ చిత్రసీమలో జాన్వీకపూర్ యువతరం కలలరాణిగా భాసిల్లుతోంది. అనతికాలంలోనే ఈ సొగసరి చక్కటి స్టార్‌డమ్‌ను సంపాదించుకుంది. ప్రస్తుతం ఈ సుందరి భారతీయ తొలి మహిళా పైలట్ గుంజన్ సక్సేనా బయోపిక్‌లో నటిస్తున్నది. పాత్రలపరంగా సవాళ్లను తాను ఇష్టపడతానని, మహిళల్లోని భిన్న పార్శ్వాల్ని ఆవిష్కరించే క్యారెక్టర్స్ ఇష్టమని పేర్కొంది. 'స్త్రీలోని తెలియని కోణాల్ని, నిగూఢమైన అంతరంగాన్ని ఆవిష్కరించే కథలు రావాల్సిన అవసరం ఉంది. 'కబీర్‌సింగ్' (తెలుగు 'అర్జున్‌రెడ్డి' హిందీ రీమేక్) చిత్రంలో హీరో పాత్ర తరహాలో అంతటి శక్తివంతమైన మహిళా క్యారెక్టర్స్ చేయాలని వుంది. ఓ స్త్రీ కబీర్‌సింగ్‌లోకి పరకాయప్రవేశం చేస్తే ఎలా ఉంటుందో చూడాలన్నది నా అభిలాష. లింగ భేదాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరిలో అనూకూల, ప్రతికూల భావాలు ఉంటాయి. వాటిని తెరపై తీసుకొస్తే నవ్యత ప్రతిఫలిస్తుంది' అని పేర్కొంది.

రాజమౌళి ఈగ స్ఫూర్తితో..

ఇందు

'చీమకు, ప్రేమకు మధ్య ఓ అందాల భామ వస్తే ఏం జరిగిందో తెలియాలంటే మా సినిమా చూడాల్సిందే' అంటున్నారు శ్రీకాంత్ శ్రీ అప్పలరాజు. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'చీమ-ప్రేమ మధ్యలో భామ!'. అమిత్, ఇందు జంటగా నటిస్తున్నారు. ఎస్.ఎన్.లక్ష్మీనారాయణ నిర్మిస్తున్నారు. ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆలపించిన టైటిల్ సాంగ్‌ను చిత్రబృందం ఇటీవల విడుదలచేసింది. శ్రీరవివర్మ ఈ గీతానికి స్వరాలను సమకూర్చారు. దర్శకుడు మాట్లాడుతూ 'చీమ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. కొత్త వాళ్లం అంతా కలిసి చేస్తున్న ఈ నవ్యమైన ప్రయత్నం తప్పకుండా తెలుగు ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకం ఉంది. చీమ పాత్రను అపురూపంగా తెరపై మలచిన తీరును వివరిస్తూ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆలపించిన టైటిల్ సాంగ్ పదికాలాల పాటు అందరిని అలరిస్తుందనే నమ్మకం ఉంది. రాజమౌళి 'ఈగ'స్ఫూర్తితో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం' అని తెలిపారు.

దిల్‌రాజు సలహాలు ఉపకరించాయి

గార్గేయి, బవసశంకర్

'కుల వివక్ష అనేది సమాజంలో చాలా చోట్ల కనిపిస్తుంది. కానీ ఈ సమస్య పట్ల తమ అభిప్రాయాల్ని బయటకు ఎవరూ వ్యక్తం చేయకుండా మనసులోనే దాచుకుంటుంటారు' అని చెప్పింది గార్గేయి. ఆమె కథానాయికగా నటించిన చిత్రం 'ఎవ్వరికీ చెప్పొద్దు'. బసవ శంకర్ దర్శకుడు. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. మంగళవారం హైదరాబాద్‌లో గార్గేయి పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాను. తొమ్మిదేళ్ల వయసులో నా నట ప్రయాణం ప్రారంభమైంది. తొలుత సీరియల్‌లో నటించాను. నటీనటులు కావాలనే నిర్మాణ సంస్థ ఇచ్చిన ప్రకటన చూసి నా వివరాలు, ఫొటోలు పంపించాను. సినిమాలో కథానాయికగా అవకాశం వస్తుందని ఊహించలేదు. దర్శకుడు కథ చెబుతున్నప్పుడే నేను చాలా ఎంజాయ్ చేశాను. ఇలాంటి సంఘటనలు చాలా కుటుంబాల్లో జరుగుతాయని అనిపించింది. అది నచ్చే సినిమా అంగీకరించాను' చెప్పింది. దర్శకుడు బసవశంకర్ మాట్లాడుతూ 'నా ప్రాణస్నేహితుడి జీవితంలో జరిగిన సంఘటనల నుంచి స్ఫూర్తి పొంది ఈ కథ రాసుకున్నాను. సినిమా చూసిన వారంతా బాగుందని అంటున్నారు. రాఘవేంద్రరావు ఈ సినిమా చూసి క్యాస్ట్ ఇష్యూను విసుగుతెప్పించకుండా ఇంత అర్థవంతంగా, వినోదభరితంగా ఇప్పటివరకు ఎవరూ చెప్పలేదని ప్రశంసించారు. సినిమా రూపకల్పనలో దిల్‌రాజు సలహాలు చాలా వరకు ఉపయోగపడ్డాయి' అన్నారు.